


శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 70 | శనివారం | 07-02-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## అండర్ 19 ప్రపంచకప్ భారత్‌దే

ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై ఘన విజయం

జింబాబ్వేలోని హరారే వేదికగా జరిగిన 2026 అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను 100 పరుగుల తేడాతో చిత్తు చేసి, టీమ్ ఇండియా రికార్డు స్థాయిలో ఆరోసారి విశ్వవిజేతగా నిలిచింది.

12

## డొనాల్డ్ ట్రంప్ ముందు మోదీ లొంగారు

- అందుకే అమెరికాతో వాణిజ్య ఒప్పందం
- సన్న, చిన్నకారు రైతులకు రక్షణలేకుండా పోయింది
- సంయుక్త కిసాన్‌మోర్చా విమర్శ
- ఈనెల 12న లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని నిరసిస్తూ ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టాలని పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 12న జరగనున్న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలను చేపట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందం (‘ఏకపక్ష ఫ్రీ(ట్రేడ్ అగ్రిమెంట్’) నిరసిస్తూ గ్రామ ,గ్రామాన ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేయాలని ఎస్‌కెఎం నాయకులు తెలిపారు. అమెరికా ముందు ప్రధాని మోదీ లొంగిపోయారని, అందుకే అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నారని, ఈ ఒప్పందం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు రక్షణ లేకుండా పోయిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను, అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందాలను తక్షణమే ఉప సంహరించుకోవాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్, హిమాయత్‌నగర్, మఖ్దూంభవన్‌లోని రాజ్‌హదూర్‌గౌర్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌కెఎం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, టిసాగర్, వి.ప్రభాకర్, జక్కుల వెంకటయ్య, ఆర్.వెంకట్రాములు, మండల వెంకన్న, కె.కాంతయ్య , ఎస్‌కెఎం రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్, డి.జి.నరేంద్ర ప్రసాద్, బి.రాము మాట్లాడుతూ సి2,ప్లస్ 50 శాతం ప్రకారం పంటల మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని, విత్తన, విద్యుత్ మార్కెట్ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని

తరువాయి 2లో



# స్తంభించిన పార్లమెంట్

- నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకెళ్లిన సభ్యులు
- కొనసాగిన వాయిదాల పర్వం
- పార్లమెంట్ వెలుపల నిరసన ప్రదర్శన
- నియంతృత్వాన్ని సహించం, నరేంద్ర సరెండర్, ప్రజాస్వామ్య హత్యను ఆపండి అంటూ నినాదాలు
- లోక్‌సభను సోమవారానికి వాయిదా వేసిన స్పీకర్

### పలు అంశాలపై విపక్ష ఎంపిల ఆందోళన

**న్యూఢిల్లీ :** భారత్‌-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం, ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణే విడుదల కాని జ్ఞాపకాల పుస్తకం వివాదాస్పదం సహా పలు అంశాలపై ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిలు, పార్లమెంట్ ఉభయసభల్లోనూ, వెలుపల తమ ఆందోళనలు కొనసాగించారు. దీంతో శుక్రవారం కూడా లోక్‌సభలో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై చర్చ చేపట్టలేదు. సభ్యులు విపక్ష సభ్యులు తమ నిరసనను తీవ్రతరం చేయడంతో స్పీకర్ సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు. ఉదయం సభ ప్రారంభం కాగానే చాలా మంది ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తాను సభను నడుపాలని తాను కోరుకుంటున్నానని, ప్రజలు తమ సమస్యలను లేవనెత్తాలని, నినాదాలు చేయకూడదని సభ్యులను ఎన్నుకున్నారని స్పీకర్ అన్నారు. అనంతరం సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం తిరిగి సభ ప్రారంభంగానే ప్రతిపక్ష సభ్యులు సభ వెల్‌లోకి దూసుకెళ్లి నిరసనలు కొనసాగించారు. కార్యకలాపాలకు అధ్యక్షత వహించిన

తరువాయి 2లో

మా ప్రశ్నలకు జవాబిచ్చేందుకు

## మోదీకి ధైర్యం లేదు

- ప్రభుత్వం సభను ప్రజాస్వామ్య పద్ధతిలో నడపాలనుకోవడం లేదు
- అబద్ధాలను పదే పదే చెప్పడమే మోదీ పని
- ప్రధానిపై విరుచుకుపడిన మల్లికార్జున ఖర్గే

06

26 నుంచి అసెంబ్లీ

## బడ్జెట్ సమావేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 26వ తేదీ నుంచి జరగనున్నాయి. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సుమారు 15 రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెల 11వ తేదీన పోలింగ్, 13వ తేదీన ఫలితాలు, అనంతరం చైర్మన్లు, మేయర్ల ఎన్నిక జరగనుంది.ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన అనంతరం అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే శాఖల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామృష్ణారావు పూర్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం ప్రభుత్వ శాఖాధిపతులతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు.

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

ప్రభాకర్‌తో సహా ఏడుగురు నక్సలైట్లు మృతి

5



## చెన్నైలో నిలువెత్తు కార్ల్ మార్క్స్ విగ్రహం

ఆవిష్కరించిన సిఎం ఎం.కె. స్టాలిన్ హాజరైన సిపిఐ, సిపిఎం, ఎండిఎంకె నాయకులు

12

హైదరాబాద్ అభివృద్ధికి రెండేళ్లలో

## రూ.20వేల కోట్లు

- జిహెచ్‌ఎంసిలో 27 పట్టణ స్థానిక సంస్థల విలీనం ఓ చరిత్రాత్మక నిర్ణయం
- ‘క్రెడాయ్’ ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షో లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు




ప్రజాపక్షం/రంగారెడ్డి

మహానగరం చుట్టు ప్రక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జిహెచ్‌ఎంసి లో విలీనం చేయడం ఓ చరిత్రాత్మక నిర్ణయమని తెలంగాణ డిప్యూటీ సిఎం సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాల వ్యవధిలోనే 20వేల కోట్లు కేటాయించాం, ఇందులో అనేక పనులు పూర్తికాగా మరికొన్ని పనులు ప్రగతిలో ఉన్నాయని,ఈ తరహాలో హైదరాబాదు నగర అభివృద్ధికి నిధులు కేటాయించడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగలేదని ఆయన చెప్పారు.శుక్రవారం హైదరాబాద్ హైటెక్స్ లో క్రెడాయ్ ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షో సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి పరిధిలో 1950.52 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పరిధిలో 12,500 కోట్లు, హెచ్ ఎండిఎ పరిధిలో 4,3365 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. హైదరాబాదు నగరం

తరువాయి 2లో



# నిజామాబాద్ జిల్లా వ్యవసాయానికి మారుపేరు

- జిల్లా రైతుల పోరాటం దేశానికి ఆదర్శణీయం
- బిజెపిని బొంద పెట్టండి.. కాంగ్రెస్‌కు పట్టంకట్టండి
- ఎంపి ధర్మపురి అరవింద్ నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా ఎందుకు చేయలేకపోయారు?
- బర్దిపూర్ గ్రామంలో జరిగిన ప్రజాపాలన ప్రగతిబాటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలదీత

ప్రజాపక్షం/నిజామాబాద్

‘నిజామాబాద్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉంది. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని దాశరథి ఇక్కడి ఖిల్లా జైలు నుంచి నినదించారు. ఈ జిల్లా వ్యవసాయానికి మారుపేరు. ఇక్కడి వ్యవసాయం చెరుకు, పసుపు, వరి రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శం. రైతు సమస్యలపై పోరాటం ఆదర్శనీయం’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని బొందబెట్టి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని, జిల్లా అభివృద్ధికి నూటికి నూరుశాతం సహకరిస్తానని హామీనిచ్చారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రూ.700 కోట్లతో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బర్ధిపూర్‌లో మాజీ పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ సమాధి వద్ద నివాళులర్పించారు. గ్రామంలో ప్రజాపాలన – ప్రగతి బాట సభ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ పాల్గొన్నారు. సభనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని, ఇదివరకే సర్వేలు పూర్తయ్యాయన్నారు. అభ్యర్థులు

తరువాయి 2లో



## వడ్డీ రేట్లు యథాతథం

ఆర్‌బిఐ కీలక నిర్ణయం

**ముంబయి :** దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా సాగుతుందన్న విశ్వాసంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ఉదయం నిర్ణయాలను వెల్లడించారు. రెపో రేటును 5.25 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణం మధ్య సమతౌల్యం సాధించడమే లక్ష్యమని ఆర్‌బిఐ గవర్నర్ స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రేట్లను మార్చాల్సిన అవసరం లేదని భావించినట్లు

తరువాయి 12లో

# ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి

- కనీసం 31 మంది మృతి
- 170 మందికి గాయాలు
- ఖైబర్ ఫఖ్తూన్క్వాలో 24 మంది ఉగ్రవాదులు హతం

**ఇస్లామాబాద్/ పెషావర్:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని టర్లై ప్రాంతంలో ఉన్న ఖదీజతుల్ కుబ్రా మసీదు వద్ద శుక్రవారం నమాజ్ సమయంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో కనీసం 31 మంది మరణించగా, సుమారు 170 మంది వరకు గాయపడినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఖైబర్‌ఫఖ్తూన్వాలో 24 మంది ఉగ్రవాదులను హతమార్చినట్టు పాకిస్తాన్ సైన్యం ప్రకటించింది. కాగా, ఇస్లామాబాద్‌లోని ఇమాంబర్గా వద్ద ప్రార్థనల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు చేరిన వేళ ఆత్మాహుతి దాడి జరగడం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, దాడి చేసిన వ్యక్తిని ఇమాంబర్గా గేటు వద్దే భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అయితే అతడు అక్కడే తన వంటిపై ఉన్న పేలుడు పదార్థాలను పేల్చుకున్నాడు. ఈ పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో

తరువాయి 12లో



అమెరికా– ఇరాన్ చర్చలకు

# ఒమాన్ మధ్యవర్తిత్వం



**మస్కట్:** ఒమాన్ రాజధాని మస్కట్‌లో ఇరాన్ అణు కార్యక్రమంపై ఇరాన్‌-అమెరికా మధ్య పరోక్ష చర్చలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ చర్చలకు ఒమాన్ మధ్యవర్తిత్వం వహించింది. ఇరు దేశాల ప్రతినిధులు ఒకేసారి కాకుండా విడివిడిగా ఒమాన్ ఉన్నత దౌత్యవేత్తను కలవడానికి వచ్చారు. తొలుత ఇరాన్ ప్రతినిధుల కాన్వాయ్ మస్కట్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని రాజప్రాసాదానికి చేరుకుంది. కొంతసేపటి తర్వాత వారు తిరిగి హోటల్‌కు వెళ్లారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ఒమాన్ విదేశాంగ మంత్రి బద్ర్ అల్‌బుసైదిను కలిసినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా ధ్రువీకరించింది. ఇరాన్ వాహనాలు వెళ్లిన తరువాతే అమెరికా కాన్వాయ్ రాజప్రాసాదానికి చేరుకుంది. అమెరికా జెండా ఉన్న వాహనం కూడా ఇందులో ఉంది. ఈ కాన్వాయ్ సుమారు గంటన్నర పాటు అక్కడ ఉండి అనంతరం వెళ్లిపోయింది. అనంతరం ఒమాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో, బుసైది వేర్వేరుగా అరఘ్చితో,

తరువాయి 12లో

# ట్రంప్ నోట పదేపదే అదే మాట

**భారత్–పాక్ యుద్ధాన్ని తానే ఆపినట్లు మరోసారి ప్రకటన**



**న్యూయార్క్/వాషింగ్టన్:** భారత్–పాక్ దేశాల మధ్య యుద్ధం జరగకుండా తాను అడ్డుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఆయన చాలా కాలంగా ఇదే మాట చెప్తున్న విషయం తెలిసిందే. 'ఏడాది కాలంలో నేను ఎనిమిది యుద్ధాలను లేదా యుద్ధ ప్రారంభాలను అడ్డుకున్నాను. కంబోడియా–థాయిలాండ్ లేదా కొసావో–సెర్బియా, పాకిస్తాన్–ఇండియా, ఇజ్రాయెల్–ఇరాన్, ఆర్మేనియా–అజర్‌బైజాన్.. ఇలా ఎన్నో యుద్ధాలను నిలువరించాను' అని నేషనల్ ప్రేయర్ అల్పాహార సమావేశంలో పాల్గొన్న ట్రంప్ వ్యాఖ్యానించారు. అదే విషయాన్ని ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రుత్'లో పోస్టు చేశారు. అమెరికాను సైనిక పాటవాన్ని తాను బలోపేతం చేశానని, ఇప్పుడు ప్రపంచంలోనే తమను మించిన శక్తివంతమైన దేశం లేదని ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం నాటితో పోలిస్తే వంద రెట్లు అత్యాధునికమైన, శక్తివంతమైన నౌకాదళాన్ని సిద్ధంగా ఉంచినట్టు చెప్పారు.

అదే సమయంలో, అణు యుద్ధాలు జరిగే ప్రమాదం నుంచి ఎన్నో దేశాలను తప్పించానని అన్నారు. పాకిస్తాన్‌తో జరిపిన శాంతి సంభాషణల్లో మూడోవారెవరూ లేరని, ద్వైపాక్షిక చర్చలు జరిగాయని భారత్ స్పష్టం చేస్తుండగా, ట్రంప్ మాత్రం తాను యుద్ధాన్ని నివారించినట్టు పదేపదే ప్రకటించుకుంటున్నారు. ట్రంప్ ప్రకటనలను భారత్ ఖండిస్తునే ఉంది.

# గ్రీన్‌లాండ్‌లో కెనడా, ఫ్రాన్స్ దౌత్యకార్యాలయాలు



**నూక్:** అమెరికా గ్రీన్‌లాండ్‌పై నియంత్రణ సాధించాలన్న ప్రయత్నాల నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెకలొన్నాయి. ఈ నేపథ్యంలోనే కెనడా, ఫ్రాన్స్, గ్రీన్‌ల్యాండ్ రాజధాని నూక్‌లో తమ దౌత్య కార్యాలయాలను ప్రారంభించనున్నాయి. ఈ చర్య ద్వారా నాటో మిత్రదేశమైన డెన్మార్క్‌కు, అలాగే పాక్షిక స్వయంపాలిత ప్రాంతమైన గ్రీన్‌లాండ్‌కు మద్దతు ప్రకటించినట్టుగా భావిస్తున్నారు. ఈ రెండు దేశాలు కాన్సులేట్లను ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించినట్టు శుక్రవారం అధికారికంగా ప్రకటించయి. కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ నూక్‌కు వెళ్లి కెనడా కాన్సులేట్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు కెనడాకు చెందిన ఆదివాసీ వర్గానికి చెందిన గవర్నర్ జనరల్ మేరీ సైమన్ కూడా పాల్గొననున్నారు. కెనడా అధికారులు ఈ కాన్సులేట్ ద్వారా వాతావరణ మార్పు, ఆర్కిక్ భద్రత, అలాగే ఇన్యూట్ ప్రజల హక్కుల వంటి అంశాల్లో గ్రీన్‌లాండ్‌తో సహకారం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. కెనడా ఇప్పటికే 2024లోనే గ్రీన్‌లాండ్‌లో కాన్సులేట్ ప్రారంభిస్తామని హామీ ఇచ్చింది. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా నవంబర్‌లో జరగాల్సిన ప్రారంభోత్సవం వాయిదా పడింది. కాగా, ఇదే సమయంలో, ఫ్రాన్స్ కూడా గ్రీన్‌లాండ్‌లో తన కాన్సులేట్ జనరల్‌ను ప్రారంభిస్తోంది. జీన్‌నోయెల్ పొయిరియర్ కాన్సుల్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గ్రీన్‌లాండ్‌లో కాన్సులేట్ జనరల్ ఏర్పాటు చేస్తున్న తొలి యూరోపియన్ యూనియన్ దేశంగా ఫ్రాన్స్ నిలవడం గమనార్హం. సంస్కృతి, శాస్త్రం, ఆర్థిక రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయడం, అలాగే స్థానిక అధికారులతో రాజకీయ సంబంధాలను బలపరచడం ఆయన ప్రధాన బాధ్యతలుగా ఉంటాయని తెలిపింది.

## అమెరికా, రష్యా మధ్య ఉన్నత స్థాయి సైనిక చర్చలు!

**కీవ్:** ఉక్రేన్ యుద్ధాన్ని ముగించేందుకు ప్రయత్నాలు సాగుతున్న నేపథ్యంలో, నాలుగు సంవత్సరాలకుపైగా నిలిచిపోయిన ఉన్నత స్థాయి సైనిక చర్చలను అమెరికా, రష్యా తిరిగి ప్రారంభించేందుకు అంగీకరించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత వాషింగ్టన్–మాస్కో మధ్య సంబంధాలు కొంత మెరుగుపడుతున్నాయనే సంకేతంగా ఈ నిర్ణయాన్ని భావిస్తున్నారు. 2021 చివరిలో, ఉక్రేన్‌పై రష్యా పూర్తి స్థాయి దాడికి ముందు, ఇరు దేశాల మధ్య సైనిక సంబంధాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ కొత్త సైనిక సంప్రదింపు వ్యవస్థ స్థిరమైన సైనిక–సైనిక సంబంధాన్ని కొనసాగించేందుకు, దీర్ఘకాలిక శాంతి దిశగా ప్రయత్నాలకు సహకరిస్తుంది అని అమెరికా యూరోపియన్ కమాండ్ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబీలో జరిగిన అమెరికా, రష్యా ఉన్నత స్థాయి సైనిక అధికారుల సమావేశంలో ఈ ఒప్పందం కుదిరింది. అదే సమయంలో, అమెరికా, నాటో యూరోపియన్ కమాండర్ జనరల్ అలెక్సస్ గ్రింకెవిచ్ కూడా అబుదాబీలో ఉన్నారు. అక్కడ ఉక్రేన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా, రష్యా, ఉక్రేన్ అధికారుల చర్చలు రెండో రోజుకు చేరాయి. ఇదిలా ఉండగా, రష్యా ఉక్రేన్ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులను మరింత పెంచింది. పౌరులకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం ద్వారా ప్రజా మద్దతును బలహీనపరచడమే లక్ష్యంగా ఈ దాడులు చేస్తున్నట్లు అంచనా. తూర్పు, దక్షిణ ఉక్రేన్‌లో సుమారు వెయ్యి కిలోమీటర్ల పొడవున ఉన్న ముందు రేఖ వెంబడి తీవ్ర యుద్ధం కొనసాగుతోంది.

## పోర్టుల నిర్వహణపై కోర్టు తీర్పు అమలు చేస్తాం

**పనామా అధ్యక్షుడు ములినో స్పష్టీకరణ**



**పనామా సిటీ:** పనామా కాలువ పోర్టుల నిర్వహణకు సంబంధించి హాంకాంగ్‌కు చెందిన కంపెనీతో సాగుతున్న న్యాయపోరాటం మరింత ఉద్రిక్తతకు దారి తీయకూడదని ఆశిస్తున్నట్లు పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో వ్యాఖ్యానించారు. అయితే కోర్టు ఇచ్చిన తీర్పుపై తమ ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని ఆయన స్పష్టం చేశారు. చైనా ప్రభుత్వం నుంచి వచ్చిన హెచ్చరికలకు స్పందిస్తూ, పనామా గౌరవప్రదమైన దేశమనీ, ప్రపంచంలో ఏ దేశం నుంచైనా బెదిరింపులను తాము అంగీకరించేది లేదని ఆయన మీడియా సమావేశంలో అన్నారు. గత వారం పనామా సుప్రీంకోర్టు, పనామా కాలువలోని రెండు కీలక పోర్టుల నిర్వహణకు సంబంధించి హాంకాంగ్‌కు చెందిన సికె హచిసన్ హోల్డింగ్స్ అను బంధ సంస్థకు ఇచ్చిన రాయితీ ఒప్పందం రాజ్యాంగ విరుద్ధమని తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే.

## 'న్యూ స్టార్ట్' గడువు ముగియడంపై క్రెమ్లిన్ విచారం



**మాస్కో:** రష్యా–అమెరికా మధ్య అణు ఆయుధాల నియంత్రణకు కీలకమైన చివరి ఒప్పందమైన 'న్యూ స్టార్ట్' గడువు ముగియడంపై క్రెమ్లిన్ గురువారం విచారం వ్యక్తం చేసింది. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం ఈ ఒప్పంద పరిమితులను కొనసాగించడాన్ని వ్యతిరేకిస్తూ, మరింత మెరుగైన, ఆధునికమైన కొత్త ఒప్పందం కావాలని ప్రకటించారు. 'న్యూ స్టార్ట్' గడువు ముగియడంతో, అర్ధ శతాబ్దానికి పైగా కొనసాగిన అణు ఆయుధాల పరిమితుల వ్యవస్థ పూర్తిగా కూలినట్టు భావిస్తున్నారు. దీని వల్ల నియంత్రణ లేని అణు ఆయుధ పోటీ మొదలయ్యే ప్రమాదం పెరిగిందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, వాషింగ్టన్ కూడా అంగీకరిస్తే, న్యూ స్టార్ట్ ఒప్పందంలోని పరిమితులను మరో ఏడాది పాటు పాటించేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. అయితే ట్రంప్ ఆ ప్రతిపాదనను పట్టించుకోకుండా, చైనాను కూడా కలుపుకున్న కొత్త ఒప్పందం కావాలని పట్టుబట్టారు. ఈ ప్రతిపాదనను చైనా తిరస్కరించింది. 'న్యూ స్టార్ట్'లో తమకు అనుకూలించే అంశాలు ఏవీ లేవని, ఆ దిశగా సక్రమమైన చర్చ కూడా జరగలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. అందుకే, ఆ ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేసి, దీర్ఘకాలం కొనసాగే విధంగా కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సిన అవసరం ఉందని వాదిస్తున్నారు. ఇలావుంటే, 'న్యూ స్టార్ట్' ఒప్పందం ముగింపు విషయాన్ని చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చర్చించారు. అమెరికా నుంచి ఎలాంటి స్పందన లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ, భద్రతా పరిస్థితిని సమగ్రంగా విశ్లేషించి సమతుల్యమైన, బాధ్యతాయుతమైన విధంగా రష్యా స్పందిస్తుందని క్రెమ్లిన్ సలహాదారు యూరీ ఉషకోవ్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మోదీ లొంగారు

(మొదటి పేజీ తరువాయి)


కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం2005'ను తిరిగి పునరుద్ధరించాలని, సవరించిన 2025 చట్టాన్ని రద్దు చేయాలని, రెండు వందల పనిదినాలను పెంచి, కూలిని రూ.600లకు పెంచాలని, కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లును వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. 202627 కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎరువులపైన సబ్సిడీ తగ్గించిందని, తద్వారా ధరలు పెరుగుతాయని తెలిపారు. రైతు వ్యతిరేక చట్టాలను అమలుచేయబోమని రైతులకు క్షమాపణ చెప్పిన ప్రధాని మోదీ, ఆ మూడు చట్టాలను ఇతర రూపాల్లో అమలు చేస్తున్నారని, రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించారని దుయ్యబట్టారు. అమెరికా వాణిజ్య ఒప్పందం ద్వారా అమెరికా ఉత్పత్తులు విచ్చలవిడిగా సరఫరా అవుతాయని, తద్వారా రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని, వ్యవసాయ రంగం చతికిల పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

పశ్యపద్మ మాట్లాడుతూ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బరితెగించి అమలు చేస్తోందని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లు అమలులోనికి వస్తే రైతులకు ఉచిత విద్యుత్ పథకం రద్దవుతుందని, మొటర్లకు మీటర్లను ఏర్పాటు చేస్తారని, ఆ మీటర్ల ఆధారంగా రైతుల నుంచి కూడా బిల్లులను వసూలు చేస్తారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేవలం 2.3 శాతం నిధులను మాత్రమే ప్రతిపాదించిందని, తక్కువ కేటాయింపుల కారణంగా చిన్న, సన్న కారు రైతులు తీవ్ర ఇబ్బందులు గురయ్యే ప్రమాదం ఉన్నదని వివరించారు. కొబ్బరి, గంధం చెట్టు, జీడిపప్పు, కోకో లాంటి ఉత్పత్తులను ఉత్పత్తులను ప్రొత్సహిస్తామని చెప్పినప్పటికీ బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ. 360 కోట్లను ప్రతిపాదించారన్నారు. అత్యంత ముఖ్యమైన బిల్లులపైన కేంద్రం పార్లమెంట్‌లో కూడా చర్చించే అవకాశాన్ని కల్పించలేదని విమర్శించారు.

టి.సాగర్ మాట్లాడుతూ అమెరికాకు ఎగుమతి చేసే ఉత్పత్తులపైన 18 శాతం పన్నులను విధిస్తారని, తద్వారా ఎగుమతులు నిలిచిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందని దుయ్యబట్టారు.

## వ్యవసాయానికి మారుపేరు

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళితే విజయం సాధిస్తారన్నారు. 2023 ఎన్నికల్లో తాను టిపిసిసి అధ్యక్షునిగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేష్‌కుమార్‌గౌడ్ ప్రచారం నిర్వహించి పార్టీని అధికారంలోకి తీసుకవచ్చామన్నారు. 2029లో సిఎంగా నేను, పిసిసి అధ్యక్షునిగా మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మళ్లీ అధికారంలోకి తీసుకువస్తామన్నారు. నిజామాబాద్ జిల్లా అంటే ప్రత్యేకమైన స్థానముందని, జిల్లాకు అవసరమైన నిధులు మంజూరు చేయడానికి శాయశక్తుల ప్రయత్నం చేస్తామన్నారు. జిల్లాలో వివిధ విద్యాసంస్థల కోసం రూ. 600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఎంపి ధర్మపురి అరవింద్‌ను ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేశారు. నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా ఎందుకు చేయలేకపోయాడని ఎద్దేవా చేశారు. కెసిఆర్, హరీష్‌రావును జైల్లో పెట్టి చిప్పకూడు తినిపించాలని ధర్మపురి చెబుతున్నాడని, శాసనసభ్యులు చర్చ పెట్టి కాళేశ్వరాన్ని సిబిఐకి ఇస్తే ఇప్పటివరకు ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏ బొక్కలో దాక్కున్నాడని మండిపడ్డారు. వారిద్దరిని కిషన్‌రెడ్డి కాపాడుతున్న విషయం అందరికి తెలిసిందేనన్నారు. వారిని ఎప్పుడు అరెస్టు చేస్తారో బిజెపి నాయకులే సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, ఆసియా ఖండంలోనే అతి పెద్ద వ్యవసాయ మార్కెట్ ఉన్న నిజామాబాద్ జిల్లా అన్నారు. ఇప్పటివరకు స్మార్ట్ సిటీ రాకపోవటానికి కారణం బిజెపి నేతలే అని విమర్శించారు. జిల్లాకు 2వ విడతలో ఎయిర్‌పోర్ట్ మంజూరు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా మార్చాలని కోరుతున్నామన్నారు. జిల్లాలో మేయర్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని జిల్లాకు ప్రత్యేకంగా నిధులు తెచ్చి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో, ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ప్రతి ఇంటికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలో మిగిలిపోయి అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, జిల్లాలో ప్రాణాహిత ప్యాకేజీ పనులను ముందుకు తీసుకెళుతున్నారు అన్ని విధాలుగా ప్రజలకు మేలు చేసిన కాంగ్రెస్ పార్టీని మున్సిపల్ ఎన్నికల్లో దీవించాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ జిల్లా అందుకే వ్యవసాయ కళాశాల మంజూరు చేశామన్నారు. ఒక రాష్ట్రంలో ఒకే సంవత్సరంలో మూడు వ్యవసాయ కళాశాలలు మంజూరు చేసిన ఘనత సిఎం రేవంత్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నగేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపాలిటీల అభివృద్ధి

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి**



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపాలిటీలు ఎంతో అభివృద్ధి సాధిస్తున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి వివరించారు. శుక్రవారం రాత్రి షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 9వ వార్డులో బిజెపి అభ్యర్థి ప్యాట అశోక్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. వార్డులో పర్యటిస్తూ ప్రజలకు అభివాదం చేశారు. అదే విధంగా మరికొన్ని వార్డులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించి కమలం గుర్తుకు ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. కేశంపేట రోడ్డు నుండి మెయిన్‌రోడ్డు మీదుగా పరిగి రోడ్డు వరకు రోడ్ షో నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీ ముందుకు సాగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ప్రాణాలను త్యాగం చేసి తెచ్చుకున్న తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందని ఆశిస్తే దోపిడి దొంగల చేతుల్లోకి వెళ్ళిపోయిందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో వారి సొంత వాళ్ళకే పదవులు ఇచ్చి ఇష్టం వచ్చిందన దొచుకున్నారే తప్పా ప్రజలకు చేసిందేమి లేదని అన్నారు. బిఆర్ఎస్‌లో అవినీతి పెరిగిపోవడంతోపాటు ఆహంకారం ఎక్కువ కావడంతోనే ప్రజలు గద్దె దించారని గుర్తు చేశారు. బిఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తుందని, త్వరలోనే ప్రజలకు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా అందినకాడికి దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈ దుర్మార్గపు పాలన అంతం కావాలంటే ప్రతి ఒక్కరు కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు దేశ ప్రధాని నరేంద్రమోడి ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు మున్సిపాలిటిలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున నిధులు అంధిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంధిస్తున్న ప్రతి పథకంలో కేంద్రం వాటా ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని ప్రజలందరు గమనించాలని సూచించారు. దేశ ప్రజల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని, వాటన్నింటిని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులకు భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, చెంది మహేందర్‌రెడ్డి, కక్కునూరి వెంకటేష్ గుప్త, డాక్టర్ విజయ్‌కుయార్, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మురళి, వంశీ, ప్యాట అశోక్‌కుమార్, క్యామ మహేష్‌తోపాటు వివిధ వార్డుల అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిల్లుల బకాయిలు చెల్లిస్తాం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చేప పిల్లల సరఫరా బిల్లులు చెల్లింపులకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ జారీ అయ్యిందని, బిల్లులను 4 వారాల్లోగా చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. టోకెన్ ఇచ్చిన తర్వాత నాలుగు వారాల్లో అందజేస్తామంది. కాబట్టి అధికారులపై దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్లు కొట్టేయాలని కోరింది. దీనిపై స్పందించిన హైకోర్టు, కోర్టు ఎదుట హాజరుకావాలని డిసెంబర్‌లో ఆదేశాలిస్తే ఇప్పుడు బీఆర్‌వో జారీ చేశామని చెబితే ఎలాగని ప్రశ్నించింది. హామీ మేరకు బిల్లుల చెల్లింపులు చేసి అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణ మార్చి 6కు వాయిదా వేసింది. 2023–24 ఏడాది చేప పిల్లల బిల్లులను చెల్లించాలని గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయలేదంటూ శ్రీసాయి ఫిష్ సీడ్స్ కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను జస్టిస్ మాధవీదేవి విచారించారు. బిల్లుల చెల్లింపుల రంగం సిద్ధమైందని ప్రభుత్వ హామీని నమోదు చేశారు. అధికారులు బడ్జెట్ రూపకల్పనలో ఉన్నందున ఉన్నతాధికారుల వ్యక్తిగత విచారణ నుంచి మినహాయింపు ఇచ్చారు.

## స్తంభించిన పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణ ప్రసాద్ టెన్నేటి, ప్రతిపక్షాలు తమ స్థానాల్లో కూర్చుని ప్లకార్డులు పెట్టాలని కోరారు. అందుకు ప్రతిపక్ష సభ్యులు అంగీకరించకపోవడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు. అంతకు ముందు స్పీకర్ ఓం బిర్లా ఇలాంటి సభను తాను నిర్వహించలేనని విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుత సమావేశంలో అంతరాయం కారణంగా 19 గంటల 13 నిమిషాలు వృథా అయ్యాయని, సభ్యులు సభను అగౌరవపరుస్తున్నారని స్పీకర్ పేర్కొన్నారు. కాగా, సోమవారం మధ్యాహ్నం నుండి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన ప్రచురించని జ్ఞాపకాల సారాంశాల ఆధారంగా ఒక కథనాన్ని ఉటంకించడానికి చైర్మన్ అనుమతించకపోవడంతో లోక్‌సభలో గందరగోళం నెలకొంది. సభను నడపడానికి అనుమతించాలని నిరసన తెలుపుతున్న సభ్యులను కోరుతూ, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీకి ఒక ప్రశ్న ఉందని బిర్లా అన్నారు. నిరసనలు కొనసాగుతుండగా సమావేశం జరిగిన నాలుగు నిమిషాల లోపు స్పీకర్ సమావేశాన్ని వాయిదా వేశారు. ప్రతిపక్ష సభ్యులు ట్రెజరీ బెంచీలకు వెళ్లవద్దని హెచ్చరిస్తూ నేను అలాంటి సభను నడపలేను అని అన్నారు.

**పార్లమెంట్ వెలుపల ఆందోళన**

అమెరికాతో వాణిజ్య ఒప్పందం, మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే ప్రచురించని జ్ఞాపకాల పుస్తకం చుట్టూ నెలకొన్న వివాదం, ఎనిమిది మంది ఎంపిల సస్పెన్షన్‌పై కాంగ్రెస్, కొన్ని ఇతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిలు శుక్రవారం పార్లమెంట్ భవన సముదాయంలో నిరసన తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల వరకు లోక్‌సభ కార్యకలాపాలు వాయిదా పడిన తర్వాత, ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంట్ మకర ద్వారం వద్ద గుమిగూడి 'నియంతృత్వాన్ని సహించం నరేంద్ర, లొంగిపో, ప్రజాస్వామ్య హత్యను ఆపండి' వంటి నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మిగిలిన కాలానికి సస్పెండ్ అయిన ఎంపిలు, పలువురు ఇతర ఎంపిలు ఈ నిరసనలో పాల్గొన్నారు. వారు భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ 'ఉచ్చు ఒప్పందం' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్‌ను కూడా ప్రదర్శించారు. పార్లమెంట్ భవన సముదాయం నుండి బయలుదేరేటప్పుడు, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై పరోక్ష విమర్శలు చేస్తూ విలేకరులతో ఏది సరైనదని భావిస్తారో అది చేయండి అని అన్నారు. 2020లో భారత్‌చైనా సంఘర్షణ సమయంలో ప్రధాని మోడీ బాధ్యత నుండి తప్పించుకుని, ఆ నిందను జనరల్‌పైకి నెట్టారని నరవణే విడుదల చేయని జ్ఞాపకాల పుస్తకాన్ని ఉటంకిస్తూ గాంధీ బుధవారం ఆరోపించారు. లోక్‌సభలో కాంగ్రెస్ విప్, సస్పెండ్ అయిన ఎంపిలలో ఒకరైన మాణికం ఠాగూర్, ప్రధాని మోదీ వైఫల్యాల అంశంపై ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ప్రధాని మోదీ వెనకడుగు వేశారని, సభకు రావడానికి భయపడుతున్నారని, ఇతర దేశాల ఒత్తిడికి లొంగిపోయారని ఆయన ఆరోపించారు. మాజీ ఆర్మీ చీఫ్ నరవణే ప్రచురించని జ్ఞాపకాల పుస్తకాన్ని ఉటంకించిన ఒక కథనం నుండి రాహుల్ గాంధీని చదవడానికి అనుమతించకపోవడం, రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అనాగరిక ప్రవర్తనకు పాల్పడినందుకు ఎనిమిది మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయడం వంటి వివిధ అంశాలపై కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టించడంతో సోమవారం నుండి సభలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. గురువారం, ప్రధాని సమాధానం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఆమోదించబడింది.

## రూ.20వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులు, ప్రతిభ, జీవన ప్రమాణాల్లో నాణ్యత విషయంలో దేశంలోని నగరాలతోనే మాత్రమే కాదు ప్రపంచంలోని అగ్ర నగరాలతో హైదరాబాద్ మహానగరం పోటీ పడుతుందని డిప్యూటీ సిఎం భట్టి తెలిపారు. హైదరాబాద్ మహానగరం చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయడం ఓ చారిత్రాత్మక నిర్ణయమని డిప్యూటీ సిఎం అభివర్ణించారు.ఈ గొప్ప నిర్ణయం ద్వారా నగరంలోని పౌరులకు ఒకే విధమైన పౌర సేవలు, సమగ్ర ప్రణాళిక, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఒకే అభివృద్ధి దృక్పథం సాధ్యం అయ్యాయి అన్నారు.ప్రస్తుతం హైదరాబాద్ నగరం దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, పెట్టుబడులకు అనుకూలమైన నగరాలలో ఒకటిగా నిలుస్తోంది. ఇది యాదృచ్ఛికంగా జరిగినది కాదు. దశాబ్దాల పాటు సాగిన సంస్థాగత నిర్మాణం, ప్రజాస్వామ్య పాలన,సమగ్ర అభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం నిబద్ధత ఫలితమే ఇది అన్నారు. నగరాభివృద్ధి అనేది న్యాయమైనది, సమతుల్యమైనది,అందరికీ అందుబాటులో ఉండాలనే మా నమ్మకాన్ని మున్సిపాలిటీల విలీనం ప్రతిబింబిస్తుంది తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 కింద, క్యూర్ ప్యూర్ రారే వ్యూహం రాష్ట్ర అభివృద్ధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీని కేంద్రంగా ఉంచుతోందనీ అన్నారు. ఆర్థిక వృద్ధి సామాజిక న్యాయం, సమాన అవకాశాలతో పాటు సాగాలన్న ప్రజా ప్రభుత్వం దీర్ఘకాలిక విశ్వాసానికి ఇది ప్రతిబింబం అన్నారు. హైదరాబాద్ తెలంగాణకు ఉపాధి,ఆవిష్కరణలు, గ్లోబల్ పెట్టుబడుల ప్రధాన ఇంజిన్‌గా కొనసాగుతుంది, అదే సమయంలో అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా చూస్తుంది అని భరోసా ఇచ్చారు. అయితే, మౌలిక సదుపాయాలే గొప్ప నగరాన్ని నిర్మించవు, ప్రజలతో ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలతో నగరం ఎలా వ్యవహరిస్తుందన్నదే దాని గొప్పతనానికి ప్రమాణం అని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. అందుకే 2047 వరకు దృష్టిలో ఉంచుకుని, వరదల భద్రత, వాతావరణ అనుకూలత కోసం ప్రత్యేకంగా లోతట్టు, వెనుకబడిన ప్రాంతాలకు ఉపయోగపడేల సమగ్ర స్టార్మ్ వాటర్ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నాం అన్నారు. అలాగే,యు ఎం టి ఎ ద్వారా సమగ్ర స్పెషియల్ మాస్టర్ ప్లాన్, బ్లూగ్రీన్ మాస్టర్ ప్లాన్, సమగ్ర మొబిలిటీ ప్లాన్‌లను అభివృద్ధి చేస్తున్నాం, అభివృద్ధి క్రమబద్ధంగా, పర్యావరణ బాధ్యతతో, అందుబాటులో ఉండేలా చేయడానికి. ఈ చర్యలు దీర్ఘకాలిక ప్రణాళికలు, సంస్థాగత బలోపేతం, స్థిరమైన అభివృద్ధిపై మా ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నాయి అని డిప్యూటీ సి ఎం గుర్తు చేశారు. దేశంలోనే అత్యంత నివసించదగిన, పెట్టుబడులకు అనుకూలమైన,మంచి పాలనతో కూడిన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. మేము కేవలం ఫ్లైఓవర్లు, రహదారులు మాత్రమే నిర్మించడం లేదు. పాలనపై విశ్వాసాన్ని పునర్నిర్మిస్తున్నాం. ప్రజా సంస్థలపై నమ్మకాన్ని పునరుద్ధరిస్తున్నాం. ప్రభుత్వం ప్రజల సేవ కోసమే ఉందన్న భావనను మరలా స్థిరపరుస్తున్నాం అన్నారు.

స్మార్ట్, స్థిరమైన, సమగ్ర, న్యాయసమ్మతమైన భవిష్యత్‌కు సిద్ధమైన హైదరాబాద్‌కు మేము పునాదులు వేస్తున్నాం అని తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, పౌరులు ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల మార్గనిర్దేశంలో కలిసి హైదరాబాద్‌ను నిజంగా ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుదాం అని డిప్యూటీ సీఎం పునరుద్ఘాటించారు.రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సదాసిద్ధంగా ఉంది, మున్సిపాలిటీ ఎన్నికల బిజీ ఉన్నప్పటికీ తనతో పాటు సీనియర్ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి సైతం ఈ సమావేశానికి హాజరు అయ్యాము అంటే ఈ రంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న ఆసక్తి ఎలాంటిదో స్పష్టం అవుతుందని డిప్యూటీ సిఎం తెలిపారు.

# రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి వేగం

## మూడు హైస్పీడ్ రైలు కారిడార్లకు కేంద్రం ఆమోదం

## 2026–27 బడ్జెట్‌లో తెలంగాణకు రూ.5,454 కోట్ల కేటాయింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పరిశ్రమల విస్తరణ, పట్టణీకరణ వేగంగా కొనసాగుతున్న తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరింత ఊపునిచ్చింది. ప్రస్తుత 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి సగటున రూ.5,454 కోట్ల రైల్వే నిధులు కేటాయించడంతో పాటు, మూడు హైస్పీడ్ రైలు కారిడార్లకు కేంద్రం ఆమోదం తెలిపింది. రాష్ట్ర విభజన తర్వాత 2014 నుంచి తెలంగాణకు రైల్వే రంగంలో నిరంతరంగా అధిక నిధులు అందుతున్నాయని దక్షిణ మధ్య రైల్వే వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో (2009–2014) సగటున రూ.886 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం ఆ కేటాయింపులు ఆరింతలకుపైగా పెరగడం గమనార్హం.

**900కి.మీ కొత్త రైల్వే లైన్లు..** 2014 తర్వాత తెలంగాణలో 900 కిలోమీటర్లకు పైగా కొత్త రైల్వే మార్గాలు నిర్మించగా, 1,115 కిలోమీటర్ల మేర విద్యుదీకరణ పూర్తయ్యింది. దీంతో తెలంగాణ పూర్తిస్థాయి విద్యుదీకృత రాష్ట్రంగా మారింది. పెద్దపల్లి–నిజామాబాద్, జగ్గయ్యపేట–జన్పహాడ్ అక్కనపేట–మెదక్, భద్రాచలం రోడ్ సత్తుపల్లి వంటి కొత్త రైల్వే లైన్లు ప్రారంభమై దూరప్రాంతాలకు రైలు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. సికింద్రాబాద్–మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. కాజీపేట–బల్లార్షా, కాజీపేట–విజయవాడ మూడో లైన్ పనులు తుదిదశకు చేరాయి.

**ఎంఎంటిఎస్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ..** హైదరాబాద్ ఉపనగర రవాణాకు కీలకమైన ఎంఎంటిఎస్ ఫేజ్–2 పూర్తి కావడంతో ప్రయాణికులకు ఉపశమనం లభించింది. రూ.521 కోట్లతో కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే తయారీ యూనిట్ కూడా దాదాపు పూర్తి కావస్తోంది. ఇక్కడ కోచ్‌లు, ట్రైన్ సెట్లు వంటి రోలింగ్ స్టాక్ తయారీ జరగనుంది.

**స్టేషన్‌ల పునర్నిర్మాణం ...** తెలంగాణలో అమృత్ స్టేషన్ పథకం కింద 40 రైల్వే స్టేషన్లు రూ.2,015 కోట్ల అంచనా వ్యయంతో ఆధునీకరణకు గురవుతున్నాయి. బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లతో పాటు చెర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.
సికింద్రాబాద్, హైదరాబాద్ ప్రధాన స్టేషన్ల పునర్వికాస పనులు దశలవారీగా కొనసాగుతున్నాయి.

**భద్రత, ఆధునిక రైళ్లు..** రైల్వే భద్రతలో కీలకమైన కవచ్ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ను తెలంగాణలో 627 కి.మీ మేర అమలు చేశారు. మరో 1,242 కి.మీకి కవచ్ 4.0 మంజూరైంది. 2014 తర్వాత 499 రైలు ఫ్లైఓవర్లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 5 జంటల వందే భారత్ ఎక్స్‌ప్రెస్, 3 జంటల అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి.

**మూడు హైస్పీడ రైలు కారిడార్లు..** ఈ బడ్జెట్‌లో తెలంగాణకు అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తూ, హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై, హైదరాబాద్ – పుణే మధ్య మూడు హైస్పీడ్ రైలు కారిడార్లకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీని ద్వారా హైదరాబాద్ హైస్పీడ్ రైల్ హబ్‌గా మారడంతో పాటు, వాణిజ్యం, సాంకేతికత, ప్రతిభ మార్పిడికి ఊతం లభించనుంది. ఈ రైల్వే పెట్టుబడులు తెలంగాణను అభివృద్ధి చెందిన పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో కీలకంగా నిలవనున్నాయని దక్షిణ మధ్య రైల్వే సిపిఆర్ఒ ఎ.శ్రీధర్ తెలిపారు.

# కార్పొరేషన్ ఎన్నికలు గుణపాఠం కావాలి

## కొత్తగూడెం గడ్డపై ఎగిరేది ఎర్రజెండానే

## కార్పొరేషన్ అభివృద్ధికి సిపిఐనే దిక్సూచి

## కూనంనేని సాంబశివరావు





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎటుచూసినా దారులన్నీ ఎరుపు, పసుపు వర్ణాల శోభితమవుతున్నాయి. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, స్థానిక ఎంఎల్ఎ కూనంనేని సాంబశివ రావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాలు హోరెత్తుతున్నాయి. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 20,57,49,10,58,59,60 డివిజన్లలో నిర్వహించిన భారీ రోడ్ షోలు, బహిరంగ సభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం అభివృద్ధిలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర చిరస్మరణీయమని, బడుగు, బలహీన వర్గాల గొంతుకగా సిపిఐ ఎల్లప్పుడూ నిలబడుతుందని స్పష్టం చేశారు. బస్తీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యల నుంచి సంక్షేమ ఫలాల పంపిణీ వరకు ప్రతీ అంశంపై తాము పోరాడుతామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ పాలనలో పారదర్శకత ఉండాలంటే ఎర్రజెండా అభ్యర్థుల విజయం అనివార్యం అన్నారు. గడిచిన రెండేళ్లలో ఎమ్మెల్యేగా నియోజకవర్గాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానని, ఆదర్శవంతమైన నియోజకవర్గంగా నిలబెట్టేందుకు ప్రభుత్వంతో పోరాడి నిధులు మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యర్థి పార్టీల ప్రలోభాలకు లొంగకుండా నిబద్ధత గల సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించడం ద్వారా అహంకారులకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి అంటే కేవలం కాంట్రాక్టులు కాదని, సామాన్యుల ముంగిట సంక్షేమ ఫలాలు చేరడం, కార్పొరేషన్ సమగ్రంగా అభివృద్ధి సాధించడమే నిజమైన విజయమని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా నాయకులు దుర్గరాశి వెంకన్న, భూక్యా ధ్రసు, వాసిరెడ్డి మురళీ, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, ఎస్‌కె.షాహీమ్, అభ్యర్థులు మూడ్ గణేష్, సహేరా మహ్మద్, బోయిన విజయ్ కుమార్, మహ్మద్ అబ్దుల్ సల్మా, కొచ్చెర్ల రాకేష్ కాంత్, ఇమ్రాన్ మహ్మద్, నాయకులు యూసఫ్, తమ్మ నర్సయ్య, పల్నాటి ప్రశాంత్, అస్మత్, జడల ప్రకాష్, అజీజ్, జక్కుల రాములు, కొమారి హనుమంతరావు పాల్గొన్నారు.



# బజార్ల అప్పు పుట్టని వ్యక్తిని నమ్ముకుంటే ఏం లాభం..?

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పులెత్తుకుపోయే దొంగ, ఆయనను ఎవరూ నమ్మడం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇది నామాట కాదు. రేవంత్ రెడ్డే చెప్పారు. నాకు బజార్ల అప్పు పుట్టడం లేదు. నన్ను ఎవరూ నమ్మడం లేదు. ఢిల్లీకిపోతే చెప్పులు ఎత్తుకుపోయే దొంగలా చూస్తున్నారు అని ఆయనే చెప్పారు. మరి అట్లాంటి చెప్పుల దొంగకు మున్సిపల్ ఎన్నికల్లో ఎందుకు ఓట్లేయాలి? బజార్ల అప్పు కూడా పుట్టని వ్యక్తిని నమ్ముకుని ఏం లాభం? నిధులు ఎక్కడి నుండి తీసుకొచ్చి అభివృవుద్ధి చేస్తారు..? అని ప్రశ్నించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను 6 గ్యారంటీలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. బిఆర్‌ఎస్ నేతలు వస్తే 10 ఏళ్ల పాలనలో ప్రజలను దోచుకుతిన్నారు. ఎందుకు ఓటేయాలంటూ ప్రశ్నించాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు దుర్శేడ్, గోపాల్‌పూర్, సప్తగిరి కాలనీ ఉస్మానీ అసోసియేట్స్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 4,5, 44,45, 13వ డివిజన్ల బిజెపి అభ్యర్థులు భూపతి రవీందర్, చిందెం హారిక, బండి తార, గడప విజయలక్ష్మి, రెడ్డవేణ లావణ్యలను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.



# మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిదే విజయం


## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధిస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో 'వికసిత తెలంగాణ బిజెపి సంకల్ప పత్రం 2026' పేరుతో రూపొందించిన మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రామచందర్ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ అశోక్ పర్ణామి, రేఖా శర్మ, పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్, సీనియర్ నేతలు జి. వెంకట్ రెడ్డి, కప్పర ప్రసాద్, సి.హెచ్. విఠల్ పాల్గొన్నారు. అనంతరం రాంచందర్ రావు మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ ఇవ్వలేదని సిఎం రేవంత్ రెడ్డి విమర్శిస్తున్నారు. కేంద్రం ఏ జిల్లాకు ఎంత ఇచ్చిందో మేము లెక్కలతో సహా చెబుతాం, రేవంత్ రెడ్డి తన మార్క్ ఏంటో చెప్పగలరా'? అని సవాల్ విసిరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను పార్టీ కార్యకర్తల్లా వాడుకుంటోందని విమర్శించారు. రామగుండం, మంచిర్యాల వంటి ప్రాంతాల్లో బిజెపి కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని, తప్పుడు కేసులు బనాయిస్తే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కేంద్రంలో బిజెపి సర్కార్ ఉన్న విషయాన్ని మర్చిపోవద్దని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు. ఇంటి పన్ను సహా ఎలాంటి మున్సిపల్ పన్నులను పెంచబోమని మేనిఫెస్టోలో తెలిపారు.

## హైబ్రిడ్ విత్తనాలతో ప్రభుత్వాలను

# శాసిస్తున్న బహుళ జాతి కంపెనీలు

## సాంప్రదాయ విత్తనాలతోనే వారికి చెక్ : కోదండరెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బహుళ జాతి కంపెనీలు హైబ్రిడ్ విత్తన వ్యాపారంతో రాష్ట్ర ప్రభుత్వాలను శాసిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.సాంప్రదాయ విత్తనాలతోనే వాటికి చెక్ పెట్టాలన్నారు. అంతరించి పోతున్న దేశీయ, సాంప్రదాయ విత్తనాలను కాపాడుకుంటూ,వాటి నిర్వహణను కంపెనీలు, కార్పొరేట్ల గుప్పిట్ల నుంచి రైతు అజమాయిషీ లోనికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా. కడ్తాల్ మండలం అన్మాసుపల్లిలోని 'ఎర్త్ సెంటర్'లో సెంటర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్‌సిజిఆర్ , భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ మూడు రోజుల పాటు నిర్వహిస్తోన్న 'తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగ'కు కోదండరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బహుళ జాతి కంపెనీలు దేశంలో వేల కోట్ల రూపాయలు సంపాదిస్తూ కూడా ఐటి, మార్కెట్ ఫీజు మినహాయింపు పొందుతున్నాయన్నారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలను కూడా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాయన్నారు. కలుపు మందులు చాలా విష పూరితమని, అయినప్పటికీ ఎరువుల దుకాణాలలో దొరకడం శోచనీయమన్నారు.
మనకు వనరులు, అవకాశం ఉన్నప్పటికీ సాంప్రదాయ విత్తనాలను పండించడం లేదని, ఇప్పటికైనా మేల్కొనకపోతే వాతావరణ మార్పుల దుష్ప్రభావం, మరో వైపు బహుళ జాతి కంపెనీల చేతిలో ఇబ్బందుల తప్పవని కోదండరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్ ప్రెసిడెంట్ లీలా లక్ష్మా రెడ్డి, వైస్ ప్రెసిడెంట్, ఆర్‌టిఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి,రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి ,ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, 'నాబార్డ్' చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ భాస్కర్,మాజీ ఎంపి గంగుల ప్రతాప్ రెడ్డి, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ కన్వీనర్ జాకోబ్, జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## 'విక్షిత్ భారత్ శిక్షా అధిష్టాన్' (విబిఎస్ఎ) బిల్లు -2025ను

# వెంటనే ఉపసంహరించుకోవాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'విక్షిత్ భారత్ శిక్షా అధిష్టాన్' (విబిఎస్ఎ) బిల్లు 2025ను వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పుట్టలక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ బిల్ ద్వారా ఉన్నత విద్య లౌకిక, శాస్త్రీయ స్వభావం దెబ్బతింటుందన్నారు. విబిఎస్ఎ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోకపోతే విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా హైదరాబాద్, హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్ల కార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ విబిఎస్ఎ బిల్లు ద్వారా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) వంటి సంస్థలను రద్దు చేసి, పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఒకే కమిషన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాలు, విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని నాశనం చేస్తుందని విమర్శించారు. విద్యను ప్రజాహిత సేవగా కాకుండా ప్రైవేట్ వస్తువుగా మార్చే 'నయా ఉదారవాద' విధానంలో భాగమన్నారు. ఆర్‌ఎస్ఎస్ అజెండాను విద్యారంగంలో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో తమ భావజాలాన్ని బలవంతంగా రుద్దుతూ.. విద్యార్థుల మధ్యన చీలికలను తీసుకొస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. ఈ బిల్లును అమలు చేయడం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్‌లలో, సమాన అవకాశాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ బిల్లును వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, రాష్ట్ర సమితి సభ్యులు అన్వర్, సత్య, హరీష్, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శి ఉదయ్, లెనిన్, నాయకులు, రఘు, అనిల్, అరుణ్, సుశాంత్, భాను, అవినాష్, ఫహీమ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# కర్మన్‌ఘాట్‌లో మాంగళ్య షాపింగ్ మాల్

## ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన సినీ నటి శ్రీలీల





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో 2012లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలోని కర్మన్‌ఘాట్ ప్రాంతంలో మాంగళ్య షాపింగ్ మాల్ 28వ శాఖను ఘనంగా ప్రారంభించింది. శుక్రవారం జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి శ్రీలీల ముఖ్య అతిథిగా హాజరై, దీపప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అక్కడి కలెక్షన్లను పరిశీలించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా రిబ్బన్ కటింగ్ అనంతరం నటి శ్రీలీల మాట్లాడుతూ "కర్మన్‌ఘాట్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉందని, వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుంది" అని తెలిపారు. ఎల్ బి నగర్ శాసన సభ్యుడు సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభించినందుకు అభినందిస్తూ, దీని ద్వారా ఇక్కడ యువతీ యువకులకు ఉపాధి కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహమూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ "ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే తమ విజయ రహస్యం" అని తెలిపారు.
అలాగే, "తమ స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేస్తూ, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నాం" అని పేర్కొన్నారు.

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల 'అనర్హత'పై

# 3 వారాల్లోగా తేల్చకుంటే...ఇక 'కోర్టు ధిక్కార చర్యే'

## తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు అల్టిమేటం

## రెండు కేసుల్లో నిర్ణయం తీసుకునే దశలో స్పీకర్ ఉన్నారని సీనియర్ న్యాయవాది సింఘ్వీ వెల్లడి

**న్యూఢిల్లీ :** తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం తుది హెచ్చరిక జారీ చేసింది. 10 మంది భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించడానికి సంబంధించిన మిగిలిన అనర్హత పిటిషన్లపై మూడు వారాల్లోగా నిర్ణయం తీసుకోనట్లయితే కోర్టు ధిక్కార చర్యలు ప్రారంభిస్తామని చెప్పింది. ఎమ్మెల్యేలు దాఖలు చేసిన ధిక్కార పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎ.జి. మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం విచారించిన సందర్భంగా ఈ విషయాన్ని స్పష్టంచేసింది. ఈ కేసులో స్పీకర్ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో జస్టిస్ కరోల్ మాట్లాడుతూ 'దీని గురించి మీరు రీల్స్ చేయవద్దని నేను మిమ్ములను అభ్యర్థిస్తున్నాను. అది మీరు చేయొద్దు. అది ఒక కొత్త ఇండస్ట్రీ'. ఏమి జరగనుందో అది జరుగుతుంది' అని అన్నారు. అభిషేక్ సింగ్ మాట్లాడుతూ స్పీకర్ ఒక కేసులో నిర్ణయం తీసుకున్నారు.రెండు ఇతర కేసుల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునే దశలో ఉన్నారని సింఘ్వీ చెప్పారు. ఆలస్యానికి లాయర్ సమాధానం వివరిస్తూ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా అన్ని పెండింగ్ అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు మూడు వారాల గడువు కోరారు. భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) శాసనసభ్యుల తరపు న్యాయవాది మాట్లాడుతూ ఇంతకుముందు స్పీకర్‌ను సమయం అడిగినప్పటికీ దీనికి సంబంధించి కేవలం ఒక్క సమావేశం కూడా జరుపలేదన్నారు. మునుపటి విచారణలో స్పీకర్ మూడు వారాల సమయం కోరారని, ఏదైనా పరిణామాలు జరుగుతాయో లేదో చూడటానికి కోర్టు అతడికి రెండు వారాల సమయం ఇచ్చిందని జస్టిస్ కరోల్ చెప్పారు.' స్పీకర్ ఇప్పటికైనా సానుకూల నిర్ణయం తీసుకుంటాడని మేం భావిస్తున్నాం. ఆయన ఈ నిర్ణయం తీసుకునే విషయంలో మళ్లీ వైఫల్యం చెందితే కోర్టు ధిక్కార చర్యలు జారీచేయక తప్పదు' అని ధర్మాసనం తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌కు ఫిరాయించిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై రెండు వారాలలో నిర్ణయాన్ని తెలియజేయాలని జనవరి 16న అత్యున్నత న్యాయస్థానం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను కోరింది. స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసేందుకు స్పీకర్‌కు రెండు వారాల గడువును ఇచ్చింది. 10మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలన్న తన ఆదేశాలను పాటించనందుకు గత ఏడాది నవంబరు 17న సుప్రీంకోర్టు కోర్టు ధిక్కార నోటీసును జారీచేసిన విషయం తెలిసిందే. గత ఏడాది జులై 31న సుప్రీంకోర్టు ఈ అంశంపై 3నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లపై స్పీకర్‌కు నోటీసులు జారీ చేస్తూ, గతంలో జారీచేసిన ఆదేశాలను పాటించకపోవడాన్ని అత్యున్నత న్యాయస్థానం 'అత్యంత దారుణమైన ధిక్కారం' అని వ్యాఖ్యానించింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి మరో 8 వారాల సమయం పొడిగించాలని కోరుతూ స్పీకర్ కార్యాలయం తరపున దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఒక నోటీసును కూడా జారీ చేసింది. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కె.టి.రామారావు, పాడి కౌశిక్ రెడి, వివేకానంద్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ల బ్యాచ్‌పై గతేడాది జులై 31న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నుంచి ఈ కోర్టు ధిక్కార పిటిషన్లు వచ్చాయి. రాజ్యాంగంలోని 10 వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేటప్పుడు స్పీకర్ ఒక ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తారని, తద్వారా స్పీకర్ రాజ్యాంగ ఇమ్యునిటీని అనుభవించే శక్తిని కలిగి ఉండరని కోర్టు పునరుద్ఘాటించింది. ఫిరాయింపు కారణాల వల్ల అనర్హత వేటు విధించే నిబంధనలను 10వ షెడ్యూల్ వివరిస్తుంది.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
అమీన్‌పూర్ సర్కిల్-47, శేరిలింగంపల్లి జోన్.
షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-03/GHMC/AMPR-C-47/2025-26, తేది: 05.02.2026
NIT No. Engg-03/GHMC/AMPR-C-47/2025-26, తేది: 05.02.2026, పని పేరు: నెం.1, సందర్భానుసారంగా ప్రాథమిక సౌకర్యాలను కల్పించడం. అంచనా విలువ/ఇసివి: రూ.4.00లక్షలు, డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 06.02.2026న ఉ.10.30గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 09.02.2026న మ.3.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అమీన్‌పూర్ సర్కిల్-47. సెల్ నెం. 7337557234. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అమీన్‌పూర్ సర్కిల్-47, ఎస్ఎల్‌పి జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 15044-PP/CL/ADVT/1/2025-26, Date: 06-02-2026

hmda హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.
HMDA Act. 2008లోని సెక్షన్ 15 (4) ప్రకారం బహిరంగ ప్రకటన
(G.O.Ms.No.249 MA&UD Dept., తేది: 19.11.2025)
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (2008 నాటి చట్టం నెం.8)లోని సెక్షన్ 15లోని సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ, ప్రభుత్వం ఇందుమూలంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (HMR) కోసం ఉద్దేశించిన MDP-2031లో భూ వినియోగానికి సంబంధించి, సదరు G.O.Ms.No.33 MA, తేదీ: 24.01.2013 ద్వారా ఆమోదించబడిన సెక్షన్ యొక్క సబ్-సెక్షన్ (1) ప్రకారం ఈ క్రింది మార్పును చేస్తుంది.
మేడ్చల్-మల్కాజిగిరి (జిల్లా), మేడ్చల్ (మండలం), రావల్‌కోల్ (గ్రామం)లోని సర్వే నెం.230/Pలో ఉన్న 4046.86 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గల స్థలం, ప్రస్తుతం MDP-2031లో పెరి-అర్బన్ వినియోగ జోన్ కోసం కేటాయించబడింది, ఇది G.O.Ms.No.33, MA&UD, తేది:24.01.2013 ద్వారా నోటిఫై చేయబడింది. ఇప్పుడు 'వైట్' కేటగిరీ కింద బస్సుల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి తయారీ వినియోగ జోన్‌గా నియమించబడింది.
పై వివరాలు ఈ క్రింది వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయి
http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in//.
సం/- ప్లానింగ్ అధికారి (RC) HMDA
DIPR R.O. No. : 15068-PP/CL/ADVT/1/2025-26, Date: 06-02-2026



## ఆరోగ్యమే అసలైన సంపద

మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు

**ప్రజాపక్షం/హయత్ నగర్:** అందరికి ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలి అని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్ బాలాజీ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వెల్నె మెడికల్ రిహాబిలిటేషన్ సెంటర్ ను భారత మాజీ ఉపరాష్ట్రపతి, పద్మ విభూషణ్ గ్రహీత ఎం.వెంకయ్య నాయుడు, ఆంధ్రప్రదేశ్ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా, వైద్య రంగాలు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా మారాలని, పేదలకూ ధనికులకూ తేడా లేకుండా ఉచితంగా అందుబాటులో ఉండాలన్నారు. అలాగే యువత కాలానికి తగ్గట్టు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభ్యసించి, సమాజంలో నాయకత్వ పాత్ర పోషించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, నాణ్యమైన పునరావాస వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన వెల్ నెస్ మెడికల్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ, ప్రజారోగ్యానికి ఇది కీలక మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కేంద్ర యాజమాన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, మరిన్ని సేవా కార్యక్రమాలతో సమాజానికి మేలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్ బినగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహా రెడ్డి, చింతల అరుణ సురేందర్ యాదవ్,హాస్పిటల్ యజమాన్యం డా.స్వాతి ప్రత్తిపాటి, డా.సిద్దార్థ్ సాయి, కామినేని ఎండి శశిధర్, ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రాంత సంఘచాలక్ సుందర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో బలపడుతున్న 'గిఫ్టింగ్ కల్చర్' : సురేష్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా కార్పొరేట్ గిఫ్టింగ్ ఇండస్ట్రీ వేగంగా వృద్ధి చెందుతోందని, ఈ రంగం మొత్తం విలువ ఏ 75 బిలియన్ డాలర్లకు చేరుకుందని అరబిందో ఫార్మా అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.సురేష్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో 'క్వెస్ట్ ఏసియా' పేరుతో గిఫ్టింగ్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రారంభ సెషన్‌లో సురేష్ కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ గిఫ్టింగ్ ఇండస్ట్రీ వచ్చే రెండేళ్లలో 90బిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. హైదరాబాద్ ఐటి హబ్‌గా మారిన నేపథ్యంలో కార్పొరేట్ గిఫ్టింగ్ కల్చర్ బలంగా పాతుకుపోయిందని, రాష్ట్రంలో 500లకు పైగా సాఫ్ట్‌వేర్, ఐటీ కంపెనీలు, 2,400లకు పైగా ఫార్మా కంపెనీలు, ల్యాబ్‌లు, బ్యాంకింగ్, మల్టీ నేషనల్ కంపెనీలు ఉండటంతో ఈ రంగం వేలకోట్ల బిజినెస్‌గా మారిందన్నారు. ఎక్స్‌పో గెలాక్సియా ఫౌండర్ డైరెక్టర్ రాఖీ ముఖర్జీ మాట్లాడుతూ ఎక్స్‌పో 8వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి గిఫ్టింగ్ ఐటమ్స్, స్టేషనరీ, హోం డెకోర్, టెక్నాలజీ హ్యాండీక్రాఫ్ట్ ఉత్పత్తులు ఈ ప్రదర్శన కొలువుదీరాయని వివరించారు. ఈ ఎక్స్‌పో కార్యక్రమంలో జీఐఎస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ ఉపాధ్యాయ్, శ్రీకాంత్‌లతో పాటు గెలాక్సియా ప్రతినిధులు దేవ్ తదితరులు పాల్గొన్నారు.

## 14 ఏళ్లుగా ప్రపంచస్థాయిలో అగ్రస్థానం కొనసాగింపు

నాసా నేషనల్ స్పేస్ సొసైటీ పోటీలో
ప్రపంచ ఛాంపియన్‌గా శ్రీ చైతన్య స్కూల్ : డైరెక్టర్ సీమ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికా నాసా ఆధ్వర్యంలోని నేషనల్ స్పేస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్) నిర్వహించిన ప్రతిష్టాత్మక లివ్ ఇన్ ఏ హెల్త్ స్పేస్ డిజైన్ కాంపిటిషన్ 2026లో శ్రీ చైతన్య స్కూల్ మరోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిందని సంస్థ డైరెక్టర్ సీమ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా 12 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ పోటీలో శ్రీ చైతన్య విద్యార్థులు అసాధారణ ప్రతిభను కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు గర్వకారణంగా నిలిచారన్నారు. అంతరిక్ష నివాసాల్లోని అగ్రికల్చరల్ మాడ్యూల్ (వ్యవసాయ విభాగం) రూపకల్పన చేయడం లక్ష్యంగా నిర్వహించిన ఈ పోటీ ఫలితాలను నేషనల్ స్పేస్ సొసైటీ తాజాగా ప్రకటించిందని, ప్రపంచవ్యాప్తంగా ప్రకటించిన మొత్తం 85 బహుమతుల్లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఏకంగా 34 బహుమతులు (40శాతం) కైవసం చేసుకోవడం విశేషమని కొనియాడారు. వీటిలో 7 ప్రపంచ ప్రథమ బహుమతులు ఉండటం మరో ఘనత అని పేర్కొన్నారు. గత 14 ఏళ్లుగా నాసా ఎన్ఎస్ఎస్ నిర్వహించే ఈ అంతర్జాతీయ పోటీల్లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలుస్తున్న ఏకైక విద్యా సంస్థగా శ్రీ చైతన్య రికార్డు సృష్టించిందని తెలిపారు. బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అలాగే ఈ విజయానికి నిరంతరం కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ఆమె హృదయపూర్వకంగా అభినందించారు.

## బిఆర్ఎస్ బిసిల పక్షమా.. బిసి ద్రోహుల పక్షమా!

మాజీ సిఎం కెసిఆర్‌కు బిసి జెఎసి చైర్మన్ జాజుల లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్లు పెంచకుండా అడ్డుపడిన గుట్టెంగారి మాధవరెడ్డికి గులాబీ కండువా కప్పి, ప్రస్తుతం జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించి, కెసిఆర్ చారిత్రక తప్పు చేశాడని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ బిసిల పక్షమా.. బిసి ద్రోహుల పక్షమా స్పష్టం చేయాలని కోరారు. ఈ మేరకు మాజీ సిఎం కెసిఆర్‌కు శుక్రవారం జాజుల లేఖ రాశారు. 'తెలంగాణ రాష్ట్రంలో 60శాతం పైగా ఉన్న కోట్లాదిమంది బిసిలు తమకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు కావాలని దశాబ్దాలుగా పోరాడుతున్న విషయం మీకు తెలియనిది కాదు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌లో బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి, అనంతరం సమగ్ర కులగణన జరిపి, రిజర్వేషన్లు పెంచే ప్రక్రియలో భాగంగా అసెంబ్లీలో బిల్లు పెట్టి, చట్టం చేసిన విషయం మీకు విధితమే. చట్టం ఆమోదం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు పెంచుతూ జీవో నెంబర్ 9 విడుదల చేసింది. కానీ, ఆ జీవోను సవాల్ చేస్తూ, బిసిల రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ రెడ్డి జాగృతికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డి కోర్టులో కేసులు వేసి, పెంచిన రిజర్వేషన్లు కోర్టుల ద్వారా కొట్టి వేయించడం జరిగింది. నిజంగా టిఆర్ఎస్ పార్టీకి బిసిలపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే మాధవరెడ్డిని బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేసి, బిసి సమాజాన్ని క్షమాపణ కోరడంతో పాటు తమ పక్షాన నిలబడాలని మిమ్ములను కోరుతున్నాం. మీ నిర్ణయాన్ని 48 గంటల్లో వెల్లడించాలని, లేని పక్షంలో రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బిసిల పక్షాన ప్రజాస్వామ్యుతంగా మీ బిసి వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ, రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చి, మీ బిసి వ్యతిరేక వైఖరిని గ్రామ గ్రామాన ఎండగడతాం' అని జాజుల శ్రీనివాస్ గౌడ్ లేఖలో పేర్కొన్నారు.

# ఆక్రమణలపై హైడ్రా చర్యలు

బోరబండలో మూడున్నర ఎకరాలు కాపాడిన హైడ్రా
సుమారుకుంట చెరువులో ఆక్రమ కట్టడాల తొలగింపు
బోరబండలో 3.20 ఎకరాలు,
సుమారుకుంట చెరువులో 11 ఎకరాలు
నాగారంలో 1365 గజాల ఆలయ భూమి కాపాడిన హైడ్రా




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరవ్యాప్తంగా అక్రమ కట్టడాలు, భూ ఆక్రమణలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. నగరంలో పలు చోట్ల చెరువులు, ప్రభుత్వ భూములు, దేవాలయ స్థలాలో అక్రమణలను, అక్రమ కట్టడాలను శుక్రవారం చేపట్టిన ప్రత్యేక చర్యల్లో తొలగించింది. బోరబండలోని 3.20 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దూలపల్లి గ్రామంలోని సుమారుకుంట చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో 11 ఎకరాల మేర అక్రమకట్టడాలను తొలగించింది. నాగారం, రామకృష్ణానగర్‌లో 1365 గజాల శివాలయం భూమిని హైడ్రా కాపాడింది.

**ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమ కట్టడాల తొలగింపు..**

మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా, దుండిగల్, గండిమైసమ్మ మండలం దూలపల్లి గ్రామంలోని సుమారుకుంట చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించింది. సుమారు 42 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో మట్టి నింపడం, ప్రహరీలు నిర్మించడం, తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయడం వంటి అక్రమాలు జరుగుతున్నాయంటూ ఫిర్యాదులు అందాయి. నిబంధనలను ఉల్లంఘిస్తూ స్క్రాప్ దుకాణాలు, హోటళ్ల షెడ్లు, కంటైనర్ తయారీ కేంద్రాలు, వెల్డింగ్ షాపులు ఏర్పాటు చేయడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని హైడ్రా అధికారులు గుర్తించారు. ఈ మేరకు సుమారు 11 ఎకరాల మేర అక్రమ ఆక్రమణలను తొలగించారు. చెరువు శిఖం పట్టా భూముల్లో నీరు లేనప్పుడు వ్యవసాయం మాత్రమే చేయాలని, నిర్మాణాలు చేపట్టరాదని అధికారులు స్పష్టం చేశారు.

**బోరబండలో 3.20 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం..**

ఖైరతాబాద్ మండలం యూసుఫ్‌గూడ గ్రామం, సర్వే నెంబర్ 128/1లోని 3.20 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. గతంలో అర్బన్ ల్యాండ సీలింగ్ యాక్ట్ కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిపై తప్పుడు పత్రాలతో ఆక్రమణకు ప్రయత్నించిన వ్యక్తిపై హైడ్రా బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసును హైడ్రా అధికారులు నమోదు చేశారు. ఈ భూమిలో కొనసాగుతున్న ఇసుక, ఇటుక వ్యాపారాలు, తాత్కాలిక షెడ్లను తొలగించి హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

**గుడి భూమిని కాపాడిన హైడ్రా**

మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా, కీసర మండలం, నాగారం రామకృష్ణ నగర్ కాలనీ (హెచ్ఎంటి లేఔట్)లోని శివాలయానికి చెందిన 1365 గజాల భూమిని హైడ్రా కాపాడింది. 2017లో 400 గజాల్లో ఆలయం నిర్మించగా, మిగిలిన భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన హైడ్రా అధికారులు ఈ భూమి ఆలయానికి కేటాయించిదేనని, నిర్ధారించి, 1365 గజాల భూమి దేవాలయానికి చెందినదిగా బోర్డులు ఏర్పాటు చేశారు. నగరంలో ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ, దేవాలయ భూముల రక్షణకు హైడ్రా చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. నగరంలో ఎక్కడైనా చెరువులు, కుంటలు లేదా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతే కఠిన చర్యలు తప్పవని హైడ్రా అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## 'వాట్సాప్ మీసేవ విధానం' ద్వారా అత్యవసర సేవలు

ఇప్పటివరకు డిజిటల్ సేవలు పొందిన 3.25 లక్షల మంది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో మీ సేవా కేంద్రాల ఎదుట క్యూ కట్టే పనిలేకుండా ప్రజాప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 'వాట్సాప్ మీసేవ విధానం' తక్కువ కాలంలోనే ప్రజలకు చేరువైంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 4.5లక్షల మంది వివిధ పౌర సేవలకు వాట్సాప్ మీసేవలో నమోదు చేసుకోగా వారిలో సుమారు 3.25లక్షల మంది డిజిటల్ సేవలను పొందారు. దీంతో భవిష్యత్‌లో అత్యవసర సేవలను కూడా వాట్సాప్ మీసేవ ద్వారా అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అత్యవసర సేవలైన 108, 102, అగ్నిమాపక సేవలకు 101, ఎస్‌పిజి గ్యాస్ సిలిండర్ బుకింగ్, ముఖ్యమైన హెల్ప్ లైన్ నెంబర్లన్నీ వాట్సాప్ మీసేవ విధానానికి లింక్ చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వవర్గాల సమాచారం ప్రచారం వాట్సాప్ మీసేవతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకు పైగా మీసేవా కేంద్రాలు ప్రతిరోజూ 80 వేల మంది నుంచి లక్ష మందికి డిజిటల్ పౌర సేవలు అందిస్తున్నాయి. 2023 నవంబర్1 నుంచి 2026 జనవరి 31 వరకు, మీసేవ ద్వారా 5.98 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.3,811 కోట్లుగా ఉందని అంచనా. మీ సేవ కేంద్రాలు, వాట్సాప్ మీసేవా విధానం ద్వారా అనవసరమైన మధ్యవర్తుల పాత్ర తొలిగిపోయి ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరిగే పని తగ్గింది. సేవల్లో పారదర్శకత మెరుగుపడింది. పౌర సేవల పరిష్కారం వేగవంతమైందని సమాచారం. గత ఏడాది నవంబర్ 18న రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించిన 'వాట్సాప్ మీసేవా 8096958096' అనే వాట్సాప్ నంబర్ ద్వారా నిర్విరామంగా 24 గంటల పాటు పౌర సేవలు పొందేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. వాట్సాప్ మీసేవ నుంచి మొత్తం పదికి పైగా ప్రభుత్వ శాఖలకు చెందిన 581 వివిధ రకాల సేవలు రాష్ట్ర ప్రజలు పొందే అవకాశం కల్పించింది. ప్రధానంగా కుల, ఆదాయ సర్టిఫికెట్లు పొందడం చాలా సులువైంది. ఎక్కువ మంది ఆదాయ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, రెసిడెన్సీ సర్టిఫికెట్, పోలీస్ చలాన్, రెన్యువల్ ఆఫ్ రేషన్ షాప్స్, టెంపుల్ సర్వీసెస్, బిల్డింగ్ పర్మిషన్, వెహికిల్ లైఫ్ ట్యాక్స్, లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు వాట్సాప్ లోనే పొందొచ్చు. మీసేవ సర్టిఫికెట్ల స్టేటస్, తాజా అప్ డేట్స్ కూడా వాట్సాప్‌లోనే తెలుసుకోవటం, ఆమోదం పొందిన సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉండటంతో పదే పదే మీసేవ కేంద్రాలకు వెళ్లే శ్రమ తగ్గింది. వాట్సాప్ సేవలతో ఆశించిన మేరకు పౌర సేవలు వేగం పుంజుకోవటంతో పాటు దరఖాస్తుదారులకు ప్రభుత్వం మరింత చేరువైంది. దరఖాస్తుదారులు ప్రశ్నలు అడగడానికి, సేవలకు దరఖాస్తు చేసుకోవడానికి, చెల్లింపులు చేయడానికి లేదా వారి దరఖాస్తుల స్థితిని తనిఖీ చేయడానికి సందేశం పంపి సంబంధిత సేవను నేరుగా పొందవచ్చు. వాట్సాప్ మీసేవ ద్వారా రాష్ట్రంలో 31 దేవాలయాలకు సంబంధించిన సేవలను అందజేస్తున్నది. భక్తులు దర్శనం, వసతి తదితర సేవలు ఇందులోనే బుక్ చేసుకోవచ్చు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల మధ్య 'ఫెవికాల్' బంధం

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలు 'ఫెవికాల్' వంటి బంధంతో కలిసి పనిచేస్తున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. బిజెపిని అడ్డుకోవడమే వీరి ప్రధాన లక్ష్యమని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. బిఆర్ఎస్ పార్టీ తన పత్రిక ద్వారా రాహుల్ గాంధీకి మద్దతు తెలుపుతూ తమ మధ్య ఉన్న అనుబంధాన్ని చాటుకుంటోందన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని వ్యక్తిగతంగా విమర్శించడం రేవంత్ రెడ్డి అసహనాన్ని సూచిస్తోందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ కుటుంబాన్ని సిఎం రేవంత్ రెడ్డి కాపాడుతున్నారని ఆరోపించారు. గతంలో 'ఓటుకు నోటు' కేసులో కెసిఆర్ కుటుంబం రేవంత్ రెడ్డిని కాపాడినందుకు కృతజ్ఞతగా, నేడు ఆయన వారిని అరెస్ట్ చేయకుండా కేవలం సాక్షులుగా మాత్రమే పిలుస్తున్నారని మండిపడ్డారు. తన పేరు వెనుక వివిధ కులాల పేర్లను (యాదవ్, ముదిరాజ్, మాదిగ) తగిలించుకొని ఓట్లు పొందాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారని, కానీ తెలంగాణ ప్రజలు ఈ నాటకాలను నమ్మరన్నారు. గతంలో 'రెడ్డిలకే పరిపాలించే అర్హత ఉంది' అని మాట్లాడిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు బడుగు బలహీన వర్గాల ఓట్ల కోసం తాత్కాలిక వేషాలు వేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని 'బొంద' పెట్టడం ఖాయమని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్‌బిఆర్ఎస్ కుట్రలను ప్రజలు తిప్పికొట్టి మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి పట్టం కడతారని రాంచందర్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రిజర్వేషన్లకు బిఆర్ఎస్ వ్యతిరేకమా?

బిసి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ
కేసు వేసిన వ్యక్తికి బిఆర్ఎస్ టికెట్
12న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ
కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన మాధవ రెడ్డికి మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ బిఫామ్ ఎలా ఇచ్చారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. మాధవ రెడ్డికి టికెట్ ఇవ్వడంతో బిసి రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని బిఆర్ఎస్ రాజముద్రతో చెప్పినట్టుగా ఉన్నదని, దీనిపైన రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 12న హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో ' తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ' సభను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సభకు ఉద్యమకారులు, అమరుల కుటుంబ సభ్యులు, తెలంగాణ వాదులు హాజరుకావాలని కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ మాదవరెడ్డికి బిఫామ్ ఇవ్వడమంటే బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ కేసు వేయించిందా?, బిసిల రిజర్వేషన్లకు బిఆర్ఎస్ వ్యతిరేకమా? అని కవిత నిలదీశారు. మాధవ్ రెడ్డి అనే వ్యక్తి హరీష్ రావుకు దగ్గర అని, హరీష్ రావు వ్యక్తిగత న్యాయవాదితోనే మాదవ రెడ్డి కేసు వేయించారని, దీని వెనుక ఉన్నది హరీష్ మాత్రమే అని తాను ఇది వరకు అనుకున్నానని, కానీ ఎన్నికల్లో మాదవరెడ్డికి టికెట్ ఇవ్వడాన్ని పరిశీలిస్తే ఆయన వెనుక బిఆర్ఎస్ ఉన్నట్టుగా అర్థమవుతోందన్నారు. బిసిల నోటికాడ ముద్దలాక్కునే ప్రయత్నం చేసిన వ్యక్తికి బిఆర్ఎస్ తమ రాజముద్ర వేసిందన్నారు. బిఆర్ఎస్‌లో గెలిచిన ఎంఎల్ఎ గాంధీని నిజామాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా నియమించారని, ప్రకాశ్ గౌడ్, తెల్లం వెంకట్ రావు ఆర్ఎస్ ఎంఎల్ఎలుగా స్పీకర్ ప్రకటిస్తే, వారిని కూడా కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలోల ప్రశ్నించే తమలాంటి వారిని గెలిపించాలని కవిత కోరారు. తెలంగాణ చరిత్రలో కెసిఆర్ ఒక పుస్తకమని, ఆయన చరిత్రను ఎవ్వరూ చెరిపేయలేరని, తాను కెసిఆర్‌కు మద్దతుగా మాట్లాడటం లేదని, రాజకీయంగా ఆయన విధానాలను విభేదిస్తామని, అయితే తెలంగాణలో మర్యాదపూర్వకమైన రాజకీయాలు ఉండాలని తాను కోరుకుంటున్నానని కవిత అన్నారు.

**మంచి ముహూర్తం చూసి.. మూడు నెలల్లో పార్టీ ప్రకటన..**


మూడు నెలల్లో మంచి ముహూర్తం చూసుకుని రాజకీయ పార్టీని ప్రకటిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బిఆర్ఎస్ కేవలం తెలంగాణ భవన్‌కే పరిమితమైందని క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో కూడా చూసుకోవడం లేదని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కెటిఆర్, హరీశ్ రావు రాష్ట్రమంతా ప్రచారం చేయడం లేదని,?, కెటిఆర్ సిరిసిల్లకే ఎందుకు పరిమితమయ్యారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో జర్నలిస్టులతో కవిత శుక్రవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమను 16మంది బిఆర్ఎస్ నాయకులు కలిశారన్నారు. జాగృతి అభ్యర్థులు పోటీ చేస్తున్న ప్రాంతాల్లోనే హరీష్ రావు తిరుగు తున్నారన్నారు. జగిత్యాలలో జీవన్ రెడ్డి చాలా బలమైన నాయకుడని, ఆయనను ఓడించేందుకు తాము గతంలో చాలా కష్ట పడ్డామని కవిత గుర్తు చేశారు.

## బెయిల్ ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైన్మా పైరసీలకు పాల్పడ్డాడని చెప్పి పోలీసులు అరెస్టు చేసిన ఇమ్మడి రవి అలియాస్ ఐబొమ్మ రవి బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్లు వేశారు. దీనిని జస్టిస్ సుజన విచారించారు. పోలీసులు పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారని రవి లాయర్ చెప్పగా, ఈ విషయంపై అధికారుల నుంచి స్పష్టత తీసుకోవాల్సివుందని పోలీసుల తరపున పీపీ నాగేశ్వర్‌రావు చెప్పారు. దీంతో పిటిషనర్ పాస్‌పోర్టు ఎవరి దగ్గర ఉందో చెప్పాలని కోరిన న్యాయమూర్తి విచారణను ఈ నెల 9కి వాయిదా వేశారు. బెయిల్ ఇస్తే వేరే దేశం పాస్‌పోర్టు కూడా ఉన్న రవి విదేశాలకు పారిపోవచ్చునని పీపీ చెప్పారు. విచారణ అయ్యింది కాబట్టి బెయిల్ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు.

## ఎఎంవిఐలకు 5 నెలల బేసిక్ ట్రైనింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లకు (ఎఎంవిఐ) సంబంధించి ఐదు నెలల ప్రాథమిక శిక్షణ (బేసిక్ ట్రైనింగ్) కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ శిక్షణలో మొత్తం 15మంది ఎఎంవిఐ ట్రైనీలు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ పి. మధుకర్ స్వామి, గెస్ట్ ఆఫ్ హానర్‌గా డిప్యూటీ డైరెక్టర్ డి.డి. వెంకటేశ్వర్లు హాజరయ్యారు. అలాగే ఔట్‌డోర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి, కోర్సు డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, రవాణా శాఖ కోఆర్డినేటర్ ఆర్‌టిఓ రఘునందన్ గౌడ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథి పి.మధుకర్ స్వామి మాట్లాడుతూ, తెలంగాణ పోలీస్ అకాడమీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో శిక్షణ పొందటం ట్రైనీలకు లభించిన అరుదైన అవకాశమన్నారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ నాయకత్వంలో ఈ సంస్థ దేశంలోనే అగ్రశ్రేణి శిక్షణా కేంద్రంగా ఎదిగిందని ప్రశంసించారు. వేల మందిలో ప్రతిభతో ఎంపికైన ట్రైనీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలు, క్రమశిక్షణ పెంపొందించుకోవాలని సూచించారు.



## డ్రైవర్ల సమస్యలకు 12న రాష్ట్ర బంద్


జయప్రదం చేయాలని జెఎసి నేతల పిలుపు


**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఆటో, క్యాబ్, ట్యాక్సీ, లారీ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న నిర్వహించ తలపెట్టిన రాష్ట్రవ్యాప్తంగా బంద్ చేపడుతున్నట్టు తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్ల , క్యాబ్, టాక్సీ, లారీ డ్రైవర్ల సంఘాల జెఎసి తెలిపింది. ఈ బంద్‌లో ఆటో డ్రైవర్లు, రవాణారంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరింది. బంద్‌లో భాగంగా హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కల్యాణమండపం నుంచి ఇందిరాపార్కు వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జెఎసి కన్వీనర్ వెంకటేశం (ఎఐటియుసి), కో–కన్వీనర్లు వి. మారయ్య (బిఆర్‌టియు), రామకృష్ణారెడ్డి (ఐఎన్‌టియుసి), వి.ప్రవీణ్ (టియుసిఐ), యాదగిరి (టిఎన్‌టియుసి), సత్తిరెడ్డి (టిఎడిఎస్), అమానుల్లా ఖాన్, షేక్ మజీద్ (ఐఎల్‌డబ్ల్యూఎఫ్), శ్రీనివాస్ (జియుటిఐఎస్), ఎస్. దయానంద్ (టిటిడబ్ల్యూయు), శివ ఆనంద్ (టిఎఎండియు)లు బంద్‌ను పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశం మీడియాతో మాట్లాడుతూ నూతన మోటర్ వాహన చట్టం, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కేంద్రం రవాణారంగ కార్మికుల నడ్డివిరిచిందని మండిపడ్డారు. మోటర్ వాహన చట్టంతోపాటు ఆటోడ్రైవింగ్ లైసెన్స్ సారథి వాహన పోర్టులను వెంటనే కేంద్రప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో మీటర్ చార్జీలు పెంచుతామని, ఆటో రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు తెస్తామని, ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సహాయం వంటి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్, అధికారంలోకొచ్చి వాటిని అమలుచేయకపోవడం విచారకరమన్నారు. వి.మారయ్య మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో ఇతర జిల్లాల ఆటోలు, ఓలా, రాపిడో, ఉబర్ ద్వారా అక్రమంగా నడుస్తున్న త్రీవీల్లర్‌లను వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు.

రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. రెండు తెలుగ రాష్ట్రాల మధ్యన కౌంటర్ సిగ్నిచర్ పర్మిట్‌ను అమలు చేయాలన్నారు. 15 ఏళ్లు దాటిన వాహనాలకు కేంద్రం పెంచిన ఫిట్‌నెస్ రెన్యువల్ చార్జీలను తగ్గించి, పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. వి. ప్రవీణ్ మాట్లాడుతూ హెవీ డ్రైవింగ్ స్కూళ్లు పాత ఉమ్మడి జిల్లాల్లో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. యాదగిరి మాట్లాడుతూ హయ్యర్ వెహికిల్ చార్జీలను రూ.33వేల నుంచి 54వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సత్తి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఐటి కార్యాలయాల్లో నడుస్తున్న ట్యాక్సీ వాహనాల కిలోమీటర్ చార్జీలన పెంచాలని కోరారు. అమానుల్లా ఖాన్ మాట్లాడుతూ ఆటో, క్యాబ్ లకు ఈ–చలాన్‌ల నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐటియుసి ఆటో డ్రైవర్స్ యూనియన్ నేతలు ఎస్.అశోక్, సిహెచ్. జంగయ్య, నరసింహ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పన్ను చట్టాల సరళీకరణను నొక్కి చెప్పిన బడ్జెట్

కేంద్ర బడ్జెట్ 2026-27 చాటెర్డ్ అకౌంటెంట్ వై.వి.భానునారాయణ రావు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర బడ్జెట్ 2026–27 పన్ను చట్టాల సరళీకరణ, స్పష్టతను నొక్కి చెప్పిందని, కేంద్ర బడ్జెట్‌లో నియమాల పాటింపుపై కఠినమైన నిఘా ఉందని ప్రము ఖ చాటెర్డ్ అకౌంటెంట్ వై.వి.భానునారాయణ రావు అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ (టిఎపిటిబిఎ) ఆధ్వర్యంలో 'యూనియన్ బడ్జెట్–2026' అంశంపై విశ్లేషణ కార్యక్రమం సికింద్రాబాద్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఎ పంకజ్ సంచేటి అధ్యక్షత వహించగా టిఎపిటిబిఎ కార్యదర్శి, సిఎ ఆశిష్ జోషి, కోశాధికారి సిఎ సోమేశ్వర్ నేమాని, ఉపాధ్యక్షులు సిఎ నారాయణ రావు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు రమణ రెడ్డి, కలహస్తి శ్రీనివాస, వెంకట్ రామ్, మాజీ అధ్యక్షులు రామ్‌దేవ్ భూటాడా, హితేష్ జైన్, రితేష్ మిట్టల్, మహేష్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మురళీ మోహన్ పాలోడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.వి.భానునారాయణ రావు మాట్లాడుతూ భారతదేశ పన్ను వివాద చట్రంపై ఒత్తిడిని తగ్గించేందుకు పెరిగిన వ్యాజ్యాల పెండింగ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని, క్లెయిమ్‌లను వాదించడానికి అవసరమైన పన్ను డిపాజిట్ మొత్తాన్ని తగ్గించడం, అసెస్‌మెంట్, పెనాల్టీ ప్రొసీడింగ్‌లను ఏకీకృతం చేయడం, పన్ను చెల్లింపుదారులు తిరిగి మూల్యాంకన దశలో నవీకరించబడిన రిటర్న్‌లను దాఖలు చేయడానికి అనుమతించడం ఈ బడ్జెట్‌లో ముఖ్యమైన అంశాలన్నారు. సిఎ చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ యూనియన్ బడ్జెట్‌ను దేశ ఆర్థిక దిశను చూపడమే కాకుండా ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రతిబింబిస్తుందని, బడ్జెట్ సరైన విధంగా అమలు చేయడంపై సామాన్య పౌరుల భవితవ్యం ఆధారపడి ఉంటుందన్నారు. సిఎ సతీష్ సరాఫ్ జిఎస్‌టి ప్రతిపాదనలపై వివరించారు.

# మా ప్రశ్నలకు జవాబిచ్చేందుకు మోదీకి ధైర్యం లేదు

ప్రభుత్వం సభను ప్రజాస్వామ్య పద్ధతిలో నడపాలనుకోవడం లేదు

అబద్ధాలను పదే పదే చెప్పడం మోదీ పని

ప్రధానిపై విరుచుకుపడిన మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ:** రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధానికి తమ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేదని, ప్రభుత్వం సభను ప్రజాస్వామ్య పద్ధతిలో నడపాలనుకోవడం లేదని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఖర్గే విలేకరులతో మాట్లాడుతూ 'అబద్ధాలను పదే పదే చెప్పడం' మోదీ పని అని, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు తన 97 నిమిషాల సుదీర్ఘ సమాధానంలో ఆయన ముఖ్యమైన లేదా అవసరమైన విషయం ఏదీ చెప్పలేదని అన్నారు. 'మేము రాష్ట్రపతి ప్రసంగంపై సవరణలు సూచించగా, ప్రధానమంత్రి ఒక్క పాయింట్‌కు కూడా స్పందించలేదు. ఆయన కేవలం 100 సంవత్సరాలు... 75 సంవత్సరాలు... 50 సంవత్సరాల గురించి మాట్లాడుతూనే ఉన్నారు' అని ఖర్గే అన్నారు. 'మాకు నరవణే పుస్తకం దొరికినప్పుడు, అధికారంలో ఉన్నవారికి అది ఎలా దొరకకుండా ఉంటుంది? ఆ పుస్తకం ఇంకా ప్రచురించబడలేదని వారు పార్లమెంటులో చెబుతున్నారు. అది అమిత్ షా అయినా, రాజ్‌నాథ్ సింగ్ అయినా... అందరూ ఆ పుస్తకం లేదని పదే పదే చెబుతూనే ఉన్నారు, కానీ వాస్తవం ఏమిటంటే ఆ పుస్తకం ఉంది' అని కాంగ్రెస్ అధినేత అన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో నరవణే పుస్తకం గురించి మాట్లాడినప్పుడు, ఏదో కారణం చేత అధికార పక్షం మొత్తం అభ్యంతరానికి గురైందని ఆయన అన్నారు. అయితే ముందుగా, సత్యాన్ని వినండి, ఆపై సమాధానం చెప్పండి అని తాను వారికి చెప్పాలనుకంటున్నానన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం నరేంద్ర మోదీకి లేదన్నదే నిజం అని ఖర్గే ఉద్ఘాటించారు. తాము సిక్కులను అవమానించామని మోదీ అన్నారు. అంటే, సభ వెలుపల ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణను సిక్కులకు అవమానంగా చిత్రీకరించారు అని మండిపడ్డారు. 'కాంగ్రెస్ పార్టీ సిక్కులను ఎంతో గౌరవిస్తుంది; కాంగ్రెస్ ప్రభుత్వంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా పని చేశారు, కానీ నరేంద్ర మోదీ సిక్కులను, దళితులను, ఆదివాసీలను ఎవరినీ గౌరవించరు. ఇతరులను ఎలా కించపరచాలనేదే నరేంద్ర మోదీ మనసులో ఉన్న ఏకైక విషయం' అని ఆయన ఆరోపించారు. ఆధునిక భారతదేశ నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ రంగాన్ని స్థాపించారు, కానీ మోదీ వాటిని దివాలా తీసే కర్మాగారాలు అని పిలుస్తున్నారని, నెహ్రూపై ప్రధాని చేసిన విమర్శలను ఖండిస్తూ ఆయన అన్నారు. 'దేశంలో ఒక్క గడియారం కూడా తయారుకాని రోజుల్లో, ప్రభుత్వ రంగమే ముందుకు వచ్చింది, కానీ ప్రభుత్వ రంగాన్ని కాపాడటానికి బదులుగా, నరేంద్ర మోదీ దానిని నిర్వీర్యం చేయడానికి పని చేశారు. నరేంద్ర మోదీకి ఎటువంటి సిద్ధాంతం లేదు. దేశాన్ని నడిపించడానికి ఆయనకు ఎటువంటి దార్శనికత లేదు' అని ఖర్గే ఆరోపించారు. ఈ ప్రకటనలు మోదీ మనోధైర్యం దెబ్బతిందని, ఆయనలో మునుపటి ఉత్సాహం తగ్గిపోయిందని చూపిస్తున్నాయని ఖర్గే పేర్కొన్నారు. ప్రధాన మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్యానికి, దేశానికి వ్యతిరేకంగా దుర్భాషలు వాడితే అది మంచిది కాదు. రాహుల్ (గాంధీ) జీ ఎలాంటి ప్రశ్నలు అడుగుతారో, ఏం చెబుతారో, ఎలాంటి వాస్తవాలు బయటపెడతారో అని నరేంద్ర మోదీ భయపడుతున్నారు, అందుకే మోదీ జీ సభలో కూర్చోవడం కూడా లేదు అని ఆయన అన్నారు. 'మాకు నిఘా సమాచారం అందింది, అందుకే రాష్ట్రపతి ప్రసంగానికి లోక్‌సభలో సమాధానం ఇవ్వవద్దని మోదీ జీకి సలహా ఇచ్చామని స్పీకర్ చెబుతున్నారు. మీ నిఘా వ్యవస్థ అంత పటిష్టంగా ఉంటే, పుల్వామా వంటి ఉగ్రవాద దాడుల సమయంలో అది ఎక్కడికి వెళ్లింది? దేశవ్యాప్తంగా మూకదాడులు జరుగుతున్నాయి, ఆదివాసీలు, దళితులపై దాడులు జరుగుతున్నాయి. అప్పుడు ఈ నిఘా సమాచారం ఎక్కడికి పోతుంది?' అని ఖర్గే ప్రశ్నించారు. ఒకేసారి ఐదు రోజుల పాటు పార్లమెంటును స్తంభింపజేయడం ప్రజాస్వామ్య వైఫల్యమని, లోక్‌సభలో ప్రతిష్టంభనకు ప్రభుత్వమే కారణమని ఆయన ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో సభను నడపడానికి కూడా ఇష్టపడటం లేదని ఆరోపించారు. గత కొన్ని రోజులుగా నరేంద్ర మోదీ కలత చెందుతున్నారు. ఎందుకంటే ఆయనకు సంబంధించిన విషయాలు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బయటపడ్డాయని, ఆ తర్వాత, నరేంద్ర మోదీ ట్రంప్ ముందు లొంగిపోయి వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆయన దేశ రైతులను బలిపశువులను చేశారని ఖర్గే ధ్వజమెత్తారు. మోదీ మన ప్రజలను పేదలను చేస్తూ, అమెరికా రైతులకు సంపదను పెంచుతున్నారని ఖర్గే ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో అంతరాయాలు సృష్టించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ భారత రాష్ట్రపతిని అవమానించిందని ప్రధాని మోదీ ఆరోపించిన ఒక రోజు తర్వాత ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.

# వృద్ధ మహిళ డిజిటల్ అరెస్ట్..

## రూ. 4.62 కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లు

**ముంబయి :** దేశ ఆర్థిక రాజధాని ముంబయి మరో డిజిటల్ అరెస్టు స్కామ్ వెలుగు చూసింది. సైబర్ నేరగాళ్ల వలలో పడ్డ 74 ఏళ్ల మహిళ సుమారు 4.62 కోట్లు కోల్పోయింది. బాంబే ఐఐటిలో మెడికల్ ఆఫీసర్‌గా చేసి ఆమె రిటైరైంది. మనీల్యాండరింగ్ కేసులో ఉన్నావని, సిబిఐ అరెస్టు చేస్తుందని ఆమెను బెదిరించినట్లు పోలీసులు వెల్లడించారు. వృద్ధ మహిళను మోసం చేసిన కేసులో నరేంద్ర సిన్హా, గుంజన్ దేవ్‌కుమార్ దినేశ్‌చంద్రను ముంబై వెస్ట్రన్ రీజియన్ సైబర్ సెల్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ నేరగాళ్లకు ఆ మహిళ బ్యాంక్ అకౌంట్లను అందజేసినట్లు ఆ ఇద్దరిపై ఆరోపణలు ఉన్నాయి. బాధిత వృద్ధ మహిళకు తొలుత ఓ వ్యక్తి నుంచి వీడియో కాల్ వచ్చింది. టెలికాశం శాఖ అధికారి అని ఆ వ్యక్తి ఫోన్ చేశాడు. మరో వ్యక్తి ఐపిఎస్ ఆఫీసర్ అని బెదిరించాడు. ఆధార్ కార్డు నెంబర్ ఆధారంగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి 6 కోట్లు కాజేశారని ఆ మహిళను బెదిరించారు. ఇది మనీల్యాండరింగ్ కేసు కిందకు వస్తుందని హెచ్చరించారు. సిబిఐ కేసు నమోదు చేసిందని, త్వరలో అరెస్టు చేస్తారని ఆ వృద్ధురాలిని బెదిరించారు. సైబర్ క్రిమినల్స్ వత్తిళ్లకు భయపడ్డ ఆ మహిళ తన ఎఫ్‌డి, రికరింగ్ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకున్నది. సుమారు 4.62 కోట్ల ఎఫ్‌డిలను ఆమె తన ఖాతా నుంచి 2025 అక్టోబర్ నుంచి 2026 జనవరి మధ్య విత్‌డ్రా చేసుకున్నది. ఆ డబ్బును సైబర్ క్రిమినల్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేసింది. చీటింగ్ జరిగినట్లు గుర్తించిన ఆ మహిళ తుదకు పోలీసుల్ని ఆశ్రయించింది. ఐటి చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ కోసం సిన్హా, దినేశ్‌చంద్రలు పలు అకౌంట్లు ఓపెన్ చేశారు. ఆ డబ్బును సైబర్ క్రిమినల్స్‌కు ఇచ్చి కమీషన్ తీసుకున్నారు.

## జలంధర్ గురుద్వారా వద్ద ఆమ్ ఆద్మీ నేత కాల్చివేత

**న్యూఢిల్లీ :** జలంధర్: ఆమ్ ఆద్మీ పార్టీ నేత లక్కీ ఒబ్రాయ్‌ని హత్య చేశారు. జలంధర్ సిటీలోని మోడల్ టౌన్ లొకాలిటీలో ఉన్న గురుద్వారా వద్ద ఈ ఘటన జరిగింది. గన్‌తో కాల్చి చంపారు. లక్కీ ఒబ్రాయ్‌ని ఫోర్టిస్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తీవ్ర గాయాలు కావడంతో అతను ప్రాణాలు విడిచాడు. గురుద్వారకు రోజువారిలాగానే అతను తన థార్ వాహనంలో చేరుకున్నాడు. వాహనాన్ని పార్క్ చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై కాల్పులు జరిపారు. ఇద్దరు వ్యక్తులు టూవీలర్‌పై వచ్చినట్లు,గురుద్వారాకు ఒబ్రాయ్ రోటీన్‌గా విజిట్ చేస్తుంటారని జలంధర్ కంటోన్మెంట్ ఇంఛార్జ్ తియారా తెలిపారు. అతనిక కదలికలు తెలిసిన వ్యక్తులే దాడికి ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

# బొగ్గుగనిలో పేలుడు... ఇద్దరు అరెస్టు

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఎం సంగ్మా హామీ



**షిల్లాంగ్ :** మేఘాలయలో అక్రమ బొగ్గు గనిలో జరిగిన పేలుడులో 18 మంది మరణించిన విషయం విధితమే. అయితే ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. బాధ్యులైన వారిపై తన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి కాన్రాడ్ కె సంగ్మా స్పష్టం చేశారు. ఇద్దరి అరెస్టులతో పాటు, ఈ ఘటనకు సంబంధించి మూడవ వ్యక్తిని కూడా గుర్తించామని, తదుపరి దర్యాప్తు జరుగుతోందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఐ నోంగ్రాంగ్ తెలిపారు. గురువారం తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని మారుమూల థాంగ్‌స్కు ప్రాంతంలో ఉన్న అక్రమ గనిలో జరిగిన పేలుడులో 18 మంది మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. గాయపడిన ఎనిమిది మంది గని కార్మికులలో ఏడుగురిని గుర్తించినట్లు మరో పోలీసు అధికారి తెలిపారు. వారిలో నలుగురు నేపాల్‌కు చెందినవారు, ఇద్దరు అసోంకు చెందినవారు, ఒకరు స్థానికుడు అని ఆయన చెప్పారు. వీరందరూ షిల్లాంగ్‌లోని ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని ఆయన తెలిపారు. మృతులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని ఆ అధికారి పిటిఐకి తెలిపారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి ఇద్దరు క్యాబినెట్ మంత్రులను సంఘటనా స్థలాన్ని సందర్శించి, అధికారులను కలిసి సహాయక చర్యలు, సహాయక కార్యక్రమాలు, శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌తో సహా సీనియర్ పోలీసు అధికారులు, గనుల శాఖ అధికారులు ఇప్పటికే సంఘటనా స్థలంలో ఉన్నారని ఆయన చెప్పారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు సంగ్మా తెలిపారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాలను సహించేది లేదని హెచ్చరించారు. శాస్త్రీయ మైనింగ్ ప్రారంభం కావడంతో, గని కార్మికులు చట్టబద్ధమైన మైనింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటారని భావిస్తున్నామని, ఇప్పుడు ఆ అవకాశం అందుబాటులో ఉందని, ఇలాంటి సంఘటనలు జరగడానికి అనుమతించబోమని ఆయన అన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ. 3 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మరింత మంది చిక్కుకుని ఉంటారనే భయాల మధ్య, బహుళ ఏజెన్సీలను రంగంలోకి దించి శుక్రవారం ఉదయం 9.55 గంటలకు గాలింపు, సహాయక చర్యలు తిరిగి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్ఎఫ్) నుండి రెండు బృందాలు, ఒక ప్రత్యేక రెస్క్యూ టీమ్ (ఎస్ఆర్‌టి) మరియు జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్ఎఫ్) నుండి మూడు బృందాలను సంఘటనా స్థలంలో మోహరించినట్లు ఒక అధికారి తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రాణనష్టంపై విచారం వ్యక్తం చేశారు, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ దుర్ఘటనతో తాను తీవ్రంగా కలత చెందానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంగమాతో మాట్లాడి, కొనసాగుతున్న సహాయక చర్యలకు కేంద్రం నుండి అన్ని విధాలా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై మీడియా నివేదికలను మేఘాలయ హైకోర్టు సుమోటోగా స్వీకరించి, అక్రమ మైనింగ్‌లో పాలుపంచుకున్న గనుల యజమానులు, నిర్వాహకులను గుర్తించి అరెస్టు చేయాలని తూర్పు జైంతియా హిల్స్ డిప్యూటీ కమిషనర్ మరియు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసులను ఆదేశించింది. తీసుకున్న చర్యల వివరాలతో ఇద్దరు అధికారులను వ్యక్తిగతంగా హాజరు కావాలని కూడా కోర్టు ఆదేశించింది.

## ఇష్టం లేకుండా ఏ మహిళనూ..

# గర్భం కొనసాగించాలని బలవంతపెట్టలేం

● సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు ● మైనర్‌గా ఉన్నప్పుడు గర్భవతైన అమ్మాయి 30వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించేందుకు అనుమతి ● ఆమె కేసులో గర్భవిచ్ఛిత్తికి నిరాకరించిన బాంబే హైకోర్టు ఆదేశాలను పక్కనపెట్టిన 'సుప్రీం'



**న్యూఢిల్లీ :** అవాంఛిత గర్భదారణకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇష్టం లేకుండా ఏ మహిళనూ గర్భం కొనసాగించమని కోర్టులు 'బలవంతం చేయలేవు' అని స్పష్టం చేసింది. 17ఏళ్ల వయసులో మైనర్‌గా ఉన్నప్పుడు గర్భవతి అయిన ఒక అమ్మాయి 30వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించేందుకు అనుమతిని ఇస్తూ సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ అమ్మాయి పొరుగున ఉన్న ఒక అబ్బాయితో రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు గర్భవతి అయిందని, ఆమె తన గర్భాన్ని వైద్యపరంగా తొలగించాలని కోరిందని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం తెలిపింది. అవసరమైన అన్ని వైద్యపరమైన సురక్షిత చర్యలు చేపట్టిన కారణంగా వైద్యపరంగా ఆ మైనర్ గర్భాన్ని తొలగించాలని ధర్మాసనం ముంబయి జె.జె.హాస్పిటల్‌ను కోరింది. గర్భధారణను కొనసాగించే హక్కు మైనర్ బిడ్డకు ఉందనే వాస్తవాన్ని కోర్టు పరిగణనలోనికి తీసుకుందని, ఆమె కూడా మైనర్ అయినందువల్ల తలెత్తే దురదృష్టకర పరిస్థితి కారణంగా గర్భధారణను ఎదుర్కొంటున్నందున ఇది 'చట్టవిరుద్ధం' అని ధర్మాసనం గమనించింది. ఆ సంబంధం ఇద్దరి మధ్యా ఏకాభిప్రాయంతో జరిగిందా? లేదా వేధింపుల ఫలితంగా జరిగిందా ? అనేది సమస్య కాదని ధర్మాసనం తెలిపింది. బిడ్డ ప్రాణాలకు ఎలాంటి ముప్పులేదని, పూర్తి కాలం అనంతరం తల్లి ప్రసవానికి అనుమతి ఉందని హాస్పిటల్ మెడికల్ బోర్డు ఇచ్చిన నివేదికను అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోనికి తీసుకుంది. తల్లి ఆసక్తిని గమనించాలంటే ఆమె పునరుత్పత్తి స్వయం ప్రతిపత్తికి తగినంత ప్రాధాన్యత ఇవ్వాలని, కోర్టు ఏ స్త్రీని, మైనర్ బిడ్డను కూడా ఆమె ఉద్దేశం లేకపోతే గర్భధారణను పూర్తి చేయమని బలవంతం చేయదని ధర్మాసనం స్పష్టీకరించింది. ఆమె కేసులో గర్భవిచ్ఛిత్తికి నిరాకరిస్తూ బాంబే హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలను 'సుప్రీం' ధర్మాసనం పక్కనపెట్టింది. 'ఇక్కడ మరొక ప్రశ్న తలెత్తుతోంది. ఒకవేళ ఆమె గర్భాన్ని 24వారాలకు తొలగించగలిగితే, 30 వారాలకు ఎందుకు సాధ్యం కాదు? చివరికి ఆమె గర్భాన్ని కొనసాగించాలనుకోవడంలేదు. దీని సారాంశం ఏమిటంటే ఆమె ప్రసవం కోరుకోవడం లేదు. అదే కష్టం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కొన్నిసార్లు గర్భధారణను ముగించాలా ? వద్దా? అని నిర్ణయించుకోవడానికి సమయం పడుతుందని ధర్మాసనం జోడించింది. 'మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపి)చట్టం (1971) ప్రకారం నిర్దేశించిన దానికంటే మించి గర్భస్రావం జరిగే సందర్భాలు చాలానే ఉన్నాయి. మేము అలా చేయమని వైద్యులు అంటున్నారు. అలాంటి వ్యక్తులు ఎక్కడకు వెళతారు?. నకిలీ వైద్యుల వద్దకు , అనధికార వైద్యుల వద్దకు వెళతారు. అది చాలా ప్రమాదకరం' అని ధర్మాసనం తెలిపింది. ఆసుపత్రి ప్రయోజనం కోసం ఆపరేటింగ్ పార్ట్ విడుదలకు సంబంధించిన వివరణాత్మక ఉత్తర్వులు వెలువడతాయని సుప్రీంకోర్టు తెలిపింది.

# మణిపూర్ చురచందపూర్‌లో బంద్

స్తంభించిన జనజీవనం, విద్యాసంస్థలు మూసివేత

ప్రభుత్వం ఏర్పాటులో కుకీ-జో వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు పాల్గొనడంపై నిరసనలు



**చురాచంద్‌పూర్/ఇంఫాల్:** చాలా కాలంగా కల్లోలితంగా ఉన్న మణిపూర్‌లో గత మూడు రోజుల క్రితంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటులో కుకీజో వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు పాల్గొనడాన్ని నిరసిస్తూ రెండు గిరిజన సంస్థలు కుకీజో ఆధిపత్య ం ఉన్న చురాచంద్‌పూర్ జిల్లాలో సంపూర్ణ బం ద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో జిల్లాలో జనజీవ నం స్తంభించిపోయినట్లు అధికారులు తెలిపా రు. శుక్రవారం ఉదయం బంద్‌కు మద్దతు తెలిపిన వారు కర్రలు కట్టుకుని జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రాంతాల్లో వాహనాలను అడ్డుకున్నారు. మార్కెట్లు మూసివేశారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా హాజరు తక్కువ గా ఉందని వారు తెలిపారు. కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ చురాచంద్‌పూర్ యూనిట్ శుక్రవా రం అర్ధరాత్రి నుండి జిల్లాలో 24 గంటల సం పూర్ణ బంద్‌కు పిలుపునివ్వగా, మరో సంస్థ జాయింట్ ఫోరమ్ ఆఫ్ సెవెన్ (జెఎఫ్7) కుకీజో ప్రాంతాలలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు బంద్‌కు పిలుపునిచ్చింది. జిల్లా కేంద్రంలోని తుయిబాంగ్ ప్రాంతంలో బంద్ ప్రభావం మరింత స్పష్టంగా కనిపించింది. జిల్లాలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని, జిల్లా కేంద్రంలోని కీలక ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటులో కుకీజో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం మధ్యాహ్నం భారీ బహిరంగ ర్యాలీని నిర్వహిస్తామని కుకీ ఉమెన్ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ కూడా ప్రకటించింది. ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో కుకీజో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని చేర్చే ఏ చర్యకైనా తమ తీవ్ర వ్యతిరేకతను తెలియజేయడమే ఈ నిరసన యొక్క లక్ష్యమని పేర్కొంది.తాము ఆమోదయోగ్యం కానివిగా భావించే రాజకీయ పరిణామాలపై కుకీ మహిళల సామూహిక వైఖరిని తెలియజేయడమే ఈ ర్యాలీ ఉద్దేశమని అది తెలిపింది. గురువారం సాయంత్రం, తుయిబాంగ్ అటవీ గేటు సమీపంలో ఒక గుంపుకు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. రాళ్లు రువ్విన గుంపును చెదరగొట్టడానికి భద్రతా బలగాలు లాఠీచార్జ్ చేసి, బాష్పవాయు గోళాలను ప్రయోగించాయి. ఈ ఘర్షణలు శుక్రవారం ఉదయం 3 గంటల వరకు కొనసాగాయని, ఈ ఘటనలో ఇద్దరు ప్రదర్శనకారులకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు.

# గుంతలో బైక్‌తో పడి వ్యక్తి మృతి

ఢిల్లీ జల్ బోర్డ్ అధికారుల నిర్లక్ష్యం..

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ జల్ బోర్డ్ అధికారుల నిర్లక్ష్యానికి ఒక వ్యక్తి బలయ్యాడు. తవ్వి వదిలేసిన గుంతలో బైక్‌తో సహా పడి అతడు మరణించాడు. విమర్శలు వెల్లువెత్తడంతో ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. ఢిల్లీలోని కైలాష్‌పురిలో నివసించే 25 ఏళ్ల కమల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రోహిణి బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి విధుల తర్వాత బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. కాగా, అర్ధరాత్రి దాటినప్పటికీ కమల్ ఇంటికి చేరుకోలేదు. అతడి ఫోన్ కూడా పనిచేయడం లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వారంతా బయటకు వచ్చారు. సమీప ప్రాంతాల్లో కమల్ కోసం వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో శుక్రవారం తెల్లవారుజామున 2.45 గంటల సమయంలో కమల్ సోదరుడు జనక్‌పురి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కూడా కుటుంబ సభ్యులతో కలిసి కమల్ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. మరోవైపు శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో ఒక మహిళ పోలీసులకు ఫోన్ చేసింది. రోడ్డు పక్కన ఉన్న 15 అడుగుల లోతైన గుంతలో బైక్, ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ప్రమాదవశాత్తు బైక్ ఆ గుంతలో పడటంతో కమల్ మరణించినట్లు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం తరలించారు. అయితే, జల్ బోర్డ్ అధికారులు ఆ గుంతను తవ్వి పూడ్చకుండా వదిలేసినట్లు తెలిసింది. దీంతో వారి నిర్లక్ష్యానికి ఒక యువకుడు బలికావడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ పట్టణాభివృద్ధి మంత్రి ఆశిష్ సూద్ దీనిపై దర్యాప్తునకు ఆదేశించారు. ప్రాథమిక దర్యాప్తు తర్వాత బాధ్యులైన ముగ్గురు ఢిల్లీ జల్ బోర్డు అధికారులను సస్పెండ చేశారు. ఇటీవల నోయిడాలో లోతైన నీటి గుంతలో కారుతో సహా పడి ఒక వ్యక్తి మరణించిన సంఘటనను ఇది తలపించింది.




## అఖిల రైల్ హిందీ క్విజ్ పోటీ–2025లో తూర్పు మధ్య రైల్వేకు ప్రథమ బహుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతీయ రైల్వేలో అధికార భాష అయిన హిందీ వినియోగాన్ని మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన అఖిల రైల్ హిందీ క్విజ్ పోటీ–2025 ఘనంగా ముగిసింది. ఈ పోటీని సికింద్రాబాద్‌లోని ఇండియన్ రైల్వే ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఐఆర్ఐఎఫ్ఎం) లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వే బోర్డు అదనపు సభ్యురాలు విజి భూమా ముఖ్య అతిథిగా హాజరై, హిందీ భాష ప్రచారంలో ఈ తరహా క్విజ్ పోటీలు వినూత్న ఆలోచన అని ప్రశంసించారు. అలాగే డాక్టర్ వి. సుగుణ, అధికార భాష డైరెక్టర్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ఐఆర్ఐఎఫ్ఎం డైరెక్టర్ జనరల్ అపర్ణా గార్గ్, అదనపు డైరెక్టర్ జనరల్ సిరా శాంతి రాజు అధ్యక్షత వహించారు. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్లు, ఉత్పత్తి యూనిట్ల నుంచి 28 జట్లు, దాదాపు 120 మంది అధికారులు, ఉద్యోగులు ఈ పోటీలో పాల్గొన్నారు. హిందీ మాట్లాడని ప్రాంతాలైన 'సి' కేటగిరీలో ఉన్న సికింద్రాబాద్‌ను వేదికగా ఎంచుకోవడం ద్వారా, నాన్‌హిందీ ప్రాంతాల్లో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఫైనల్‌కు చేరిన ఆరు జట్ల మధ్య ఉత్కంఠభరిత పోటీ జరగగా, తూర్పు మధ్య రైల్వే జట్టు ప్రథమ బహుమతిని గెలుచుకుంది.ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రధాన సిబ్బంది అధికారిగా సిద్ధార్థ్ కాటి, జిఆర్ఎస్ రావు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్‌ప్రభాకర్‌తో సహా ఏడుగురు నక్సలైట్లు మృతి



**గడ్చిరోలి:** మహారాష్ట్రలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. తూర్పు గడ్చిరోలి జిల్లాలో పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత ప్రభాకర్‌తో సహా ఏడుగురు నక్సలైట్లు మరణించగా, కాల్పుల సమయంలో గాయపడిన ఒక పోలీసు జవాను కూడా మృతి చెందాడని అధికారులు శనివారం తెలిపారు. గత మూడు రోజులుగా ఆ ప్రాంతంలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ జరుగుతోంది. తెలంగాణలోని కామారెడ్డికి చెందిన ప్రభాకర్ అలియాస్ లోకేటి చందర్ రావు, మావోయిస్టుల గడ్చిరోలి డివిజన్ కమిటీ, వెస్ట్ సబ్‌జోనల్ బ్యూరో 'కంపెనీ నెం 10'కు ఇన్‌ఛార్జ్‌గా ఉన్నాడని, అతని తలపై రూ. 25 లక్షల రివార్డు ఉందని అధికారులు తెలిపారు. కంపెనీ నెం. 10కి చెందిన మిగిలిన క్యాడర్ల కదలికలు, ఛత్తీస్‌గఢ్ నుండి వచ్చిన గుర్తు తెలియని నక్సలైట్ బృందం గురించి నిఘా వర్గాల సమాచారం అందడంతో, ఈ నెల 3వ తేదీ రాత్రి ఆపరేషన్ ప్రారంభించబడిందని గడ్చిరోలి పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గడ్చిరోలి పోలీసుల ప్రత్యేక నక్సల్ వ్యతిరేక దళమైన సి60కి చెందిన పద్నాలుగు యూనిట్లు నారాయణపూర్–గడ్చిరోలి సరిహద్దులోని ఫోడెవాడ గ్రామం సమీపంలో ఈ ఆపరేషన్‌ను ప్రారంభించాయని ఆ ప్రకటన పేర్కొంది. గురువారం రాత్రి ముగ్గురు నక్సలైట్ల మృతదేహాలను స్వాధీనం చేసుకోగా, శుక్రవారం ఆ ప్రాంతం నుండి మరో నాలుగు మృతదేహాలను వెలికితీశారు. మొత్తం ఏడుగురు మావోయిస్టుల (నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు) మృతదేహాలతో పాటు మూడు ఎకె47 రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్, ఒక .303 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రభాకర్‌తో పాటు, మరణించిన ఇతర మావోయిస్టుల గుర్తింపు ఇంకా నిర్ధారించబడలేదు. జిల్లాలోని అహేరి తహసీల్‌లోని మంద్రాకు చెందిన సి60 జవాన్ దీపక్ చిన్న మాడవి (38), గురువారం సాయంత్రం జరిగిన భారీ కాల్పుల మార్పిడిలో ఇద్దరు మావోయిస్టులను హతమార్చాడని, అయితే అతను కూడా బుల్లెట్ గాయానికి గురై, భామరాగ్‌డ ఆసుపత్రికి తరలించిన తర్వాత మరణించాడని ఆ ప్రకటన తెలిపింది. అతని స్వగ్రామంలో పూర్తి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు ని ర్వహిస్తారని అందులో పేర్కొన్నారు. కిష్టపల్లికి చెందిన మరో జవాన్ జోగా మాడవికి కూడా గురువారం రాత్రి బు ల్లెట్ గాయాలయ్యాయి. అతన్ని గడ్చిరోలికి హెలికాప్టర్‌లో తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

# టివికె చీఫ్ విజయ్ పిటిషన్ కొట్టివేత



**చెన్నై :** ప్రముఖ సినీ నటుడు, 'తమిళగ వెట్రి కజగం' పార్టీ అధినేత దళపతి విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయపు పన్ను శాఖ తనకు విధించిన రూ.1.50 కోట్ల భారీ జరిమానాను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. ఐటి శాఖ జారీ చేసిన పెనాల్టీ ఉత్తర్వులు చట్టబద్ధంగానే ఉన్నాయని, నిర్ణీత గడువులోపే ఆ నోటీసులు జారీ అయ్యాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. దీంతో విజయ్ ఇప్పుడు ఆ జరిమానా చెల్లించడం లేదా పై కోర్టులకు వెళ్లడం అనివార్యమైంది. 2015 సెప్టెంబర్‌లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు విజయ్ నివాసంలో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో విజయ్ నటించిన 'పులి' సినిమాకు సంబంధించి కొన్ని కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సినిమా ద్వారా విజయ్ సుమారు రూ.15 కోట్ల అదనపు ఆదాయాన్ని పొందారని, కానీ ఆ మొత్తాన్ని తన ఆదాయపు పన్ను రిటర్నుల్లో చూపించలేదని ఐటీ శాఖ ఆరోపించింది. 201516 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ ఆదాయాన్ని దాచిపెట్టారన్నది ప్రధాన అభియోగం. సోదాల్లో లభించిన ఆధారాల మేరకు ఐటీ శాఖ చర్యలకు ఉపక్రమించింది. లెక్కల్లో చూపని ఆ రూ.15 కోట్ల ఆదాయానికి సంబంధించి, 2022 జూన్ 30న ఒక ఉత్తర్వు జారీ చేసింది. దీని ప్రకారం విజయ్ రూ.1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ విజయ్ 2022లోనే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి బెంచ్, 2022 ఆగస్టు 16న పెనాల్టీ చెల్లింపుపై మధ్యంతర స్టే విధించింది.

# బెంగాల్‌లో కాంగ్రెస్ ఒంటరి పోరాటం

రానున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 294 సీట్లకు ఒంటరిగా పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించటంలో ఆశ్చర్యం లేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎల్‌ఒపి రాహుల్ గాంధి, ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి గులాం అహ్మద్ మీర్‌తో పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో జరిపిన చర్చల్లో ఆ రాష్ట్రంలోని పరిస్థితుల్లో అది తప్ప మరో మార్గం లేదని నిర్ణయానికి వచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కాంగ్రెస్‌ను దరి చేయనీయరు. ఇండియా కూటమి భాగస్వాములుగా కాంగ్రెస్ పార్టీ టిఎంసితో పొత్తు కోరుకున్నా ఆమె కాంగ్రెస్‌ను మరీ జూనియర్ పార్టనర్‌గా ఈసడించుకోవచ్చు. కాబట్టి ఆమెకు దూరంగా ఉండడమే ఆత్మగౌరవం అనుకుని ఉంటారు. మమతను ఎదుర్కొనే ఉద్దేశంతో 2021 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాల్లో దీర్ఘకాలంగా వైరిపక్షాలైన సిపిఐ(ఎం), కాంగ్రెస్ పొత్తు పెట్టుకుని భంగపడ్డాయి. ఈ పొత్తును ప్రజలు ఘోరంగా తిరస్కరించటంతో ఒక్క సీటు దక్కలేదు. రెండు పార్టీల మధ్య ఓటు బదిలీ జరగలేదు. అందువల్ల ఒంటరిగా పోటీ చేస్తే కనీసం కార్యకర్తలైనా ఉత్సాహంతో పనిచేస్తారని కాంగ్రెస్ నాయకులు భావించి ఉండవచ్చు. ఏది ఏమైనా, బెంగాల్‌లో రాజకీయం టిఎంసి, కాంగ్రెస్ మధ్య ద్విముఖ విభజనలో ఉంది. ప్రజల్లో కూడా ఆ విభజన ఉంది. మమతా బెనర్జీని ఓడించి అధికారం చేజిక్కించుకోవటమే బిజెపి తక్షణ లక్ష్యం. బిజెపి గత ఎన్నికల లాగే ఇప్పుడూ విభజనవాద రాజకీయాలు సహా సర్వశక్తులూ ఒడ్డుతున్నది. బిజెపి పన్నాగాలను సమర్థవంతంగా తిప్పికొట్టగల ఏకైక శక్తి తమ పార్టీయేనని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హోరాహోరీ పోరాటం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించుకుని పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించటానికి 'సర్' ద్వారా బిజెపి చేస్తున్న ప్రయత్నాన్ని ఆమె ప్రతిఘటిస్తున్న తీరే ఇందుకు నిదర్శనం. లక్షల సంఖ్యలో ప్రజల ఓట్లు తొలగిస్తున్న ఎన్నికల కమిషన్ చర్యలను ఎండగడుతూ, న్యాయవాది కూడా అయిన మమతా బెనర్జీ ఢిల్లీలో ఆందోళన చేశారు, సుప్రీంకోర్టులో స్వయంగా వాదించారు. కాగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే పలు బహిరంగ సభల్లో ప్రసంగించి, మమతా బెనర్జీ అక్రమ చొరబాటుదారులను రక్షిస్తూ, వారిని ఓటు బ్యాంక్ చేసుకున్నారని, చొరబాటుదారులను ఏరివేస్తామని విష ప్రచారం చేశారు. విదేశీ (బంగ్లాదేశ్, మయన్మార్) చొరబాటుదారులు ప్రవేశించకుండా అరికట్టవలసిన బాధ్యత కేంద్రప్రభుత్వానిదేనని, వారిని అరికట్టటంలో విఫలమైన మోదీ పాలన దాన్ని కప్పిపుచ్చుకునేందుకు తమను నిందిస్తున్నారని మమత ఎదురుదాడి చేస్తున్నారు. ఈ రెండు శక్తుల మధ్య జరిగే తీవ్రమైన పోటీలో మరో పార్టీ స్థానం ఆశించటం – ఆంబోతుల కుమ్ములాట మధ్యలో మేకపోతు దూరటం లాగే ఉంటుంది. అయితే రాజకీయ క్షేత్రం ఏ ఒక్క రాజకీయ పార్టీకి శాశ్వతం కాదు. ఈలోపు ప్రతి రాజకీయ పార్టీ తమ రాజకీయ విధానాలను ఓపికగా ప్రజలకు వివరిస్తూ, ప్రజల సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగవలసిందే. అందువల్ల వామపక్ష సంఘటన, కాంగ్రెస్ పార్టీలు కలిసి పోటీ చేసినా, విడివిడిగా పోటీ చేసినా ప్రస్తుతానికి ప్రయోజనం పరిమితంగానే ఉంటుంది. కాంగ్రెస్ నిర్ణయం బెంగాల్ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీలు అనివార్యం చేస్తున్నది.

ఇదిలావుండగా, ముఖ్యమంత్రి రూ.4.06లక్షల కోట్ల రాష్ట్ర తాత్కాలిక బడ్జెట్‌లో మహిళలు, నిరుద్యోగ యువత, గిగ్ కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు ప్రకటించి ఎన్నికల ప్రలోభాలు ప్రారంభించారు. లక్ష్మీ భాండార్ పథకం కింద జనరల్ మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయాన్ని రూ.500లు పెంచి రూ.1500లకు చేర్చారు. ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు మరో రూ.200లు అదనం. ఇందుకు రూ.15వేల కోట్లు కేటాయించారు. ఈ పెంపుదల ఫిబ్రవరి నుంచి అమలులోకి వచ్చింది. బంగ్లార్ యువసాథి పథకం కింద 21–40ఏళ్ల మధ్యవయస్కులైన యువతకు ఐదేళ్లపాటు, లేదా ఉద్యోగం లభించేవరకు – ఏది ముందు అయితే అంతవరకు నెలకు రూ.1500 వాగ్దానం చేశారు. అంగన్‌వాడీ, ఆషా ఉద్యోగులు, పౌరవలంటీర్లు, పారా టీచర్లకు రూ.1000 చొప్పున పెంపు చేశారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో ఒకసారి రూ.4వేలు చెల్లిస్తారు. గిగ్ వర్కర్స్‌కు ఆరోగ్య బీమా పథకం ప్రకటించారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు డి.ఎ. 4శాతం పెంచారు. ఇటువంటి ఉచితాలను 'మిఠాయిలు'గా ఒకప్పుడు విమర్శించిన ప్రధానమంత్రి మోదీ ఇవాళ అలా అనే నైతిక హక్కు కోల్పోయారు. ఎందుకంటే ఆయనే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో ఎన్నో గారడీలు చేస్తున్నారు, బిజెపి పాలిత రాష్ట్రాలు మరెన్నో తాయిలాలు ప్రకటిస్తున్నాయి.

దేశ రాజకీయ దృశ్యంలో మహారాష్ట్ర రాజకీయాలు గమనించదగినవి. ఎన్‌సిపినేత, బిజెపి సంకీర్ణ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ జనవరి 28న విమాన ప్రమాదంలో దుర్మరణం పాలైన తదుపరి ఎన్‌సిపిలు రెండూ (అజిత్ పవార్, శరద్ పవార్ గ్రూపులు) ఏకమవుతాయా అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీసింది. అజిత్ పవార్ ఐక్యతను కోరుకున్నారని, రెండు పార్టీల పునరేకీకరణను ప్రకటించటానికి ఫిబ్రవరి 12ను ఆయన ఎంచుకున్నారని శరద్‌పవార్ వెల్లడించటం ఈ చర్చకు ఆధారం. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు బాబాయి–అబ్బాయి పార్టీలు రెండు కార్పొరేషన్స్‌లో కలిసి పోటీ చేసినా ప్రజలు ఆదరించలేదు. జిల్లా పరిషత్ ఎన్నికల నేపథ్యంలో పునరేకీకరణ చర్చకు వచ్చింది. అయితే బిజెపి కౌంటర్ వ్యూహంతో అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్‌ను ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించి ఎన్‌సిపిల పునరేకీకరణను అడ్డుకుందని చెప్పవచ్చు. ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నావీస్ షిండె శివసేనను, అజిత్ ఎన్‌సిపిని ఒకదానికొకటి కౌంటర్ వెయిట్‌లుగా ఉపయోగిస్తున్నారు. కాగా సునేత్ర పవార్ తన కుమారుడు పార్థపవార్‌ను రాజ్యసభకు పంపే ప్రయత్నంలో ఉన్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి. బిజెపి సహాయం లేకుండా అతన్ని రాజ్యసభకు పంపే సంఖ్యాబలం ఎన్‌సిపికి శాసనసభలో ఉంది. అందువల్ల శరద్‌పవార్ ఆశలు నెరవేరకపోవచ్చు. ●



## ఓమ్ బిర్లా వ్యాఖ్యలు హాస్యాస్పదం

కాంగ్రెస్ ఎంపిలు సభలో ప్రధాని నరేంద్ర మోదీ సీటు వైపు వెళ్లి ఏదైనా ఊహించని చర్యకు పాల్పడవచ్చని తనకు సమాచారం ఉందని బిర్లా చెప్పడం విడ్డూరం. ప్రస్తుత ప్రభుత్వ పాలన వల్ల దేశం ప్రమాదంలో ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ గొప్ప త్యాగాలు చేసి పార్లమెంటుకు జన్మనిచ్చింది. పార్లమెంటులో మోదీకి ప్రమాదం ఉందని ఎవరైనా చెబితే, అది కేవలం చెత్త మాటే. కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలను ఉగ్రవాద దాడులలో కోల్పోయింది. ప్రమాదం గురించి తెలిసినప్పటికీ, వారు ప్రజల మధ్యకు వెళ్లారు. దాడులకు గురయ్యారు. సభ వెల్‌లోకి ఎంపిలు ప్రవేశించడం వల్ల ప్రధానికి ముప్పు వాటిల్లిందని చెప్పడం హాస్యాస్పదం. ఇది ఒక పిరికి ప్రభుత్వం.

– శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్



## లద్దాఖ్ భవిష్యత్తును ఢిల్లీ నుంచి నిర్ణయించలేరా?

2019లో భారత ప్రభుత్వం లద్దాఖ్‌కు ఉన్న ప్రత్యేక రాజ్యాంగ రక్షణలను రద్దు చేసినప్పుడు, అభివృద్ధి, అవకాశాలు, సమీకరణ అనే వాగ్దానాలు చేసింది. కానీ ఆ తర్వాత వెలుగులోకి వచ్చింది మాత్రం ఒక పరిచిత కథనే: పర్యావరణ సున్నితత్వాన్ని త్యాజ్యంగా చూడటం, స్థానిక సమ్మతిని అడ్డంకిగా భావించడం, ప్రజాస్వామ్యానికి బదులుగా సైనిక దళాలను ముందుకు తెచ్చింది. లద్దాఖ్ అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఖాళీ సరిహద్దు భూమి కాదు. ఇది హిమానీ నదులు, పురాతన వాణిజ్య మార్గాలు, తీవ్ర పరిస్థితుల్లో శతాబ్దాలుగా జీవనాన్ని నిలబెట్టిన స్థానిక జ్ఞాన వ్యవస్థలతో ఆకృతమై ఉన్న ఎత్తైన ఎడారి ప్రాంతం. ఈ భూభాగాన్ని అస్థిరం చేయడం కేవలం ప్రాంతీయ ప్రమాదం కాదు; ఖండస్థాయి ప్రమాదం. 2019 తర్వాత లద్దాఖ్‌లో అభివృద్ధి అంటే భూముల వేగవంతమైన ప్రైవేటీకరణ, ప్రపంచంలోనే అత్యంత వాతావరణ సున్నితమైన ప్రాంతాల్లో పారిశ్రామిక, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల విస్తరణగా మారింది.

2025 ఆగస్టు వర్షపాతం సాధారణ స్థాయికి మించి 930 శాతం పెరిగి, అకస్మాత్తు వరదలు సంభవించాయి. పశువులు, వంతెనలు, ఇళ్లు కొట్టుకుపోయాయి. లద్దాఖ్‌లో విస్తరిస్తున్న రోడ్లు, సొరంగాల జాలంలో సైనికీకరణ– అభివృద్ధి సంగమం స్పష్టంగా కనిపిస్తుంది. 1,600కిలోమీటర్లకు పైగా రోడ్డు వెడల్పు చేయబడ్డాయి, కొత్తగా నిర్మించబడ్డాయి. లేహ్, కార్గిల్, శ్రీనగర్‌లను కలిపే జోజిలా సొరంగం, చైనా సరిహద్దు సమీపంలోని సియాచిన్ హిమనదికి సరఫరాలు చేర్చే భారత రక్షణ వ్యూహంలో కీలకమైనది. కానీ తవ్వకాల మలినాలు, నదుల అస్థిరత, కొండచరియల ప్రమాదం వంటి పర్యావరణ వ్యయాలను వ్యూహాత్మక అవసరాలుగా కొట్టిపారేస్తున్నారు.

ఈ పరిస్థితుల్లోనే పర్యావరణ కార్యకర్త, సమాజ నాయకుడు సోనం వాంగ్‌చుక్ 2025 సెప్టెంబర్ 10న నిరాహార దీక్ష ప్రారంభించారు. శాంతికి పిలుపునిచ్చిన వాంగ్‌చుక్‌ను రెండు రోజుల తర్వాత అరెస్ట్ చేసి, 1300కిలోమీటర్ల దూరంలోని జోధ్‌పూర్‌కు తరలించారు. లద్దాఖ్ లేవనెత్తుతున్న ప్రశ్న— సరిహద్దు ప్రాంతాలు అభివృద్ధి చెందాలా వద్దా అన్నది కాదు. పర్యావరణం, ప్రజాస్వామ్యం, స్థానిక జ్ఞానాన్ని చెరిపి వేయకుండా అభివృద్ధి సాధ్యమా అనేది అసలు ప్రశ్న. లద్దాఖ్‌ను ఖాళీ పటములా చూడడం తాత్కాలికంగా వ్యూహాత్మక లక్ష్యాలకు ఉపయోగపడవచ్చు. కానీ దీర్ఘకాలంలో, దేశం ఆధారపడిన పర్యావరణ, సామాజిక, రాజ్యాంగ పునాదులనే దెబ్బతినే ప్రమాదం ఉంది.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

# మయన్మార్ మిలిటరీ జుంటాపై భారత్ వ్యూహమేమిటి?



నిత్యా చక్రవర్తి

> మయన్మార్‌లో జాతీయ ఎన్నికలు జరిగిన తర్వాత కొన్ని వారాల్లోనే సైనిక అనుకూల ప్రభుత్వం ఏర్పడనున్న సమయంలో భారత వైఖరి ఏమిటి? మయన్మార్‌తో భారతదేశానికి 1,643 కి.మీ సరిహద్దు ఉంది. గత ఐదు సంవత్సరాలలో రోహింగ్యా ముస్లింలు, తిరుగుబాటుదారులు సహా మయన్మార్ నుండి మయన్మార్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న భారతదేశంలోని రాష్ట్రాలలో ఆశ్రయం పొందారు. భారతదేశం మయన్మార్‌లో కూడా భారీ పెట్టుబడులను కలిగి ఉంది. ప్రభుత్వరంగం సహా అనేక భారతీయ కంపెనీలు పనిచేస్తున్నాయి.

బంగ్లాదేశ్, నేపాల్, తాజాగా మయన్మార్‌లో తలెత్తుతున్న పరిస్థితిని ఎదుర్కోవడంలో భారత విదేశాంగ విధాన నిర్ణేతలకు అవగాహన లేదు. మయన్మార్‌లో మిలిటరీ జుంటా నిర్వహించిన మూడు దశల సార్వత్రిక ఎన్నికలు జనవరి 25న ముగిశాయి. ఫలితాలు జనవరి 29, 30 తేదీలలో విడుదలయ్యాయి. ఊహించినట్లుగానే, మిలిటరీ అండ కలిగిన యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్మెంట్ పార్టీ (యుఎస్‌డిపి)ఎన్నికలలో రిగ్గింగ్ చేసి గెలుపొందింది. దిగువ సభలోని 263 సీట్లలో 232, ఎగువ సభలోని 157 సీట్లలో 109 స్థానాలలో గెలిచింది.

నూతన అధ్యక్షుడిని, బహుశా ప్రస్తుత జుంటా చీఫ్‌నే ఆ స్థానంలో ఎన్నుకోవడానికి మయన్మార్ కొత్త పార్లమెంట్ మార్చిలో సమావేశమవుతుంది. ఆయన సైన్యం మద్దతు ఉన్న పార్టీ నుండి తన మంత్రులను ఎన్నుకుంటారు. కొత్త ప్రభుత్వం యుఎస్‌డిపి ద్వారా సైనిక పాలనను అధికారికం చేస్తుంది. ఫిబ్రవరి 2021లో జుంటా సూకీ ప్రభుత్వాన్ని తొలగించిన ఐదు సంవత్సరాల తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది. సూకీ అనారోగ్యంతో జైలులో ఉన్నారు. ఆమె పార్టీని నిషేధించారు. చైనాకు విధేయులైన తిరుగుబాటుదారులను బీజింగ్ నిర్వహిస్తోంది, ఎందుకంటే చైనా ప్రభుత్వం అధికారికంగా జుంటా యొక్క USDPకి గుర్తింపు ఇచ్చింది. కొత్త సైనిక ప్రభుత్వ ఏర్పాటులో చైనా మాటచెల్లడం ఖాయం.

బీజింగ్‌కు విధేయులైన తిరుగుబాటు గ్రూపులకు మద్దతు ఇచ్చే చైనా వ్యూహాన్ని పరిశీలించడం ఆసక్తికరంగా ఉంటుంది. అదే సమయంలో తిరుగుబాటుదారులతో తన పరపతిని ఉపయోగించి మయన్మార్ పాలన నుండి రాయితీలను పొందేందుకు జుంటాతో తన సంబంధాలన్నింటినీ కొనసాగించింది. చైనా తన పెట్టుబడులను రక్షించుకుంది. ఆర్మీ జనరల్స్‌లో తన ప్రభావాన్ని విస్తరించింది. ఐదు సంవత్సరాల తర్వాత, మయన్మార్ తిరుగుబాటు ద్వారా అమెరికా, రష్యా సహా ఒకప్పుడు బ్రిటీష్ ఇండియాలో పాత బర్మా (ప్రస్తుత మయన్మార్) భాగంగా ఉన్న భారతదేశాన్ని అణిచివేసి, చైనా అతిపెద్ద లబ్ధిదారుగా నిలిచింది.

తిరుగుబాటుకు ముందు పాలక పార్టీగా ఉన్న సూకీ నేతృత్వంలోని నేషనల్ లీగ్ ఆఫ్ డెమోక్రసీ, ఇతర పౌర సమాజ సంస్థలు, విద్యార్థులతో కలిసి ప్రతిఘటించింది. కానీ ప్రతిఘటన స్వభావం ప్రావిన్స్ నుండి ప్రావిన్స్‌కు మారుతూ ఉంటుంది. చైనాను ఆనుకుని ఉన్న ప్రావిన్స్‌లలో, తిరుగుబాటుదారులకు చైనా సైన్యం సహాయం చేసింది. తద్వారా వారి ఏకీకరణ ప్రక్రియ కు సహాయపడింది.

మయన్మార్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, 2025 డిసెంబర్ నాటికి, 91 టౌన్‌షిప్‌లు పూర్తిగా ప్రతిఘటన దళాల నియంత్రణలో ఉన్నాయి. 144 టౌన్‌షిప్‌లు పాక్షికంగా వారి నియంత్రణ లో ఉన్నాయి. ఎన్నికలు జరిగిన ప్రాంతాలపై సైన్యం పాక్షికంగా నియంత్రణ కలిగి ఉంది. సైనిక బలం క్షీణించడమే కాకుండా, నైతిక స్థైర్యం కూడా చాలా తక్కువగా ఉంది. ఉత్తర షాన్ రాష్ట్రం, రాజధాని చుట్టుపక్కల ప్రాంతాలపై నియంత్రణను తిరిగి పొందడానికి సైనిక పాలన వైమానిక దాడులను తిరిగి ప్రారంభించింది.

తిరుగుబాటు తర్వాత, సైనిక దళాలు డజన్ల కొద్దీ రాజకీయ పార్టీలను క్రమపద్ధతిలో నిషేధించాయి. 30,000 మందికి పైగా రాజకీయ ఖైదీలను నిర్బంధించాయి. 2026 జనవరిలో ప్రభుత్వం 2025 జూలైలో ఆమోదించిన 'ఎన్నికల రక్షణ' చట్టం కింద 400 మందికి పైగా వ్యక్తులపై చట్టపరమైన చర్య తీసుకుంది. ఎన్నికల ప్రక్రియపై దాదాపు అన్ని రకాల విమర్శలను, చట్ట వ్యతిరేక ప్రసంగం, ఓటింగ్‌కు భంగం కలిగించే ఏదైనా కార్యక్రమాన్ని లేదా నిరసనను నిర్వహించటాన్ని చట్టం నేరంగా పరిగణిస్తుంది. మొత్తం కసరత్తు విస్తృతమైన నిఘాకు స్పష్టమైన ఉదాహరణగా నిలిచింది.





2021 ఫిబ్రవరిలో సైనిక దళాల తిరుగుబాటు ప్రారంభం నుండి, చైనా ద్వంద్వ పాత్ర పోషిస్తోంది. ఎందుకంటే, చైనా మయన్మార్ ఎకనామిక్ కారిడార్ (సిఎంఇసి) కింద తన ప్రాజెక్టులను రక్షించుకోవడానికి మిలిటరీ జుంటా మద్దతు చైనాకు అవసరం. చైనా తన ప్రాజెక్టులను రక్షించుకోవడానికి తన సొంత దళాలను కూడా ఉపయోగించుకుంది. వాస్తవానికి చైనా అనుకూల తిరుగుబాటుదారులతో జుంటా సైన్యం ఘర్షణపడుతున్న సమయంలో కూడా తన సైనిక బలగాలను భద్రతా దళాలతో స్వేచ్ఛగా కలవడాన్ని చైనా అనుమతించింది.

మయన్మార్‌లో జాతీయ ఎన్నికలు జరిగిన తర్వాత కొన్ని వారాల్లోనే సైనిక అనుకూల ప్రభుత్వం ఏర్పడనున్న సమయంలో భారత వైఖరి ఏమిటి? మయన్మార్‌తో భారతదేశానికి 1,643 కి.మీ సరిహద్దు ఉంది. గత ఐదు సంవత్సరాలలో రోహింగ్యా ముస్లింలు, తిరుగుబాటుదారులు సహా మయన్మార్ నుండి మయన్మార్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న భారతదేశంలోని రాష్ట్రాలలో ఆశ్రయం పొందారు. భారతదేశం మయన్మార్‌లో కూడా భారీ పెట్టుబడులను కలిగి ఉంది. ప్రభుత్వరంగం సహా అనేక భారతీయ కంపెనీలు పనిచేస్తున్నాయి.

భారతదేశం మద్దతు ఇచ్చే కలడాన్ మల్టీమోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్పోర్ట్ ప్రాజెక్ట్ , ట్రైలేటరల్ హైవే వంటి కనెక్టివిటీ ప్రాజెక్టులు చాలా కీలకమైనవి అయినప్పటికీ, కార్యాచరణపరంగా సమస్యాత్మకంగా ఉండే అవకాశం ఉంది. చైనా ఇటీవల జుంటాతో సహకార ఒప్పందంపై సంతకం చేసింది. అధికారిక సంబంధాలు తెగిపోనప్పటికీ, జుంటాతో కలిసి ఉన్నట్లు గుర్తింపు పొందకూడదని భారతదేశం నైతిక వైఖరిని తీసుకుంటోంది. గత సంవత్సరం చివర్లో భారతదేశం జుంటాయేతర గ్రూపులతో, తిరుగుబాటుదారులలో ఒక భాగంతో సంబంధాలను ఏర్పరచుకోవడానికి ప్రయత్నించింది. కానీ తుది చట్రాన్ని నిర్మించలేదు. ఫలితంగా, ఇప్పుడు చైనాకు అన్ని ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే రాబోయే ప్రభుత్వ మద్దతు, తిరుగుబాటుదారులలో పరపతి కూడా ఉన్నాయి. భారతదేశానికి ఎలాంటి సంబంధాలు లేవు.

పాశ్చాత్య దేశాలు ఎన్నికలను ఇంకా గుర్తించలేదు. కానీ అమెరికా ఇప్పటి వరకు మయన్మార్‌పై అంత ఆసక్తి చూపడం లేదు. కాగా చైనా తన దౌత్య ప్రభావంపరంగా అంతటా వ్యాపించి ఉంది. ఇది భారతదేశానికి స్వాగతించదగిన వార్త కాదు. కొత్త ప్రభుత్వం పనిచేయడం ప్రారంభించిన తర్వాత న్యూఢిల్లీ లోతైన ఆత్మపరిశీలన చేసుకుని ఒక నిర్దిష్ట వ్యూహాన్ని రూపొందించుకోవాలి. భారతదేశానికి భద్రతాపరంగా, వ్యూహాత్మకంగా మయన్మార్ చాలా ముఖ్యమైనది. ఆ దేశం పూర్తిగా చైనా ఒడిలోకి జారిపోకుండా చూడాల్సిన అవసరం న్యూఢిల్లీకి ఉంది.

# పెరుగుతున్న సమ్మె ఆవశ్యకత




వి.యస్.బోస్
మాజీ ప్రధాన కార్యదర్శి
ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి
9391356527

12 ఫిబ్రవరి 2026నాడు భారతదేశ వ్యాపితంగా కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు తల పెట్టిన సమ్మె ఆవశ్యకత రోజురోజుకి పెరుగుతున్నది. సమ్మె ఆవశ్యకతను గుర్తించిన కార్మికవర్గం తన కర్తవ్యాన్ని నెరవేర్చటానికి పూర్తి ప్రయత్నాలు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నది.

**లేబర్ కోడ్‌లు:** కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దుచేసి వాటిస్థానంలో నాలుగు కోడ్‌లను 2019/2020లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కార్మికవర్గం పోరాటాల ఫలితంగా నేటివరకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా లేబర్ కోడ్‌లు అమలు చేయటంలో వెనుకడుగు వేసింది. మోదీ 3వ సారి ప్రధాని అయిన తర్వాత అహంకారం నెత్తికెక్కి ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నా, కొన్ని రాష్ట్రాలు లేబర్ కోడ్‌లు వద్దన్నా పార్లమెంట్‌లో తనకున్న మందబలంతో లేబర్ కోడ్‌లను అమలు చేయటానికి 2025 శీతాకాలం సమావేశాల్లో కేంద్రం లేబర్ రూల్స్‌ను తయారు చేసి పార్లమెంట్ ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రాలపై అమలుకోసం ఒత్తిడి తెస్తున్నది. అయినా దేశంలో కార్మికవర్గం అడుగడుగునా ప్రభుత్వ దుష్ట ప్రయత్నాలను తిప్పికొట్టటంలో సఫలీకృతమవుతున్నది. లేబర్ కోడ్‌లు రద్దుచేసి 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలనే ఏకైక నినాదంతో మరోమారు సమ్మెకు సిద్ధమవుతున్నది.

కార్మికులకు రాజ్యాంగం ప్రసాదించిన యూనియన్ పెట్టుకునే హక్కును బిజెపి ప్రభుత్వం నిరాకరిస్తున్నది. నిరసన తెలియజేయటానికి చేసే సమ్మె హక్కును కూడా కాలరాస్తున్నది. నాటి బ్రిటీష్ ప్రభుత్వం మోదీ ప్రభుత్వం లాగానే ప్రవర్తిస్తే మన దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చేదో ఆలోచించాల్సిన విషయం. అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న 8గంటల పనిదినాన్ని రద్దుచేసి చికాగో కార్మికుల రక్తతర్పణను అపహాస్యం చేస్తున్నది. ఫ్యాక్టరీ యాక్ట్ ప్రకారం పని ప్రదేశం లో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాల చట్టబద్ధతను తొలగించి యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలివేయటం జరుగుతున్నది. పరిశ్రమలు మూసివేయటానికి సౌలభ్యం కలుగజేస్తూ ప్రస్తుతం ఉన్న 100 కార్మికుల సంఖ్యను 300లకు పెంచి యాజమాన్యాలకు పెద్ద వరం ఇవ్వటం జరిగింది. దీనితో యాజమాన్యాలు భస్మాసురిడిలా తాము పొంది న హక్కును కార్మికులపై ప్రయోగించి కార్మికులను బానిసలకన్నా హీనంగా చూసే పరిస్థితి ఏర్పడుతున్నది. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ పేరుతో స్థిరమైన ఉద్యోగాలు లేకుండా కార్మికుల జీవితాలు దినదినగండం నూరేళ్ల ఆయుష్షుగా తయారు చేస్తున్నది. చట్టాన్ని తుంగలో తొక్కి కార్మికులను యాజమాన్యం ఇష్టానుసారం తీసుకోవచ్చును మరియు తొలగించవచ్చును అనే విధానానికి విదేశీ ముద్దుపేరు అయిన హైర్ & ఫైర్ అనే పేరు పెట్టి అదే స్వదేశీ భక్తి అని బిజెపి ప్రభుత్వం చాటుకుంటున్నది.

కాంట్రాక్ట్ చట్ట ప్రకారం 240 రోజులు పనిచేస్తే పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలనే చట్టాన్ని పూర్తిగా మార్చి అలాంటి విధానం లేకుండా చేసి ఏ పనిలోనైనా ఎప్పుడైనా కార్మికులను కాంట్రాక్ట్ విధానంలో పెట్టుకోవచ్చని లేబర్ కోడ్‌ల ద్వారా యాజమాన్యాలకు హక్కును కలుగజేసి దోపిడీ ఆయుధాన్ని వారికి బిజెపి ప్రభుత్వం అందజేసింది. కాంట్రాక్ట్ విధానం, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ వచ్చిన తర్వాత నిలకడైన ఆదాయం, ఉపాధి లేక ఆడ, మగ తేడా లేకుండా యువతి యువకులందరు పెళ్ళి చేసుకోవటానికి అయిష్టత చూపుతున్న పరిస్థితి ప్రస్తుతం దేశంలో నెలకొన్నది. ముస్లింల కన్నా ఎక్కువ సంతానం పుట్టించాలని ప్రబోధిస్తున్న బిజెపి ప్రముఖులకు పెళ్ళి, పిల్లలు అంటే విముఖత చూపుతున్న యువతను చూపి ఈ సామాజిక తీరును గమనిస్తే దీనికి పూర్తి బాధ్యత బిజెపి విధానాలే కారణంగా అర్థమవుతుంది.





పిఎఫ్, బోనస్ లాంటి సౌకర్యాలను ఎలాంటి సీలింగ్ లేకుండా కార్మికులందరికి వర్తింప చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తుంటే బోనస్ వదిలేసి కేవలం పిఎఫ్ మాత్రమే 2500 రూపాయలకు పరిమితిని పెంచి బిజెపి తన కార్పొరేట్ నీతిని చాటుకుంది. పిఎఫ్ డబ్బులు ట్రస్ట్‌ల ద్వారా కార్పొరేట్ సంస్థలు వాడుకోవటానికి అవకాశం ఉన్నది. కానీ బోనస్ కేవలం సంవత్సరానికి ఒకసారి కార్మికులకు పూర్తిగా చెల్లించాలి. దీనివల్ల కార్పొరేట్ సంస్థలు బోనస్ డబ్బును వాడుకునే అవకాశం లేదు. అందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పిఎఫ్ పరిధిని పెంచి బోనస్ పరిధిని పెంచకుండా వదిలేసింది. గతంలో నెహ్రూ ప్రభుత్వం నుండి నిర్మించుకొస్తున్న సామాజిక, ఆర్థిక పరిపుష్టి కలుగజేస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ బిజెపి ప్రభుత్వం ఓడరేవులు, ఎయిర్ పోర్టులు లాంటి వాటిలో అధికభాగం ఆదానీకి దారాదత్తం చేస్తున్నది. ఆత్మనిర్భర్ భారత్ అంటే బిజెపి వారి అర్థం 'భారత ఆత్మను ఆదానీకి అప్పచెప్పటం' అని ప్రజలు అర్థం చేసుకోవాలి. దేశానికి ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధించిన బ్యాంకుల వ్యాపార పరిధిపై ప్రభావం పడే విధంగా విలీనీకరణ విధానాలు అమలు చేస్తూ ప్రైవేటు బ్యాంకులకు మార్గం సులభం చేయటం బిజెపి విధానంగా పెట్టుకుంది. బిజెపి పారిశ్రామిక విధానం అంటే ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయటం, ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించటం, ఆ సంస్థలకు నష్టాలు వస్తే ఆర్థికంగా ఆదుకోవటం, అప్పులు ఇప్పించటం తర్వాత వాటిని రద్దు చేయటంతో ప్రైవేటు సంస్థలకు లాభం అందించటమే విధానంగా ఉంది. మోదీ దుష్ట విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం అలుపెరుగని పోరాటాలు చేస్తున్నది. అందుకే మోదీ ఆశించిన గోల్‌ను 11 సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా సాధించలేని పరిస్థితి ఏర్పడింది. మోదీ ఓడిపోవటం ఖాయం. మరోసారి ప్రభుత్వరంగ సంస్థలు భారతదేశానికి వెలుగులు ప్రకాశించటం కూడా తథ్యం. దేశాభివృద్ధికి స్వాతంత్ర్యకాలం నుండి కృషి చేస్తున్న కోల్, ఆయిల్, గ్యాస్ లాంటి అనేక సంస్థలతో పాటు మన దేశానికి రక్షణ కోసం కృషి చేస్తున్న డిఫెన్స్ పరిశ్రమలను, పరిశోధనా సంస్థలను, అంతరిక్ష వ్యవస్థలను, అణు ఇంధన సంస్థల లాంటి ప్రతి వ్యవస్థను ప్రైవేట్‌పరం చేస్తూ దేశభక్తులమని సొంత డబ్బా కొట్టుకోవటం మన దేశంలోనే చెల్లుబాటు అవుతుంది. ఇతర దేశాల్లో ఇలాంటి నీతిమాలిన వ్యవహారాలు చెల్లుబాటుకావు.

కార్పొరేట్ సంస్థలకు, విదేశాలకు ఊడిగం చేసే అన్ని దుష్ట చట్టాలను రద్దు చేయించటమే కాక మన దేశాన్ని, దేశ ప్రజలను దోచుకొని ఆస్తులు పెంచుకుంటున్న కార్పొరేట్ సంస్థల ఆస్తులను జాతీయం చేయాలనే డిమాండ్‌ను కూడా కార్మికవర్గం తమ అజెండాలో ప్రధానంగా ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులకు ఇన్‌కం టాక్స్ స్లాబ్‌ను పెంచలేదు, పెన్షన్ పెంచలేదు, వైద్య సౌకర్యాలు పెంచలేదు కానీ కార్పొరేట్ సంస్థలకు కోరుకున్న విధంగా బడ్జెట్‌లో సౌకర్యాలు కలుగజేశారు. అందుకే కేంద్ర ప్రభు త్వం కార్పొరేట్ ప్రభుత్వంగా ప్రజలు భావిస్తున్నారు. అందుకే కార్మిక, కర్షక వర్గాలు 4 లేబర్ కోడ్‌లను, రైతు వ్యతిరేక చట్టాలను, పోస్టల్ చట్టాన్ని, విద్యా చట్టాన్ని, విద్యుత్ చట్టాన్ని, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్, గ్రామీణ ఉపాధిలో తెచ్చిన కొత్తచట్టం, ప్రభుత్వరంగ సంస్థల అమ్ముకునే బిల్లు, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్, డిఫెన్స్ ఎంప్లాయీస్, ఎషన్షియల్ యాక్ట్ లాంటి అనేక కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలు తెచ్చిన బిజెపి ఈ సమ్మె ద్వారానైనా బుద్ధి తెచ్చుకుంటుందని ఆశిద్దాం.

రైతులు ఒక ప్రక్క తమకు సంకెళ్ళుగా మారిన విధానాలను రద్దు చేయాలని పోరాటం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తగుదనమ్మా అని యూరప్ దేశాల నుండి అమెరికా నుండి వారి వ్యవసాయ మరియు పాల ఉత్పత్తులు ఎలాంటి టాక్స్ లేకుండా మన దేశంలో అమ్ముకోవటానికి అంగీకరించి మన దేశ రైతుల జీవితాలపై మరో బాంబు పేల్చింది. రైతులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయకపోగా మన రైతులను బికారులుగా చేసి విదేశీ రైతులకు ఎనలేని సౌకర్యాలు కలుగజేస్తూ అమీరులను చేసే ఒప్పందాలు చేసుకోవటం ముమ్మాటికి సహించరానిది. మన దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ బ్యాంకు చేతిలో, పారిశ్రామిక వ్యవస్థ కార్పొరేట్ చేతుల్లో, వాణిజ్య మరియు వ్యాపార వ్యవస్థ అమెరికా చేతిలో పెట్టి మన ప్రభుత్వం చేతగానిదిగా ప్రవర్తిస్తున్నది. అందుకే ప్రస్తుతం దేశంలో సమ్మె అవసరం పెరిగిందని తెలియజేస్తున్నాం.

# రెండేళ్ళల్లో వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు

మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యం
రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి
దామోదర రాజనర్సింహ




ప్రజాపక్షం/షాద్‌నగర్: రెండేళ్ళ కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వివరించారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అందె మోహన్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. వార్డులో పర్యటిస్తూ అవ్వా ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది..పింఛన్లు వస్తున్నాయా..మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు వస్తున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారుడితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రెండేళ్ళ కాలంలో రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. వైద్య విధాన పరిషత్‌లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంతోపాటు ఆరోగ్యశ్రీ పరిధిని సైతం పెంచామని గుర్తు చేశారు. కంటి పరీక్షల కేంద్రాలతోపాటు ప్రత్యేకంగా 80డయాలసిస్ కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతోపాటు మండల కేంద్రాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రెండేళ్ళ కాలంలో షాద్‌నగర్ నియోజకవర్గానికి రూ.1350కోట్ల నిధులు వచ్చాయంటే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతోనే అనే విషయాన్ని ప్రజలందరు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడంతోపాటు సకాలంలో బిల్లులు అందిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు అందించి ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, దాంతోనే కొంత ఆలస్యం అవుతుందని, అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమంలో ఎక్కడ వెనక్కి తగ్గడం లేదని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పనితీరు ఎంతో బాగుందని, నేరుగా ముఖ్యమంత్రి వద్దకు వెళ్ళి పెద్దఎత్తున నిధులు తీసుకురావడమే కాకుండా అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి రాజనర్సింహ గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు కాశీనాథ్‌రెడ్డి, బాబర్‌ఖాన్, రఘునాయక్, సీతారాములు, సుదర్శన్ గౌడ్, జమృద్‌ఖాన్ పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం : జంగయ్య



ప్రజాపక్షం/కొందుర్గు: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని బికెఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. శుక్రవారం జిల్లేడు చౌదరి గూడ మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సార్వత్రిక సమ్మె నిర్వహించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో చౌదరిగూడ మండల కార్యదర్శి సి.వీరేశం, షబ్బీర్, పాపయ్య, రవి, నరసమ్మ, గోపాల్, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బుకింగ్ యాప్‌తోనే యూరియా

మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర



ప్రజాపక్షం/షాబాద్: యూరియా బస్తాలను ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారానే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని యోగేశ్వర ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేశారు. అనంతరం రైతులకు యూరియా బస్తాలను ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా ఎలా పంపిణీ చేయాలో డీలర్లకు నేర్పించారు. కార్యక్రమంలో ఎఇఒ లిఖిత, ఫర్టిలైజర్ షాపు డీల్లర్ రాజేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రైతులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలి



ప్రజాపక్షం/యాచారం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నందివనపర్తి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో యాచారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండేంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య మాట్లాడుతూ రోగులు అందుబాటులో లేక రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకేసారి రెండు ప్రమాదాలు జరిగితే 108లు అందుబాటులో ఉండవని తెలిపారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి 24 గంటలు వైద్యులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ప్రధానకార్యదర్శి యంజాల అంజయ్య, కొంగరి యాదయ్య, కొంగరి శివ, పంది వంశీ, ఎంజాల అరుణ్, మూలి శివ,పంది అంజన్ తదితరులు పాల్గొన్నారు.

## పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : మాదాపూర్‌లోని ఇజ్జత్ నగర్‌లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్న పట్టించుకునే నాథడే లేదని ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు టి.నితిష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైటెక్ సిటీకి కూత వేటు దూరంలో ఉన్న మాదాపూర్‌లోని ఇజ్జత్ నగర్ కాలనీలో పొంగుతున్న డ్రైనేజీ మురికి నీటితో ప్రజలుఇబ్బంది పడుతున్నారని, వాహనదారులకు దుర్భరంగా ఉందని, రోడ్లు దుర్భరంగా తయారైనాయని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకొని కాలనీలో రోడ్లను అభివృద్ధి చేసి డ్రైనేజీ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు నితీష్ తో పాటు మండల కార్యదర్శి ధర్మతేజ, బిహెచ్‌పిఎస్ కార్యదర్శి కొండలయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వరస్వామి కల్యాణం



ప్రజాపక్షం/కేశంపేట: భక్తిశ్రద్ధలతో శ్రీఅలవేలుమంగ సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోనిదవళగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీవారి కల్యాణోత్సవంలో మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కేశంపేట సర్పంచ్ బోజ్జం సంతోష శ్రీశైలం, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## మోకిలతండా సర్పంచ్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్

ప్రజాపక్షం/రంగారెడ్డి: శంకర్‌పల్లి మండలం మోకిల తండా గ్రామపంచాయతీ సర్పంచ్ వి.శాంతమ్మకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి తమ కుమారుడు వర్త్య బాబు నాయక్, తన అనుచరులతో కలిసి విధులను దుర్వినియోగం చేయడం జరిగిందని పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఆరు నెలల పాటు సర్పంచ్ పదవి నుండి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 38(1) ప్రకారం మోకిల తండా ఉపసర్పంచ్ సభావాత్ కవితను సర్పంచ్ పదవీ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తన ఉత్తర్వులలో పేర్కొన్నారు.

## టీ కొట్టులో గంజాయి అమ్మకాలు

నిందితుడి అరెస్ట్.. 730 గ్రాముల గంజాయి స్వాధీనం



ప్రజాపక్షం/హైదరాబాద్: టీ కొట్టు అడ్డగా గంజాయి అమ్మకాలు జరుపుతున్న నిందితుడిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ హెడ్ పోస్టు ఆఫీస్ ఎదురుగా గల టీ కొట్టులో నారాయణఖేడ్‌కు చెందిన ఉద్యానాథ్ పనిచేస్తున్నాడు. డబ్బు ఆశతో యజమానికి తెలియకుండా టీ కొట్టుకు వచ్చే కస్టమర్లకు గంజాయి అమ్మకాలు చేస్తున్నాడు. బీదర్ నుంచి గంజాయి కొనుగోలు చేసి, తన స్కూటీలో భద్రపరచుకొని, ఒక్కో ప్యాకెట్ రూ.500 వరకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బి టీమ్ సిఐ సుభాష్ చందర్, ఎస్సై అఖిల్ టీ కొట్టుపై దాడి చేసి ఉద్యానాథ్‌ను అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి 730 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఉపయోగించిన స్కూటీతో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించినట్లు సిఐ సుభాష్ చందర్ తెలిపారు.

## మారుమూల ప్రాంతాల్లో 'ఆశా'ల పాత్ర కీలకం

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి




ప్రజాపక్షం/రంగారెడ్డి: మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యసేవలు అందించడంలో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి అన్నా రు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఆశా నోడల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ లలితాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య కార్యక్రమాలు అమలు మెరుగుపరచడం, గర్భిణీలు, ఔట్ పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందిం చడంలో ఆశా కార్యకర్తలు ముఖ్యభూమిక వహిస్తున్నారని తెలిపారు. వారి సహకారంతో ఎంసిహెచ్ కార్డుల అప్డేట్ చేసి అవి అంగన్వాడీ, ఎఎన్ఎం, రికార్డులతో సరిపోయేలా చూడడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచడం జరుగుతుందన్నారు. క్యాన్సర్ లక్షణాలను తొలి దశలోనే గుర్తించడం అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి మాతా శిశు ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఆశా నోడల్ అధికారులు డిపిహెచ్ఎన్ఓ మన్మధమ్మ, డెమో కె.శ్రీనివాసులు, సంబంధిత వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పంప్‌హౌస్ పనుల్లో వేగం పెంచాలి

జలమండలి ఎండి అశోక్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ నగరానికి 20 టిఎంసిల అదనపు నీరు తరలింపు.. మూసీ పునరుజ్జీవవనం.. జంట జలాశయాలను గోదావరి నీటితో నింపేందుకు రూ.7,360 కోట్ల వ్యయంతో చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్2,3 ప్రాజెక్ట్ రా వాటర్ పంప్ హౌస్ నిర్మాణ పనులలో వేగం పెంచాలని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్ద నిర్మించనున్న పంప్‌హౌస్ ప్రారంభ పనులను, పంపింగ్ హౌస్ నుంచి ఘన్‌పూర్ వరకు రెండు వరుసల పైప్‌లైన్‌కు సంబంధించిన పనులను పరిశీలించారు. ఎండి వెంట ప్రాజెక్ట్ డైరెక్టర్ టివి శ్రీధర్, సిజిఎం మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## వివక్ష చూపితే కఠిన చర్యలు

దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ

ప్రజాపక్షం/హైదరాబాద్: దివ్యాంగుల పట్ల వివక్ష చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బీ.శైలజ హెచ్చరించారు. ఈ మేరకు ఎన్‌పీఆర్‌డీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ముద్రించిన 2026 డైరీని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మన్ పీ.ఉమర్‌ఖాన్, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కే.వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య, కోశాధికారి ఆర్.వెంకటేష్, సహాయ కార్యదర్శి జే.రాజు, పాత్రికేయుడు శ్రీనివాస్, ఎన్‌పీఆర్‌డీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు రాజు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.




## లక్ష్య సాధనకు మార్గదర్శకాలు




ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యార్థుల లక్ష్య సాధనకు అవసరమైన మార్గదర్శకాలను 18 ప్రిన్సిపుల్స్ ఫర్ సక్సెస్ ఇన్ ఎగ్జామ్స్ పేరిట రూపొందిన ఇంగ్లీష్ వెర్షన్ పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ మేరకు ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ గుండ్లూరు సురేంద్రబాబు రచించిన ఇంగ్లీష్ వర్షన్‌ను తెలుగువర్సిటీ ఆడిటోరియంలో గౌరవ అతిథిగా విచ్చేసిన తెలంగాణ భాష, కల్చరల్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ డా.ఏనుగు నరసింహారెడ్డి, ముఖ్యఅతిథి ఆకెళ్ల రాఘవేంద్ర ఆవిష్కరించారు. కార్యక్రమంలో సామాజిక వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాజ్‌జీ, సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ త్రివేణి, ప్రముఖ సినీ రచయిత డా.పెద్దింటి అశోక్‌కుమార్, చిక్కడపల్లి న్యూ ఎరా జూనియర్ కాలేజ్ డైరెక్టర్ భాష్యం శ్రావణ్‌కుమార్, బెంగళూరుకు చెందిన ప్రముఖ పేరెంటింగ్ కోచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల్లో సిసి రోడ్డు పనులు

కార్పొరేటర్ సుజాత నాయక్



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీ రమణ కాలనీలో సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ శుక్రవారం కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే అధిక నిధులు కాలనీల అభివృద్ధి కోసం కేటాయించడంపట్ల అభివృద్ధికి కాలనీలు రూపురేఖలు మారుతున్నాయని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుయాష్కీగౌడ్ సహకారంతో డివిజన్‌కు అభివృద్ధి చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు కాలనీ వాసుల పరివేక్షణ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సూదిని వెంకటేశ్వర్‌రెడ్డి, కాంతారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మమత మల్లేష్ గౌడ్, రేణుక, సతీష్ గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వెంకిర్యాల బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.50కోట్ల నిధులు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/కొందుర్గు: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం లభించిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెంకిర్యాల గ్రామం వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ వెంకిర్యాల వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు రూ.3.50కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. అదనపు రోడ్డు నిర్మాణానికి ఒక కోటి రూపాయాలు మంజూరయ్యాని, త్వరలోనే పనులు మొదలు పెట్టి ఏడాదిలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఉమ్మడి కొందుర్గు మండలంలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసేందుకు రూ.5.36 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మండలంలో వివిధ వాగులపై నిర్మించేందుకు బ్రిడ్జిలకు రూ.10కోట్ల వరకు నిధులు మంజూరు అయ్యాయని, వాటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. లాలపేట, విశ్వనాథ్‌పూర్ వాగులపై బ్రిడ్జి నిర్మాణాలకు త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వివరించారు. కెజిబివి పాఠశాల ప్రహరి గోడ నిర్మాణానికి సైతం శంకుస్థాపన చేశామని, వాటి నిర్మాణాలకు రూ.70లక్షల నిధులు వచ్చాయని తెలిపారు. కొందుర్గు మండలంలో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు తాము అనేక విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో డిఇ రవీంద్ర కుమార్, ఎఇ రాజశేఖర్, కాంట్రాక్టర్ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మెన్ దామోదర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ సయ్యద్ సాధిక్, నేతలు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, రామయ్య గౌడ్, మల్లేష్ గౌడ్‌లతోపాటు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## మొండిగౌరేల్లి రైతుల సమస్యలు పరిష్కరిస్తా

ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే
మల్‌రెడ్డి రంగారెడ్డి



ప్రజాపక్షం/యాచారం : మొండిగౌరేల్లి గ్రామ రైతుల సమస్యలను పరిష్కంచడానికి కృషి చేస్తానని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం మొండిగౌరేల్లి గ్రామ సర్పంచ్ కోలన్ రమాదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి, ఇబ్రహింపట్నం ఆర్‌డిఓ అనంతరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. రైతులకు నష్ట పరిహారం ఇప్పించే విధంగా తమ వంతుగా కృషి చేస్తామన్నారు. పట్టా భూమికి కోటి రూపాయలు, అసైన్డ్ మెంట్ భూమికి ఎకరాకి 60 లక్షలు, ఎకరాకి 120 గజాల ప్లాటు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓతో మాట్లాడి సరైన నష్టపరిహారం ఇచ్చించే విధంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మొండిగౌరేల్లి గ్రామంలో 821 ఎకరాల పట్టా భూములు, అసైన్డ్‌మెంటు భూములు తీసుకుంటామని నోటిఫికేషన్ ఇచ్చారు. తమ డిమాండ్లకు అనుకూలంగా ఇవ్వక పోతే తక్షణమే నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దెతున అందోళన చేస్తామని రైతులు హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బడే కుమార్,మాజీ సర్పంచ్ బండిమీది కృష్ణ, వార్డు సభ్యులు తాండ్ర రవిందర్‌తో బాటు, వార్డు మెంబర్లు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పనకు కృషి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ శాతవాహన నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తులో నిర్మించిన మహిళా సదన్ భవనాన్ని శుక్రవారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీల అభివృద్ధి కోసం తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటదన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు తమ కృషి ఉంటుందన్నారు. త్వరలోనే కాప్రాయి చెరువుకు సుందరీకరణ చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు నందిరాజు లక్ష్మి నారాయణ, దత్తాత్రేయ శర్మ, చిరంజీవులు, పార్టీ నాయకులు అనిల్ చౌదరి, మువ్వా సతీష్ చౌదరి, సుధాకర్ యాదవ్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ముగిసిన 'సిఎం కప్' క్రీడలు

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ మండలం సిఎం కప్ సెకండ్ ఎడిషన్–2025 క్రీడా కార్యక్రమాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించామని మండల విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశామని విద్యార్థుల క్రీడలు మానసిక పునరుత్తేజానికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు అశోక్, డిగ్రీ కళాశాల సిబ్బంది,పీఈటీలు పద్మావతి,రాఘవేందర్, శంకర్ నాయక్, అంజలి, మమత ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

### ఎపిసి చైర్మన్ అరెకపూడి గాంధీ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎపిసి చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో రూ.1కోటి 12లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఎపిసి ఛైర్మన్ అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేసి, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిహిల్స్, పీజేఆర్ నగర్, ఎన్‌టిఆర్ నగర్, మొగులమ్మబస్తీ, తారకరామ నగర్, మహాత్మా గాంధీ నగర్, రైతు బజార్ రోడ్డు, జయశంకర్ కాలనీ, ఈస్ట్ సాయినగర్, వెస్ట్ సాయి నగర్ ప్రాంతాల్లో నూతనంగా సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని అన్నారు. ఈ సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీ వాసులకు ట్రాఫిక్ సమస్యలు తగ్గి, మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి దిశగా యువత ముందుకు రావాలి : కె.యం.ప్రతాప్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీ, సుచిత్ర రోడ్డులో ఏర్పాటు చేసిన శ్రీ శివసాయి ఎంటర్‌ప్రైజస్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ షాప్‌ను శుక్రవారం రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. చిన్న వ్యాపారాలు ప్రారంభించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అదేవిధంగా శ్రీ శివసాయి ఎంటర్‌ప్రైజస్ ప్రొప్రైటర్ అవధూత గౌరవను అభినందిస్తూ, ఆయన చేపట్టిన ఈ వ్యాపారం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అవధూత గోపాల్, ఎరువ శంకరయ్య, పెద్ది మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## స్వప్నను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వినతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలం గాణ రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డిని మేడ్చల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు,ఫేడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ అమరేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు.



చేవేళ్లలో దారుణ హత్యకు గురైన మహిళా న్యాయమూర్తి స్వప్న కేసును ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేటట్లు బాధితురాలు కుటుంబానికి న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలోని న్యాయవాదులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫేడరేషన్ తరపున నిర్వహించ తలపెట్టిన పాదయాత్రకు పోలీస్ విభాగం తరపున అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయవాదులు అనంత్‌రెడ్డి, వివిధ జిల్లాల న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.


## హత్య కేసు నిందితుడి రిమాండ్

**ప్రజాపక్షం / ధారూర్ :** ధారూర్ మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం జరిగిన హత్యకేసులో నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించాడు. శుక్రవారం ధారూర్ సిఐ రఘురాములు, ఎస్ఐ రాఘవేందర్‌లు పత్రిక విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మోహన్ నాయక్, శంకర్ నాయక్‌లు దాయాదులు. గత ఏడాది అగస్టులో కోడి విషయమై గొడవపడి మోహన్ నాయక్‌ను, శంకర్ నాయక్, కొడుకు రాజేష్, భార్య లక్ష్మి బాయిలు కలిసి తీవ్రంగా గాయపరిచారు. అతను చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆ కేసులో జైలుకు వెళ్లి బెయిలుపై వచ్చారు. గ్రామస్తులు గ్రామంలో ఉంటే గొడవలు అధికమవుతాయని బెయిలుపై వచ్చిన వారిని గ్రామంలో కాకుండా మరెక్కడైన ఉండడని పంపించి వేశారు. ఇతర ప్రాంతంలో ఉంటూ కొడుకు రాజేష్ గ్రామంలోని కొందరితో మోహన్ నాయక్ కొడుకులను సైతం చంపుతానని చెప్పడంతో విషయాం తెలిసుకొని ఆగ్రహానికి గురై మోహన్ నాయక్ కొడుకు సాయి నేనే వారిని చంపుతానని పలువురితో చెప్పుకొచ్చాడు. అవకాశం కోసం ఎదురు చూస్తుండగా, బుధవారం ధారూర్ మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌కు పింఛన్ డబ్బులకోసం వచ్చిన ఎస్ శంకర్ నాయక్‌ను వెంబడించి, మోటార్ సైకిల్ దుకాణం ఎదురుగా వస్తున్న అతనిని తన స్కూటీతో ఢీ కొట్టి కిందపడగానే వెంట తెచ్చుకున్న కత్తితో గొంతులో పలుమార్లు పొడిచాడు. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య లక్ష్మి బాయి ఫిర్యాదు మేరకు నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజలందరు అప్రమత్తంగా ఉండి, ప్రశాంత వాతావరణంలో ఉండేవిధంగా గ్రామాలలోని ప్రజలు చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. వీలు కానిచోట సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సిఐ సూచించారు.

# బిజెపి, బిఆర్ఎస్ పార్టీలది చీకటి ఒప్పందం

### అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి

### రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/తాండూరు:** రాష్ట్రంలో బిజెపి, బిఆర్ఎస్ పార్టీల చీకటి ఒప్పదం బయట పడిందని, ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసి పదవులు పంచుకుంటున్నాయని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా తాండూరు మున్సిపల్ పరిధిలోని పాత తాండూరు, గాంధీచౌక్‌లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచార కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబుతో స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు ధారాసింగ్‌లతో కలసి మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నట్ మీటింగ్‌లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చిన బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కలిసి పోతున్నాయని దుయ్యబట్టారు. ఆ రెండు పార్టీలటు ఓటు వేయవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి అభివృద్ధికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపల్ చైర్మన్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పాలనలో పాత తాండూరు సైతం కొత్త తాండూరు కాబోతుందన్నారు. రేండళ్ళ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకాన్ని అందించడం జరిగిందన్నారు. పదేళ్ల అధికారం లో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డును అందించ లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సిఎం రేవంత్‌రెడ్డి పేదలకు సన్న బియ్యం అందించాలన్న ఉద్దేశంతో రేషన్ కార్డులను అందజేశారని అన్నారు.

ప్రజా ప్రభుత్వంలో దాదాపు 50వేల పైగానే ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించదని, త్వరలోనే నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేస్తుందన్నారు.

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తాను మాట లు చెప్పను, శిలాఫలకాలు వేయను. .పని చేసి చూపిస్తానని అన్నారు. తాండూరు రాజకీయల్లో ఎన్నడూ లేని విధంగా సామాజిక న్యాయం పాటిస్తూ సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. దయచేసి ఆలోచించి అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి సమక్షంలో బిజెపి నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు**

రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిల శ్రీదర్ బాబు సమక్షంలో పలువురు బిజేపి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా తాండూరు పర్యాటన లో మంత్రి సమక్షంలో బిజేపి నాయ కులు సుదర్శన్ గౌడ్ వారి అనుచులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి శ్రీదర్ బాబు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 28వ వార్డు చెందిన బిజేపి జిల్లా పార్టీ నాయకులు సుదర్శన్ గౌడ్‌తో పాటు 10వ వార్డుకు చెంది



ఇండిపెండెంట్ అభ్యర్థి ఎండి శికందర్, ఫాఫేజ్ అఫ్రోజ్‌ఖాన్, అక్రమ్, 17వ వార్డు నుండి ఖలీద్, మేరాజ్, సమీర్, ముజాహిద్,లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి పార్టీ కండు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



## కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పిలుపు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అదే విధంగా అలియాబాద్‌లోని 9, 18 వార్డులు సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ కోరారు. శుక్రవారం మూడుచింతలపల్లిలో సిపిఐ కార్యదర్శి తప్పెట్ల రాములుగౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం కబ్జాలు, అవినీతి, నియంత పోకడలను అవలంబించి గద్దె దిగిందని కేవలం రైతుబంధు చూపించి ప్రచారం చేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం నాయకులు ప్రజలకు ఉచితాలు వద్దంటు ప్రచారం చేసుకుంటున్న బిజెపి నాయకులు బీహర్‌లో మాత్రం ప్రతి మహిళకు పదివేలు ఇవ్వడం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గతంలో వంద శాతం కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని నేడు కొత్తగా కోర్రిలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇవ్వాలని చెప్పడం వెనకాల గ్రామీణ ఉపాధిహామీ పథకం నిర్వీర్యం చేయడమన్నారు. సంక్షేమ పథకాలను రాబోయే రోజుల్లో అమలుపరుచాలంటే సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సిపిఐ జిల్లా కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నర్సింహా, కౌన్సిల్ సభ్యులు సిహెచ్ దర్శన్, మండల కార్యదర్శి రాములుగౌడ్, కేశవరం శాఖ కార్యదర్శి వెంకటేష్‌యాదవ్, మండల సహాయ కార్యదర్శి సోగడ రమేష్, రైతు సంఘం నాయకులు పెరుమండ్ల నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## 3 మున్సిపల్ పరిధిల్లో 11న సెలవు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పురపాలక సంఘాల ఎన్నికల్లో భాగంగా ఈ నెల 11న జరిగే పోలింగ్ సందర్భంగా మేడ్చల్ జిల్లాలో జరిగే మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట మున్సిపల్ పరిధి ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలు, కర్మాగారాలు, వ్యాపార సంస్థలు, దుకాణాలకు సెలవు దినంగా జిల్లా కలెక్టర్ ప్రకటించారు.

**విశ్వ బ్రాహ్మణ సంఘ భవనానికి స్థల పరిశీలన :** విశ్వ బ్రాహ్మణ సంఘ భవనానికి ప్రభుత్వం భూమిని కేటాయించేందుకు నాగారం ప్రాంతంలో ప్రతిపాదించిన సర్వే నం 574లోని 2000 చదరపు గజాల స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయందర్‌రెడ్డి కీసర తహసీల్దార్ యాదగిరిరెడ్డి, సర్వేయర్ వినయ్‌కుమార్, ఆర్ఐ విశ్వనాథ్‌లతో కల్సి శుక్రవారం పరిశీలించారు.

# దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు







**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ ఉప్పల్ పారిశ్రామిక వాడాలో ఎఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎఐటియుసి నాయకులు జి.పరమేశ్వర్, యన్.జంగారెడ్డి, కె.మధుసూదన్, బి.రామకృష్ణ, పి.గోవర్ధన్ చారి, జె.పోచాలు,యోహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లు కార్మిక వ్యతిరేకమని విమర్శించారు. వేతనాల కోడ్ వల్ల కనీస వేతనాల హామీ దెబ్బతినే ప్రమాదం ఉందని, ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ ద్వారా ట్రేడ్ యూనియన్ల హక్కులు, సమ్మె హక్కుపై ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు. అలాగే సామాజిక భద్రత కోడ్ ద్వారా ఇపిఎఫ్, ఇఎస్ఐ వంటి సంక్షేమ పథకాల పరిధి కుదించే అవకాశం ఉందని, ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ వల్ల పనివేళలు పెరిగి కార్మికుల భద్రత ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమాన్ని కాపాడేందుకు ఈ 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

**కుత్బుల్లాపూర్‌లో :** శుక్రవారం ఎఐటియుసి అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జగద్గిరి గుట్ట చివరి బస్టాండ్ వద్ద సమ్మె గోడ పత్రికను భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు సామ్యూల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి ఓ.రాములు, కోశాధికారి ముసలయ్యలు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ నెల 12న జరిగే దేశవ్యాప్త సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. కార్మికులందరూ భారీ సంఖ్య లో సమ్మెలో పాల్గొని తమ హక్కుల కోసం పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు సైదులు, కృష్ణ, సోమయ్య, యాదగిరి, వెంకన్న, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గాంధీనగర్ కార్యాలయం వద్ద** క్రాంతి ఆటో యూనియన్ కార్మికులతో కలిసి రాష్ట్ర ఎఐటియుసి అధ్యాపకులు కామ్రేడ్ యూసుఫ్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిని 4లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ లేబర్ కోడ్స్ కార్పొరేట్ పెద్దలు, పారిశ్రామిక యాజమాన్యాలకు అనుకూలంగా ఉండి, శ్రమజీవి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా జరగనున్న ఈ సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వంగల శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ అధ్యక్షులు హరినాథ రావు, జిల్లా ఆటో యూనియన్ కార్యదర్శి బెజ్జల కృష్ణ మూర్తి, క్రాంతి ఆటో యూనియన్ నాయకులు, ఆటో యూనియన్ డ్రైవర్లు, కార్మికులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య ఘర్షణ... పరస్పర దాడులు




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడు మున్సిపలిటీల ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడ్ మలక్‌పేట ప్రాంతంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, బిఆర్ఎస్‌కు చెందిన మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి తమ తమ అనుయాయులతో అభ్యర్థి ప్రచారం చేస్తుండగా ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు ముదిరిపోయి పరస్పర దాడుల వరకు వెళ్లింది. ఈ దాడుల్లో తోటకూర వజ్రేష్ యాదవ్ నేరుగా బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే మల్లారెడ్డి అనుయాయుడు పరమేష్‌పై చేయి చేసుకోగా ఇరు వర్గాల అనుయాయులు మరింత రెచ్చిపోవటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దాడుల్లో మల్లారెడ్డి కారు ధ్వంసమైంది. సమాచారం అందుకొన్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే...ఆలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడ్ మలక్‌పేట ప్రాంతంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారానికి తమ అనుచరులతో కాంగ్రెస్ డిసిసి అధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, బిఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఒకే చోటకి చేరుకొన్నారు. డిసిసి అధ్యక్షుడు వచ్చిన ప్రచార రథానికి ఏర్పాటు చేసిన మైకుల ద్వారా పాటల సౌండ్ పెంచటంతో బిఆర్ఎస్ నాయకులు సౌండ్ తగ్గించాలని కోరారు. దీనికి కాంగ్రెస్ అనుయాయులు వినకుండా మరింతగా పెంచటంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకొంది. క్రమేణా పరస్పరం దాడులకు సిద్ధమై ఒకరికొకరు తోసుకోవటం, కొట్టుకోవటం ప్రారంభించారు. నేరుగా డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ సైతం బిఆర్ఎస్ నాయకులపై దాడిచేసి చేయి చేసుకోవటంతో బిఆర్ఎస్ నేత పరమేష్ కింద రాయిపై పడిపోవటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో పక్క మాజీమంత్రి మల్లారెడ్డి కారు స్వల్పంగా ధ్వంసమైంది.

**మహిళలని కూడా చూడకుండా దాడి చేసారు: కాంగ్రెస్ మహిళా నేతలు**

ఎన్నికల ప్రచారం చేస్తున్న తరుణంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రోత్సాహంతో తమపై మహిళలని సైతం చూడకుండా దాడి చేసి గాయపరచారని కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నేతలు అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రచారం చేస్తుంటే పథకం ప్రకారమే తమను అడ్డుకొని రెచ్చగొట్టి ఉద్రిక్త పరిస్థితులు నెలకొల్పారు. ఇదంతా మాజీ మంత్రి మల్లారెడ్డి చూస్తూ తమ అనుయాయులను మరింత రెచ్చగొట్టారన్నారు. ఇకనైనా మల్లారెడ్డి రౌడీ రాజకీయం మానుకోవాలని, ఓటమి భయంతోనే ఇదంతా చేస్తున్నారన్నారు. దాడులకు ఉసి గొల్పిన మల్లారెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు.

**ప్రజాస్వామ్యంపై దాడి:మాజీ మంత్రి మల్లారెడ్డి**

ఎన్నికల ప్రచారంలో భాగంగా వెళ్లిన తమపై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ నేతృత్వంలో జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై దాడి అన్నారు. వార్డు అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి విజయం కోసం తాము ఏర్పాటు చేసుకొన్న సమీక్షా సమావేశం కోసం మరో నాయకుడి ఇంటికి వెళ్లగానే వజ్రేష్ యాదవ్ తన అనుచరులతో ముందస్తు పథకం ప్రకారమే ఎన్నికల నిబంధనలను కాలరాచి డిజె, మైకుల సౌండ్ పెంచి రెచ్చగొట్టి దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ దాడుల్లో తమ కార్యకర్త పరమేశ్వర్ తలకు తీవ్రంగా గాయాలై రక్తస్రావమైందన్నారు. తన కారును సైతం ధ్వంసం చేసారన్నారు. ఇంత జరిగినా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారన్నారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ మంత్రి మల్లారెడ్డి తన అనుచరులతో జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసిన అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట డిసిసి అధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేసారు.



## సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/పరిగి :** ఈ నెల 7న వికారాబాద్ జిల్లా పరిగి మండల పర్యటన కు రానున్న నేపథ్యంలో జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ సిఎం ఏర్పాట్లను జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. పరిగి మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారు నందు ఉన్న ప్రాంతంలో ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లు పై అధికారులకు పలు సూచనాలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. హెలిప్యాడ్ , వేదిక ,భారీకేడ్స్ వెహికిల్ పార్కింగ్ మొబల్ టాయి లెట్స్, త్రాగునీరు, అరోగ్యశాఖ అధ్వర్యంలో అంబులెన్స్ , తదితర వాటి ఏర్పాట్లు ను నిర్ణీ త గడువు కంటే ముందుగానే పూర్తి చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చే వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అనువైనస్థలం ఎంపిక చేయాలని పోలీసు అధికారులకు సూచిచారు. ముఖ్యమంత్రి సభకు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఆర్‌డిఓ వాసుచంద్ర, డిఎస్‌పి శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రేతలు అరెస్టు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** గంజాయి విక్రేతలను అరెస్టు చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం ఎస్‌టిఎఫ్‌బి టీమ్ ఎస్ఐలు నాగరాజు, జ్యోతిలు కాప్రాలోని నేతాజీ నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న వారివద్ద నుండి 131 గ్రాములు, కాప్రా వంపుగూడలో 234 గ్రాముల గంజాయిని పట్టుకుని మంద రాహుల్, విశ్వనాథ్, మనోజ్, తనీష్ లను అరెస్టు చేశారు. వీరు మహారాష్ట్ర, ధూల్‌పేట్ నుండి గంజాయిని తీసుకు వచ్చి విక్రయిస్తున్నారు. నిందితులనుండి మూడు బైకులు,మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను కాప్రా ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.



## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పూలపల్లి గ్రామ సర్పంచ్ భర్త భాగ్యలక్ష్మి మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నవాబుపేట మండలంలోని పూలపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కూర్చొని భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు సరిపడా వసతులను కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విద్యార్థులు క్రమశిక్షణతో విని ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. 'నాయకత్వం అంటే అధికారం కాదు, బాధ్యత'అనే సందేశాన్ని పిల్లల హృదయాల్లో నాటారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ద్వారా వారి ఆరోగ్యం, ఆహార నాణ్యత, పాఠశాల వాతావరణంపై ప్రత్యక్షంగా అవగాహన పొందారు.



## బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి

### మాజీమంత్రి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** మున్సిపల్‌లోని అలంపల్లి శివరంనగర్ కాలని , యంఐజి , రామయ్యగూడ , అంబేద్కర్ నాగర్ , గృహకల్ప , అనంతగిరి పల్లిలో మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు అనంద్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. ప్రతి మహిళకు ఇస్తామన్నా 2500, వృద్దులకు ఫించన్ . రైతుబందు వంటి పథకలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని తెలిపారు. వికారాబాద్ లోని ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని తెలిపారు. రెండు సంవత్సరల్లో కేసిఆర్ ప్రభుత్వం వస్తుంది. ఇచ్చిన హామీలు అమలు చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బిసి కమిషన్‌మెంబర్ శభప్రద్‌పటేల్, నగేందర్‌గౌడ్, పట్టణఅధ్యక్షులు గోపాల్, శుభన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వేంకటేష్‌యాదవ్, అనిల్,తదితరులు పాల్గొన్నారు.

## అండర్-19 వన్డే వరల్డ్ కప్‌లో ఆరోసారి

# ఛాంపియన్‌గా టీమిండియా

పురుషుల అండర్–19 వన్డే వరల్డ్ కప్‌లో భారత కుర్రాళ్లు టైటిల్ పట్టేశారు. తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన భారత జట్టుకు ఆరో టైటిల్ కట్టబెట్టారు. ఇంగ్లంగ్‌తో ఫైనల్లో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(175) విధ్వంసక శతకంతో విరుచుకుపడగా.. బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను బెంబేలెత్తించారు. అంబ్రిష్(3–56) విజృంభించ గా 100 పరుగుల తేడాతో ప్రత్యర్థిని మట్టికరిపించింది. 174కే ఏడు వికెట్లు పడినా.. టెయిలెండర్ ఫాల్క్నర్(115) వీరోచిత సెంచరీ బాదినా సరిపోలేదు. కనిష్క్ ఓవర్‌లో ఖిలాన్ పటేల్ డైవింగ్ క్యాచ్ అందుకోగా ఆరో సారి అండర్–19 ఛాంపియన్‌గా నిలిచింది టీమిండియా.



ఇటీవల రైజింగ్ స్టార్స్ ఎమర్జింగ్ ఆసియా కప్, ఆసియా కప్‌లో తేలిపోయిన భారత జట్టు ఏనుగు కుంభస్థలాన్ని కొట్టింది. అజేయంగా అండర్–19 ప్రపంచకప్ ఫైనల్‌కు దూసుకెళ్లిన టీమిండియా అదిరే ఆటతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి టైటిల్‌ను ఒడిసిపట్టింది. టాస్ గెలిచిన భారత్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(175) వీరకొట్టుడుకు ఆయుష్ మాత్రే (53), అభిగ్యాన్ కుందు(40) మెరుపులతో 411 పరుగులతో ఇంగ్లాండ్‌పై మానసికంగా పైచేయి సాధించింది. కొండంత స్కోర్ కొట్టిన టీమిండియాకు ఛేదనలో ఇంగ్లండ్ ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. టాపార్డర్ విఫలమవ్వగా ఇంగ్లండ్ ఓటమి ఖాయమైంది. కానీ, టెయిలెండర్లు అసమాన పోరాటంతో భారత బౌలర్లను విసిగించారు. కానీ.. అంబ్రిష్(3–56), కనిష్క్(2–63), దీపేశ్(2–64) అద్భుతమైన బౌలింగ్‌తో ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లారు. రికార్డు ఛేదనలో ఇంగ్లండ్‌కు ఐదో ఓవర్లోనే అంబ్రిష్ షాకిచ్చాడు. ఓపెనర్ జోసెఫ్ మూరెస్(17)ను బౌల్ చేసి టీమిండియాకు బ్రేకిచ్చాడు. అనంతరం బెన్ మేయ్స్(45) జతగా బెన్ డాకిన్స్(66) బౌండరీలతో చెలరేగాడు. అర్ధ శతకానికి చేరువైన.. బెన్ స్వీప్ షాట్ ఆడిన హెనిల్ పటేల్ క్యాచ్ పట్టగా వెనుదిరిగాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా క్రీజ్‌లో పాతుకుపోయిన డాకిన్స్‌ను ఆయుష్ మాత్రే బోల్తా కొట్టించాడు. రాల్ఫ్ ఆల్బర్ట్(0) క్రీజులోకి రావడమే ఆలస్యం రనౌటయ్యాడు. కవర్స్‌లో ఆడిన బంతిని ఆపిన వైభవ్ మెరుపు వేగంతో వికెట్ కీపర్ కుందు వైపు విసిరాడు. అతడు వికెట్లను గిరాటేయగా..174కే ఇంగ్లండ్ సగం వికెట్లు కోల్పోయింది. ఆ కాసేపటికే దీపేశ్(239) ఓవర్లో ఫర్హాన్ అహ్మద్(1) కుందు చేతికి చిక్కాడు. సెబాస్టియన్ మోర్గాన్ సైతం అతడికే రిటర్న్ క్యాచ్ ఇవ్వగా ఇంగ్లండ్ ఓటమి ఖాయమైంది.

**దంచేసిన ఫాల్క్నర్** ...మిడిల్ ఓవర్లలో వరుస వికెట్లతో ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టిన భారత బౌలర్లకు ఫాల్క్నర్(115), జేమ్స్ మింటో(28) చుక్కలు చూపించారు. ప్రధాన బ్యాటర్లు ఔటైనా వీరు మాత్రం దీటుగా ఆడారు. ఫాల్క్నర్ ఎడాపెడా ఫోర్లతో విరుచుకుపడ్డాడు ఎనిమిదో వికెట్‌కు 92 రన్స్ కలిపిన ఈ జోడీని అంబ్రిష్ విడదీసి బ్రేకిచ్చాడు. సిక్సర్లతో రెచ్చిపోయిన ఫాల్క్నర్ సెంచరీ తర్వాత కనిష్క్ ఓవర్లో వెనుదిరిగాడు. ఖిలాన్ పటేల్ ముందుకు డైవ్ చేస్తూ క్యాచ్ అందుకోగా 311 వద్ద ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. 100 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా తొమ్మిదోసారి ఛాంపియన్‌గా నిలిచింది.

## పాకిస్థాన్ జట్టుపై నిషేధం విధించాలి

### ఐసిసిని కోరిన బిజెపి ఎంపి ఠాకూర్



భారత్, శ్రీలంక వేదికగా రేపటి నుంచి టి–20 ప్రపంచకప్ షురూ కానుంది. వామప్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన భారత జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో యుఎస్ఎతో తలపడనుంది. కానీ.. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు మాత్రం అనిశ్చితి కొనసాగుతోంది. ఇండియాతో మ్యాచ్ బాయకాట్ చేస్తామని పాకిస్థాన్ ప్రభుత్వం వెల్లడించగా.. మేము ఆడేందుకు సిద్ధమే అని భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తేల్చి చెప్పాడు. ఈ నేపథ్యంలో బిసిసిఐ మాజీ అధ్యక్షుడు, బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. కొలంబోలో ఇండియాతో మ్యాచ్ ఆడకుంటే పాక్ జట్టుపై నిషేధం విధించాలని ఆయన పేర్కొన్నాడు. భారత్‌లో వరల్డ్ కప్ ఆడబోమని బెట్టు చేసినందుకు బంగ్లాదేశ్‌కు వేటు పడింది. అప్పటి నుంచి ఆ దేశ క్రికెట్ బోర్డుకు మద్దతిస్తున్న పాకిస్థాన్ మెగా టోర్నీలో భారత జట్టుతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తామని తెలిపింది. అయితే.. టీమిండియా కెప్టెన్ మాత్రం కొలంబో వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్నామని.. ఫిబ్రవరి 15న పాక్‌తో మ్యాచ్ అందేందుకు స్టేడియానికి వెళ్తామని చెప్పాడు. శ్రీలంక బోర్డు సైతం ఇండియాతో మ్యాచ్ ఆడాలని పాక్ బోర్డుకు లేఖ రాసింది. లాహోర్ దాడిని గుర్తు చేస్తూ మ్యాచ్‌ను బాయ్‌కాట్ యొద్దని కోరింది. అయినా సరే పాక్ బోర్డు స్పందించలేదు. దాంతో, ఎంపిక పద్ధతిన ప్రపంచకప్ ఆడాలనుకున్న పాక్‌పై చర్యలు తీసుకోవాలని బిజెపి ఎంపీ, మాజీ బిసిసిఐ అధ్యక్షుడు ఠాకూర్ అన్నాడు.

## సైన్స్

# మెదడుపై కాలం ప్రభావం!

జీతాలు ఆలస్యం వచ్చినట్టు... తీర్చాల్సిన అప్పుల గడువు చాలా తొందరగా వచ్చినట్టు అనిపించడం సగటు జీవి జీవితంలో సహజం. అయితే, నిజంగానే కాలం అనేది వివిధ వయసుల వారిపై వేరువేరుగా ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. చిన్నతనంలో ఒక రోజు చాలా సుదీర్ఘంగా ఉన్నట్టు.. వయసు పెరిగిన కొద్దీ కుదించుకుపోతున్నట్టు అనుభవం శాస్త్రపరంగా నిర్ధారించిన విషయమే అంటున్నాయి ఆధునిక న్యూరోసైన్స్ పరిశోధనలు. తాజా సిద్ధాంతాలను అనుసరించి, చిన్న వయసులో ఒక రోజు కూడా చాలా పొడవుగా అనిపించడం, సెలవులు అంతులేనివిగా భావించబడటం అనేవి యాదృచ్ఛిక అనుభూతులు కావు. ఆ దశలో మన మెదడు నిరంతరం కొత్త సమాచారంతో నిండిపోతూ ఉంటుంది. కొత్త ముఖాలు, కొత్త పరిసరాలు, కొత్త భావోద్వేగాలు మెదడును అప్రమత్తంగా ఉంచుతాయి. ప్రతి అనుభవం ప్రత్యేకంగా నమోదు అవుతుంది. ఈ అధిక జ్ఞాపక సాంద్రత కారణంగానే ఆ కాలాన్ని వెనక్కి చూసినప్పుడు అది విస్తృతంగా, నెమ్మదిగా సాగినట్టుగా అనిపిస్తుంది. వయసు పెరిగేకొద్దీ జీవితం ఎక్కువగా పునరావృత నమూనాల్లోకి మారుతుంది. ఒకే రకమైన పని విధానాలు, ఒకే మార్గాలు, ఒకే తరహా సంభాషణలు మెదడుకు కొత్తగా అనిపించవు. కొత్త సమాచారాన్ని నిల్వ చేయాల్సిన అవసరం తగ్గిపోతుంది. దాంతో జ్ఞాపకాలలో స్పష్టమైన సూచికలు లేదా గుర్తింపులు తగ్గుతాయి. ఫలితంగా, ఆ కాలాన్ని తిరిగి గుర్తు చేసుకునేటప్పుడు అది కుదించుకుపోయినట్టుగా, ఖాళీగా గడిచినట్టుగా అనిపిస్తుంది. అందుకే ఒక సంవత్సరం క్షణాల్లో ముగిసిపోయినట్టుగా మనకు అనుభూతి కలుగుతుంది. ఇక్కడ ముఖ్యంగా గ్రహించాల్సిన విషయం ఏమిటంటే, మెదడు కాలాన్ని గడియారంతో కొలవదు. అది కాలాన్ని జ్ఞాపకాల పరిమాణం మరియు వాటి సాంద్రత ఆధారంగా అంచనా వేస్తుంది. ఇటీవలి బ్రెయిన్ ఇమేజింగ్ అధ్యయనాలు ఈ భావనకు బలమైన ఆధారాలు అందిస్తున్నాయి. ఒక నిర్దిష్ట కాలం మనకు ఎంత పొడవుగా లేదా చిన్నగా అనిపించిందన్నది, ఆ కాలంలో ఎంత కొత్త సమాచారం మెదడులో నమోదయ్యిందన్నదానిపై ఆధారపడి ఉంటుంది. రోజులు ఒకేలా ఉంటే నెలలు క్షణాల్లో గడిచినట్టుగా అనిపిస్తాయి.. అదే కాలంలో మార్పులు, కొత్త అనుభవాలు ఎక్కువగా ఉంటే అదే సమయం విస్తృతంగా అనిపిస్తుంది. దృష్టి పాత్ర ఇక్కడ అత్యంత కీలకం. ఆటోపైలట్ స్థితిలో, ఒకేసారి అనేక పనులు చేస్తూ ఏ ఒక్కదానిపైనా పూర్తి శ్రద్ధ పెట్టకుండా జీవించినప్పుడు, మెదడు కాలాన్ని మరింత కుదించి నమోదు చేస్తుంది. కానీ కొత్త నైపుణ్యాన్ని నేర్చుకున్నప్పుడు, కొత్త ప్రదేశాన్ని అన్వేషించినప్పుడు లేదా సాధారణ పనినే అయినా సంపూర్ణ దృష్టితో చేసినప్పుడు, కాలం మళ్లీ విస్తరించినట్టుగా అనిపిస్తుంది. అందుకే శాస్త్రవేత్తలు కాలాన్ని నెమ్మదింపజేయాలంటే గడియారాన్ని మార్చడం కాదు, జీవన విధానాన్ని మార్చడం అవసరమని సూచిస్తున్నారు. కాలం నిజంగా వేగంగా పోవడం లేదు... మారింది మన అనుభూతి మాత్రమే. జీవితంలో అర్థవంతమైన క్షణాలు ఇంకా కాలాన్ని ఆపగలవు. మనం ఎంతగా గమనిస్తామో, అంతగా కాలం మనకు తిరిగి కనిపిస్తుంది. కాలం మనపై విజయం సాధించలేదు. మన దృష్టి దాన్ని వదిలేసింది అంతే.



## గతంపై ప్రస్తుత నిర్ణయాల ప్రభావం?

క్వాంటం సిద్ధాంతం విస్తరిస్తున్న కొద్దీ ఎవరి అంచనాలకూ అందని రీతిలో సిద్ధాంతాలు, అభిప్రాయాలు మారిపోతున్నా యి. రోజుకో ప్రతిపాదన ముందుకొస్తున్నది. అయితే, ఒక చిన్న వాస్తవానికి అభూత కల్పనలు జోడిస్తూ, వివిధ సామాజిక మాధ్యమాల్లో విచిత్రమైన ఆలోచనలు సిద్ధాంతాల రూపంలో దర్శనమిస్తున్నాయి. అలాంటి అంచనాల్లో 'గతంపై ప్రస్తుత నిర్ణయాలు ప్రభావితం చేస్తాయి' అనే ఆలోచన ఒకటి. ఈ ప్రశ్న వినడానికి తాత్వికంగా అనిపించినా, దాని వెనుక ఉన్న శాస్త్రీయ నేపథ్యం క్వాంటం భౌతికశాస్త్రంలో జరుగుతున్న నిజమైన పరిశోధనల నుంచే వస్తోంది. కోపెన్‌హేగన్ సహా పలు అంతర్జాతీయ పరిశోధనా కేంద్రాల్లో జరిగిన ప్రయోగాలు కాలం గురించి మనకు అలవాటైన 'కారణం–ఫలితం' (లేదా చర్య, ఫలితం) వరుసను ప్రశ్నిస్తున్నాయి. సాధారణంగా మనం భావించే గతం స్థిరంగా ఉంటుంది. భవిష్యత్తు మాత్రమే మారుతుంది. కానీ అణు, ఉపఅణు స్థాయిలో ఈ భావన ఎప్పుడూ సరిపోకపోవచ్చు. ఇక్కడ 'తిరోగమనం' అనే ఆలోచన ప్రస్తావనకు వస్తుంది. అంటే భవిష్యత్తులో చేసే కొలత ఒక కణం గతంలో ఎలా ప్రవర్తించిందో నిర్ణయించినట్టుగా ఫలితాలు కనిపించడం. 'డిలేయిడ్‌ఛాయిస్', 'క్వాంటమ్ ఎరేజర్' ప్రయోగాల్లో, ఒక ఫోటాన్ తరంగంలా లేదా కణంలా ప్రవర్తించిందన్నది మనం తరువాత ఎలా కొలుస్తామన్నదానిపై ఆధారపడినట్టు గణితపరంగా తేలింది.



## సమాంతర విశ్వంపై ఊహాగానాలు

కెనడా ఎనర్జీ రెస్పాన్స్ బెనెఫిట్ (సెర్న్) 'సెర్న్' శాస్త్రవేత్తలు సమాంతర విశ్వాన్ని కనుగొన్నారంటూ ఇటీవల ప్రచారం జోరుగా సాగుతున్నది. కానీ, ఇది శాస్త్రీయంగా సరైనది కాదు. 'సెర్న్'కు చెందిన పరిశోధకులు స్వయంగా స్పష్టం చేసినట్టు, ఇది మరో విశ్వాన్ని ప్రత్యక్షంగా గుర్తించిన అధ్యయనం కాదు, పూర్తిగా సిద్ధాంతాత్మక క్వాంటం సిమ్యులేషన్లపై ఆధారపడిన పరిశోధన మాత్రమే. ఇందులో శాస్త్రవేత్తలు అత్యంత క్లిష్టమైన గణిత నమూనాలను శక్తివంతమైన కంప్యూటర్లలో నడిపి, ప్రకృతిలో ఇప్పటివరకు సృష్టించలేని తీవ్రమైన పరిస్థితుల్లో కణాలు ఎలా ప్రవర్తించవచ్చో అంచనా వేశారు. ఇవి ఆధునిక భౌతిక సిద్ధాంతాలు సూచించిన పరిస్థితులే అయినా, ప్రయోగశాలలో నేరుగా పరీక్షించడానికి ఇంకా సాధ్యం కావు. క్వాంటం సిమ్యులేషన్లు అనేవి ప్రయోగాలు కావు. అవి సిద్ధాంత సమీకరణాలను మోడళ్లుగా మార్చి పరీక్షించే పద్ధతులు. కొన్ని సందర్భాల్లో ఈ ఫలితాలు మల్టీవర్స్ లేదా మెనీ వరల్డ్స్ వంటి సిద్ధాంతాల్లో ఊహించిన నమూనాలను తలపిస్తాయి. కానీ, ఇది గణితపరంగా ఇలా జరగవచ్చని చూపించడమే తప్ప, ప్రకృతిలో నిజంగా ఇలా జరిగిందని నిరూపించడం కాదు. సెర్న్' చేసిన ఈపని సిద్ధాంతాత్మక భౌతిక శాస్త్రంలో ఒక ముందడుగు మాత్రమే. సమాంతర విశ్వాల ఉనికిని నిర్ధారించే ఆధారం కాదు. ప్రత్యక్షంగా గమనించినది రెండూ ఒకటే కావని ఈ అధ్యయనం స్పష్టంగా గుర్తు చేస్తుంది.



# మానుకోటలో బిఆర్‌ఎస్‌తో అవగాహన

### ఏడు స్థానాలలో పోటీ
### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మహబూబాద్ జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌తో సిపిఐ అవగాహన చేసుకోవడం జరిగిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం రాత్రి బిఆర్ఎస్ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవితతో సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్, సిపిఐల మధ్య జరిగిన అవగాహన వివరాలను తక్కళ్లపల్లి శ్రీనివాసరావు వెల్లడించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ఏడుస్థానాల్లో సిపిఐ పోటీ చేస్తుందన్నారు. 18,21,22, 23,25, 33, 36, వార్డుల్లో నామినేషన్ వేసినట్లు మిగతా వార్డుల్లో బిఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నాట్లు ఆయన తెలిపారు. 18,23 వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు ఉపసంహరించుకుని సిపిఐకి మద్దతు తెలపడంపట్ల బిఆర్ఎస్‌ను అభినందించారు. సిపిఐ పోటీ చేయని వార్డుల్లో బిఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలపడం జరుగుతుందని ఆయన తెలిపారు. మిత్రదోహం చేసిన కాంగ్రెస్‌కు మున్సిపాలిటీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. పరస్పర అవగాహనతో కొన్ని స్థానాలు సిపిఐకి మరికొన్ని స్థానాల్లో బిఆర్ఎస్‌తో కలిసి అవగాహనతో మానుకోట మున్సిపల్ ఎన్నికల్లో ముందుకు పోతామని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవగాహన వివరాలను తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి, బీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డి, పంజాల రమేష్ ,సిపిఐ, బిఆర్ఎస్ అభ్యర్థులు పెరుగుకుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, యాళ్ళ మురళీధర్ రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ఎండి ఫాతిమా ,నాగేల్లి యాకమ్మ, నర సంధ్య, చింతకుంట్ల శ్రీదేవి, మేక వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులు గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం

### సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ 41వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మార్కాపూర్ సూర్యకు మద్దతుగా శుక్రవారం వందలాది మందితో డివిజన్‌లో భారీ ర్యాలీ, డప్పు చప్పులతో ఎల్బీనగర్‌లోని సిపిఐ జెండా వద్ద భారీ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి, కలవేన శంకర్ హాజరై మాట్లాడుతూ ఉజ్వల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిపిఐ నాయకుడు తిరుపతి కుమారుడు మార్కాపూర్ సూర్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డివిజన్ ప్రజలను కోరా రు. విద్యావంతుడు, యువకుడు, విద్యార్థి, యువజన నాయకుడిగా ఎదిగి కమ్యూనిస్టు పార్టీలో ఫుల్ టైంగా పని చేస్తున్న సూర్యను గెలిపిస్తే డివిజన్‌లో రక్షకుడిగా ఉంటూ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటాడని తెలిపారు. గతంలో సిపిఐ తిరుపతి కౌన్సిలర్ గా గెలిచి 19వ వార్డును అనేక రకాలుగా అభివృద్ధి చేశారని, కమ్యూనిస్టు పార్టీ గెలిస్తే అభివృద్ధి జరుగుతుందని చాడ తెలిపారు. ఇతర బూర్జువ పార్టీలలాగా స్వార్థానికి కాకుండా ప్రజల కోసం పనిచేసే ప్రజా ప్రతినిధులు కేవలం కమ్యూనిస్టు పార్టీ ప్రజా ప్రతినిధు లు మాత్రమేనన్నారు. డివిజన్ ప్రజలంతా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి అయిన మార్కపురి సూర్యను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు ప్రజా ఆమోదయోగ్యమైన పనులు చేయడంలో విఫలమయ్యారని, కమ్యూనిస్టు పార్టీని ఎన్నికల సమయంలో దగ్గర తీసి, అనంతరం అధికార అహంతో దూరం పెట్టడం సరైంది కాదన్నారు, అలాంటి వారికి మునిసిపల్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మడ్డి ఎల్లాగౌడ్, పార్టీ ప్రజాసంఘాల నాయకులు శనగరపు చంద్రశేఖర్, అబ్దుల్ కరీం, శనిగరపు లక్ష్మీ నారాయణ, ఎజ్జ రాజయ్య, రణవిని సుధీర్ కుమార్, డప్పు రాజు, జూలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై పోరాడే అజయ్‌సారథిరెడ్డికి మద్దతు ఇవ్వండి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మానుకోట 33వ వార్డులో సిపిఐ అభ్యర్థి, మాజీ మున్సిపల్ సిపిఐ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి శుక్రవారం ఇంటింటికీ ముమ్మర ప్రచారం చేశారు. గెలుపు దిశగా ఆయన ప్రచారం పరుగులు తీస్తోంది. మానుకోట మున్సిపాలిటీలో అజయ్‌సారధిరెడ్డి లేకుంటే ప్రశ్నించే గొంతుకే ఉండదని పలువురు భావిస్తున్నారు. అత్యధిక మెజారిటీతో అజయ్‌సారధిరెడ్డిని గెలిపిస్తామని ఓటర్లు హామీ ఇస్తున్నారు. వార్డు ప్రచారంలో ఎక్కడికి వెళ్ళిగా అజయ్‌సారధిరెడ్డిని ఆప్యాయంగా పలకరిస్తున్నారు. ప్రచారానికి వారే స్వాగతిస్తూ ముందుకు వస్తున్నారు. నిత్యం ప్రజాసమస్యలపై పోరాడే ప్రజా యుద్ధనౌకగా అజయ్‌సారథిరెడ్డికి మంచిపేరున్న నేపథ్యంలో, మానుకోట సమస్యలపై ఉద్యమించే సిపిఐ అభ్యర్థిగా 33వ వార్డులో నిలబడడం, మిత్రద్రోహి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిందేనంటూ ఓటర్లు కూడా అజయ్‌సారథిరెడ్డికి అండగా నిలుస్తామంటున్నారు. అజయ్‌సారథిరెడ్డి రావాలి అభివృద్ధి జరగాలంటూ 33వ వార్డు ప్రజలు సిపిఐ ప్రచారానికి నీరాజనాలు పలుకుతున్నారు. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు, తండా సందీప్, ఎండి మహమూద్, పడిదల కవిత,నీదిగొండ సత్యం, పురం భాగయ్యమ్మ, నక్క నాగార్జున, ఉస్మాన్, ముదుసు రాణి, నీలం వెంకన్న, యూసూఫ్, గుగులోత్ కుమార్, మంజునాథ్, కొమ్ము యాకన్న, అనిత, యశోద తదితరులు పాల్గొన్నారు.



# గుట్టలో మిత్రపక్షాల ప్రచార జోరు



### కంకికొడవలికి ఓటు వేయాలని ఎమ్మెల్సీ సత్యంతో కలిసి ఎమ్మెల్యే బీర్ల, మోత్కుపల్లి ప్రచారం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** కంకి కొడవలికి ఓటు వేయాలని యాదగిరిగుట్ట పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, ఎమ్మెల్సీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నెల్లికంటి సత్యం శుక్రవారం ప్రచారం నిర్వహించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని 12వ వార్డులో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి బబ్బురి శ్రీధర్‌ను గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ వారు ఓట్లను అభ్యర్థించడంతో ప్రచారం ఊపందుకుంది. పట్టణంలోని 2, 3, వార్డులలో వారు చేసిన ప్రచారం మిత్రపక్షాల కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. యాదగిరిగుట్ట పట్టణంలో అభివృద్ధి కొరకు సిపిఐ చేసిన పోరాటాలు, పంపిణీ చేసిన ఇంటి స్థలాలు, బంజరు భూముల పంపిణీ ప్రజలకు పోరాటాల ద్వారా అందించిన ఫలితాలను వివరిస్తూ సిపిఐ నాయకులు ఓట్లను అడిగారు. పట్టణ అభివృద్ధి నిరంతరాయంగా సాగాలంటే మిత్రపక్షాల అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ 'చేయి' గుర్తుకు, సిపిఐ అభ్యర్థి కంకి కొడవలి గుర్తులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజయ్య, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ,మండల కార్యదర్శులు మహేందర్, గాదగాని మాణిక్యం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కానుగు బాలరాజు, పట్టణ అధ్యక్షులు బిక్షపతి పాల్గొన్నారు.

### ఇమ్రాన్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి
### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**భువనగిరి :** భువనగిరి పట్టణంలోని 10వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న ఎండి ఇమ్రాన్ విజయానికి మద్దతుగా సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం పార్టీల ఉమ్మడి మద్దతుతో పోటీ చేస్తున్న ఇమ్రాన్ తరపున ఆయన గడపగడపకూ వెళ్లి, 'సిలిండర్' గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సామల శోభన్ బాబు, సామల భాస్కర్, గాదెగాని మాణిక్యం, చింతల మల్లేష్, బద్దం వెంకట్ రెడ్డి, షర్ఫోద్దీన్, సతీష్, అదిల్, ఇర్ఫాన్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ గెలుపుతోనే సమస్యలు పరిష్కారం

### 10వ వార్డు అభ్యర్థిని మమత జ్యోతిబసును గెలిపించండి
### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ మున్సిపాలిటీకి జరుగుతున్న ఎన్నికల్లో 10వ వార్డులో పోటీ చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిని జూలూరి మమత జ్యోతిబసు కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం 10వ వార్డులో ముమ్మరంగా ఇంటింటికి ప్రచారం నిర్వహించి సిపిఐ అభ్యర్థిని మమత జ్యోతిబసును గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రజల కోసం నిత్యం పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా వార్డు సమస్యల పరిష్కారం కోసం పాలకవర్గాలపై వత్తిడి తీసుకొచ్చి పరిష్కరిస్తారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకను గెలిపిస్తే నిజాయితీగా ప్రజల కోసం పని చేస్తారని, 10వ వార్డు ప్రజలు మమత జ్యోతిబసు కంకికొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అభ్యర్థిని జూలూరి మమత జ్యోతిబసుతో పాటు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు రంగారెడ్డి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల నాయకులు యాదయ్య, మైనోద్దీన్, కృష్ణారెడ్డి, మల్లయ్య, మహేష్, శ్రీనివాస్, నగేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**ప్రజాపక్షం/దేవరకొండ:** రాష్ట్ర మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా దేవరకొండ పట్టణంలోని 18వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఉప్పల శ్రీనివాసులు గెలుపును ఆకాంక్షిస్తూ గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అభ్యర్థులు, మహిళలు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రియాశీలకంగా ఎన్నికల విధుల్లో అధికారులు




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : 2వ సాధారణ పురపాలక ఎన్నికలు 2026లో భాగంగా 11న జరిగే పోచంపల్లి మున్సిపాలిటీ ఎన్నికలలో విధుల్లో పాల్గొనే ఎన్నికల సిబ్బంది అధికారులు క్రియాశీలకంగా సమర్థవంతంగా పనిచేయాలని సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి పునరుద్ఘాటించారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఎల్ఈడి స్క్రీన్ ద్వారా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు సూచనలు అధికారులు అనుసరించవలసిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, రాపర్తి భాస్కర్ జోనల్ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి, ముగ్గురు వ్యక్తుల అరెస్ట్



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని వాసాలమర్రి గ్రామ శివారులో గల ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు తుర్కపల్లి పిఎస్ఎస్ఐ తక్యుద్దీన్ వారి సిబ్బందితో పేకాట స్థావరం పై దాడి చేసి ముగ్గురు నిందితులు, పెంజెర్ల రాజేందర్,(మేడ్చల్), దేవరి వేణు రాజ్(మేడ్చల్), కోరంపల్లి సతీష్ (కామారెడ్డి)లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. కాశిరెడ్డిపల్లికి చెందిన మల్లేష్ అనే వ్యక్తి, లక్ష్మ ణ్ అను వ్యక్తి సహాయంతో వాసాలమర్రి గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రదేశంలో మరికొంత మంది పేకాట రాయుళ్ళతో పేకాటాని ఆర్గనైజ్ చేస్తున్నాడని, వారిని పట్టుకునే క్రమంలో కొంత మంది వ్యక్తులు సంఘటన స్థలం నుంచి పారిపోయారని, పట్టుబడిన వారివద్ద నుండి రూ.2,07,000 నగదు, మూడు కార్లు, రెండు సెట్‌ల పేక ముక్కలు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి అట్టి వ్యక్తులను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఎవరైనా పేకాట ఆడిన, ఆర్గనైజ్ చేసినా, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం నల్లచలముల గ్రామ పంచాయతీకి చెందిన రైతు లింగాల వెంకటేశ్వర్లు తండ్రి లింగయ్య (58) ఉదయం తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ ఎర్త్ వైరు తగలడంతో షాక్ రావడంతో తీవ్ర గాయాలు కావడంతో రైతును దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం రైతు వ్యవసాయ పొలంలో బోరు మోటార్‌కు కరెంటు సరఫరా కావాటం లేదని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్ళి చూస్తుండగా ఒక్క సారిగా కరెంట్ వైర్లు రైతు చేతికి తగలడంతో తీవ్రగాయాలు అయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్త్ వైర్ లేకపోవడంతో ఈ ఘటన చోటు చేసుకుందని, విద్యుత్ అధికారులు స్పందించి వారి కుటుంబానికి సహాయం చేయాలని అన్నారు.

## కాంగ్రెస్ అంటే కబ్జాలు, కూల్చివేతలే

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : కాంగ్రెస్ అంటే కబ్జాలు, కూల్చివేతలేనని బిఆర్ఎస్ అంటే అభివృద్ధి ప్రశాంత వాతావరణం అని ప్రజలే అంటున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గడపగడపకు గులాబీ దండు పేరుతో 16, 18 వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆ పార్టీ నుండి కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న రంగినేని ఉపేందర్ రావు, సక్రు నాయక్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన గత రెండేండ్ల కాలంలో గుండాయిజం, గంజాయిజం పెరిగిందన్నారు. వాళ్ళకు ఓటేస్తే అవినీతి, దౌర్జన్యాలను పెంచిన పోషించినట్లేనని హెచ్చరించారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, ప్రశాంతతకు కేరాఫ్‌గా ఉన్న సూర్యాపేటలో నేడు అది కరువైందన్నారు. కెసిఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఏంచేశారని ప్రశ్నించారు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు కాంగ్రెసోళ్ళు వార్డులు పంచుకున్నారని ఎద్దేవా చేశారు. అందుకే కాంగ్రెసోళ్ళకు ఓటు అనే ఆయుధంతో సరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కెసిఆర్ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు, పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, ఎన్నికల ఇంచార్జి ఇస్లావత్ రామచంద్రనాయ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు దీటుగా నల్లగొండ అభివృద్ధి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 4,5, 21, 20, 41, 47,48 డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మంత్రి రోడ్ షో నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తానని తెలిపారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం నల్గొండ మున్సిపల్ అభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని ధ్వజమెత్తారు.కెసిఆర్ ప్రభుత్వం కుటుంబంలో పదవులు పంచుకున్నారే తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు.ఈనెల 11న జరిగే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో చెయ్యి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే డివిజన్లోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.అదేవిధంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం మద్దతు ప్రకటిస్తూ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,నాయకులు పి.వెంకటరావు,పి.అంజయ్య,ముండ్ల ముత్యాలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఎ హాఫీజ్ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, తిప్పర్తి మాజీ జడ్పిటిసి రామ్‌రెడ్డి, కార్పొరేటర్లు అభ్యర్థులు బోగరి వైష్ణ వి, జ్ఞానేశ్వరి గణేష్, మహమ్మద్ ఇబ్రహీం, అల్లి సుభాష్, సాయిశ్రీ, వేణు గోపాల్ రెడ్డి, కవిత రమేష్ పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, బిజెపిలకు డిపాజిట్లు కూడా దక్కవు

ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట ఆలేరులో

మిత్రపక్షాలు క్లీన్ స్వీప్ చేస్తాయి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు పడ్డ కష్టాలకు చరమగీతం పాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనకే ప్రజలు పట్టం కడుతున్నారని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో ఆయన విపక్షాలపై నిప్పులు చెరిగారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో సిపిఐ, సిపిఎం మిత్రపక్షాలతో కలిసి కాంగ్రెస్ భారీ విజయం సాధించబోతోందని అయిలయ్య ప్రకటించారు. ఆలేరు మున్సిపాలిటీలో 12 వార్డులకు గాను 12 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. యాదగిరిగుట్టలో ఇప్పటికే 10వ వార్డును కాంగ్రెస్ కైవసం చేసుకుందని, మిగతా వార్డుల్లోనూ భారీ మెజారిటీ ఖాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటికే 70 శాతం మంది ప్రజలు కాంగ్రెస్ వైపు నిలిచారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు లోపాయికారీ ఒప్పందాలతో ఏకమైనా వారికి డిపాజిట్లు కూడా రావని అయిలయ్య ఎద్దేవా చేశారు. 'ధనిక రాష్ట్రం అని చెప్పి పదేళ్లలో సన్న బియ్యం ఇవ్వలేదు, రేషన్ కార్డులు ఇవ్వలేదు, మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించలేదు. ప్రజలను దోచుకున్న బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ముసలి కన్నీరు కారుస్తున్నారు' అని మండిపడ్డారు. యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణం పేరుతో భారీగా కమిషన్లు నొక్కేశారని, అభివృద్ధి సాకుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవనోపాధిని దెబ్బతీశారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మహిళల ఆత్మగౌరవం పెరిగిందని, ఆటో కార్మికులకు జీవనోపాధి లభించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణంలో 220 ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేయగా, ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. యాదగిరిగుట్ట రింగ్ రోడ్డు విస్తరణలో ఒకటో వార్డులో ఇళ్లు కోల్పోయిన 74 మంది బాధితులకు త్వరలోనే పట్టా సర్టిఫికెట్లు అందిస్తామని వెల్లడించారు.'అధికారంలో లేని మీరు ప్రజలకు ఏం చేయగలరు? అభివృద్ధిని జీర్ణించుకోలేక విమర్శలు చేయడం మానేసి, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా సూచనలు ఇవ్వండి' అని బీఆర్ఎస్ నేతలకు అయిలయ్య హితవు పలికారు. ప్రజలకు అన్యాయం చేసిన వారికి ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య, బొలగాని సత్యనారాయణ, సత్యం గౌడ్, బంధారపు బిక్షపతి, కళ్లెం కృష్ణ, భరత్ గౌడ్, హేమేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అవినీతికి చరమగీతం

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

మోత్కూరు, తిరుమలగిరి గడ్డపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే..

కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని గెలిపించాలి



**ప్రజాపక్షం/మోత్కూరు** : రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అవినీతి పాలనకు ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 11న జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటడం ఖాయమని, తిరుమలగిరి, మోత్కూరు మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరడం చారిత్రక అవసరమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని మోత్కూరు, తిరుమలగిరి మున్సిపాలిటీల్లో నిర్వహించిన ఎన్నికల రివ్యూ సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్, ఎన్నికల ఇంచార్జి బొజ్జు సంధ్య రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎంపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇందిరమ్మ స్ఫూర్తితో తెలంగాణలో సాగుతున్న ప్రజాపాలనను ప్రజలు మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నారని, ఆరు గ్యారంటీల అమలు తీరు పార్టీ గెలుపుకు సోపానమన్నారు. టిక్కెట్లు దక్కని నాయకులు నిరాశకు గురికావద్దని, పార్టీ నిర్ణయానికి కట్టుబడి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు. వారికి భవిష్యత్తులో పార్టీ పదవుల్లో, అభివృద్ధి పనుల్లో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, అందరూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగి మున్సిపాలిటీలను కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని ఎండగడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు.

## సిఎంఆర్ లక్ష్యాలు పెండింగ్ ఉండొద్దు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : కష్టం మిల్లింగ్ రైస్ ( సిఎంఆర్) ఈనెల 28 లోగా చెల్లించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ రైస్ మిల్లర్లను ఆదేశించారు.శుక్రవారం ఆయన తన చాంబర్లో 2024/25 సి ఎం ఆర్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.2024/25 కు సంబంధించిన సిఎంఆర్ లక్ష్యాలను ఎలాంటి పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. 2025/26 రబీ సీజన్ దృష్ట్యా మిల్లర్లు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని, గన్ని బ్యాగులను కార్పొరేషన్‌కు అప్పగించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి టి.వెంకటేష్,పౌరసరఫరాల డిఎం .బి రామ్ పత్తి, నల్లగొండ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ ,శ్రీనివాస్,భద్రాద్రి ఇంద్రారెడ్డి మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ గౌరు వెంకటేశ్వర్లు,బాబి, తదితరులు హాజరయ్యారు.

## వీరయ్య మరణం సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం/మోటకొండూర్** : చిట్టిగల్ల వీరయ్య మరణం సిపిఐకి తీరని లోటనీ సిపిఐ మోటకొండూరు మండల కార్యవర్గ సభ్యులు పసుల నరసింహ అన్నారు. మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సీనియర్ నాయకులు చిట్టిగల్ల వీరయ్య గత రెండు నెలల నుండి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం 8 గంటలకు తన ఇంటిలో తుది శ్వాస విడిచారు. వీరయ్య మృతదేహానికి సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పసుల నరసింహ, మంచాల రాధమ్మ, బోడిగే సుదర్శన్‌తో కలసి ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు గ్రామ శాఖ కార్యదర్శి పసుల నర్సింహ, మండల సహాయ కార్యదర్శి బొడిగే సుదర్శన్, మహిళా విభాగం మండల కార్యదర్శి, 2వ వార్డు మెంబర్ మంచాల రాధమ్మ, హామాలి సంఘం గ్రామ ఉప అధ్యక్షుడు చిట్టిగల్ల వెంకన్న, సభ్యులు సంగపాక శివమ్మ, అడేపు చంద్రమ్మ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : మున్సిపల్ ఎన్నికల విధులకు నియమించబడిన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ కోరారు. ఇందుకుగాను అన్ని మున్సిపాలిటీల లో ఓటరు ఫసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.మునిసిపల్ ఎన్నికల పై శుక్రవారం అయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 7,8 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంటుందని అందువలన ఎన్నికల విధులలో నియమితులైన ఉద్యోగులందరూ ఫామ్ 12 సమర్పించాలని కోరారు.ఓటరు చీటీల పంపిణీలో భాగంగా అన్ని మున్సిపాలిటీలలో 54 చీటీలను పంపిణీ పంపిణీ చేయాలన్నారు.ఈ నెల 13న నిర్వహించే ఓట్ల లెక్కింపుకు కౌంటింగ్ కేంద్రాలలో సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని,కౌంటింగ్ కేంద్రాల వద్ద బారికేడింగ్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే మీడియా కేంద్రం ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రంలో వినియోగించే , కౌంటింగ్ ఏజెంట్ల నియామకం వంటివి ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, నల్లగొండ ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి ,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ,చండూర్ ఆర్‌డిఓలు, మున్సిపల్ కమిషనర్లు మాట్లాడారు.

**ఓట్ల లెక్కింపు సిబ్బంది ర్యాండమైజేషన్**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సిబ్బంది ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా ఎన్నికల పరిశీలకులు,రాష్ట్ర ఎస్‌సిఈఆర్‌టి డైరెక్టర్ జి.రమేష్ సమక్షంలో జిల్లా కలెక్టర్ జి.చంద్రశేఖర్ ఛాంబర్‌లో నిర్వహించడం జరిగింది.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్,నందికొండ, చండూరు, చిట్యాల, దేవరకొండ, హాలియా, మిర్యాలగూడ మున్సిపాలిటీలలోని 162 వార్డులకు,475 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 20 శాతం రిజర్వ్ తో కలుపుకొని 270 మంది కౌంటింగ్ స్టాఫ్,540 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు ,మొత్తం 810 మంది సిబ్బందికి సంబంధించిన ర్యాండమైజేషన్ ను నిర్వహించడం జరిగింది.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో 56 కౌంటింగ్ టేంటింగ్,16 ఆర్‌ఓ మొత్తం 72 ,నందికొండ మున్సిపాలిటీకి సంబంధించి 12 ఓట్ల లెక్కింపు ,4ఆర్ ఓ ,చండూరు మున్సిపాలిటీకి సంబంధించి 10 కౌంటింగ్ టేంటింగ్, 4 ఆర్ ఓ ,చిట్యాల మున్సిపాలిటీలో 12 కౌంటింగ్ టేంటింగ్ లు, 4ఆర్ ఓ ,దేవరకొండ మున్సిపాలిటీలో 20 కౌంటింగ్ టేంటింగ్ లు ,7ఆర్ వో టే లు ,హాలియా మున్సిపాలిటీలో 12 కౌంటింగ్ టేంటింగ్ లు ,4ఆర్‌ఓ , మిర్యాలగూడ మున్సిపాలిటీకి సంబంధించి 49 కౌంటింగ్ టేంటింగ్ లు ,16 ఆర్ ఓలను ఏర్పాటు చేయనున్నారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి ,ఈడీఎం దుర్గారావు, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్, ఎన్నికల డిటి విజయ్, తదితరులు ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**18 గుర్తింపు కార్డులలో ఏదో ఒక కార్డును గుర్తింపుగా చూయించాలి**

ఈ నెల 11న నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు, జిల్లాలోని మున్సిపాలిటీలకు జరుగనున్న మునిసిపల్ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఎన్నికల సంఘం అనుమతించిన 18 గుర్తింపు కార్డులలో ఏదో ఒక కార్డును గుర్తింపుగా చూయించి ఓటు హక్కును వినియోగించుకో వచ్చని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు.ఆధార్ కార్డ్,పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు,పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసిన ఫోటో ఉన్న సర్వీస్ గుర్తింపు కార్డు, ప్రభుత్వ రంగ బ్యాంకులు ఫోటో ఉన్న గుర్తింపు కార్డు, ఫోటోఉన్న రేషన్ కార్డును పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హాలియా:** కాంగ్రెస్ పార్టీతోనే హాలియా మున్సిపాలిటీ అభివృద్ధి జరుగుతుందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం ఆయా వార్డుల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఏడవ వార్డులో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న చింతల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ జన సందోహం నడుమ ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి ప్రచారం హోరెత్తింది. చింతల చంద్రారెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం శ్రమిస్తారని మా పార్టీ తరఫున పోటీ చేసిన ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని స్థానికులకు వివరించారు. హాలియా మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. చంద్రారెడ్డి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తారని చెప్పారు. అలాంటి అభ్యర్థిని ఏడో వార్డు ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఏడవ వార్డు అభ్యర్థి చింతల చంద్రారెడ్డి, చింతల దీప్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, ఆరో వార్డు అభ్యర్థి బొంగరాల యేసు రాజు, వెంపటి శ్రీనివాస్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజాన్ని మార్చేది విద్యార్థులే

నల్లగొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పుస్తకం చదివే విద్యార్థులకే రేపటి సమాజాన్ని మార్చే శక్తి ఉందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ అన్నారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని దోమలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పి ఆర్ ఆర్ ఫౌండేషన్ రూపొందించబడిన మెరిట్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ఎస్పి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజాన్ని మార్చే శక్తి విద్యకే ఉందని అన్నారు. ప్రతిభకు గుర్తింపు లభించినప్పుడే విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే పట్టుదల దృఢ సంకల్పం తప్పనిసరి అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చలం పాండురంగారావు ను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి, రూరల్ ఎస్ఐ సైదా బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ విద్యార్థులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షమే

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలపక్షాన నిలిచిన పార్టీ అని, ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం 7వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం, మౌళిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ సౌకర్యాల విస్తరణ వంటి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో పట్టణ అభివృద్ధి మరింత వేగంగా సాగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. 7వ వార్డు అభ్యర్థి పెద్దమామ శ్రీరాములును ఆదరించి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు.





## అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వీధుల్లో బైక్‌ర్యాలీ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ 20వవార్డు కౌన్సిలర్ అభ్యర్థి కొలిశాయి మానసగోపాలాచారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సుబ్రమణ్యస్వామి దేవాలయంనుండి ఐఎంఏస్కూల్, నాగర్‌కర్నూల్ మోడల్‌స్కూల్ , 20వవార్డు పురవీధులగుండా బైక్‌ర్యాలీ నిర్వహించి సిపిఐపార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థి కొలిశాయి మానసగోపాలాచారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నిరంతరం పోరాడే పార్టీకి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గల్లీనుండి ఢిల్లీదాకా ప్రతి సమస్యపై పోరాడి రైతుకూలీ వ్యవసాయకూలీ కార్మికులకు, కర్షకులకు , యువతీ యువకుల తరఫున ఎన్నో హక్కులుసాధించి పెట్టిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శివశంకర్, పెరుమాళ్లగోపాల్, బండిలక్ష్మీపతి, తెప్పెటకిరణ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వాడాలబాలపీర్, హుస్సేన్, వెంకటయ్య, చంద్రకళ పాల్గొన్నారు.



## కల్వకుర్తి మున్సిపాలిటీలో ఊపందుకున్న కాంగ్రెస్ ప్రచారం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మున్సిపాలిటీలోని అన్నివార్డుల్లో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీకోఆప్షన్‌సభ్యులు మహ్మద్ ఖలీల్ సూచనమేరకు కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి మతీన్‌ఖాద్రీ 15,16 వార్డుల్లో ఇంటింటికి తిరిగి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు పసుల లలిత, కుదుముల అన్వితచంద్రకాంత్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ పసుల రమాకాంత్‌రెడ్డి, నాయకులు మసుల రాజయాదవ్, చక్రం, విక్కి, ఖుద్దూస్, బాలగౌడ్, సలాం, అబ్బు పాల్గొన్నారు.

## ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు



**ప్రజాపక్షం/నారాయణపేట :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను, పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోల్ట్స్ పోలీసులు నరసింహా, రవి లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం నారాయణపేట పాత బస్టాండ్ , ప్రధాన చౌరస్తాల్లో, బ్యాంకు ల వద్ద నారాయణపేట పోలీసులు నరసింహా ఆధ్వర్యంలో ఫింగర్ ప్రింట్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తనిఖీ లో భాగంగా ఆపి పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పోలీసులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఎస్సై ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




## ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఏర్పాటు

**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండల పరిధిలోని హిందూపూర్ హైవేలో ప్రమాదాల నివారణకు గ్రామ ప్రజల సూచనతో ఎస్సై నవీద్ శుక్రవారం బారికేడ్లు ఏర్పాటు చేశారరు. ఈ సందర్భంగా ఎస్ఐ నవీద్ మాట్లాడుతూ బారికేడ్లను ఏర్పాటు చేయడంతో వాహని వేగాన్ని నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చూడవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. రహదారి నియమాలను పాటించి వాహనాలను నడపాలన్నారు. అలాగే గ్రామ సర్పంచ్ కూ అశ్విని మహేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ప్రాణ రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## అభివృద్ధి కాంక్షించి... గెలిపించండి


### మున్సిపల్ పోరులో 9వ వార్డు అభ్యర్థి శైవిరెడ్డి

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మున్సిపాలిటీ 9వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శైవి రెడ్డి బరిలో ఉండి ప్రచారంలో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన వివిధ పథకాలు అమలు చేస్తున్న విధానాన్ని వివరిస్తూ 9వ అభివృద్ధి కాంక్షించి ఓటర్లు తమ హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అవినీతికి తావులేకుండా నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డు పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. నిత్యం స్థానికంగా, ప్రజలకు అందుబాటులో ఉండే తనకు ఈ సారి అవకాశం ఇచ్చి వార్డు అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని 9వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి శైవిరెడ్డి, ఓటర్ మహశయులను విజ్ఞప్తి చేశారు.



# మంత్రి దామోదర రాజనర్సింహ్మ, ఎమ్మెల్యే యెన్నం ఇంటింటి ప్రచారం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి, మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లోని అంబేద్కర్ కాలనీ (60వ డివిజన్‌లో) ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 60వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మహ్మద్ ఉమర్ కొత్వాల్‌కి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను వారు కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత, మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వినోద్ కుమార్, టిపిసిసి అధికార ప్రతినిధి, జహీర్ అక్తర్, డిసిసి ఉపాధ్యక్షుడు సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి వేముల కృష్ణయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మహ్మద్ ఉమర్, కొత్వాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి మంత్రివర్యులు దామోదర రాజనర్సింహతో కలిసి మహబూబ్‌నగర్ నగరంలోని ఏనుగొండ ప్రాంతంలో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ , జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి , రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మిథున్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత, మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్‌కుమార్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, తో పాటు ఏనుగొండ అప్పన్నపల్లి, ఎదిర, దివిటిపల్లి, కార్పొరేటర్‌గా పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** జిల్లాలో ఈనెల 11వ తేదిన మున్సిపాలిటీలకు జరగనున్న రెండవ సాధారణ ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్స్, ఎన్నికల అనంతరం ఈనెల 13న లెక్కింపుకు సంబంధించి లెక్కింపు కేంద్రాలను పాలమూరు యూనివర్సిటీ నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సాధారణ పరిశీలకులు, కాత్యాయని దేవితో కలిసి పరిశీలించారు. పాలమూరు యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనంలో మహబూబ్‌నగర్ కార్పోరేషన్, దేవరకద్ర మున్సిపాలిటీ ఓట్ల లెక్కింపు, ఫార్మాస్యూటికల్ కళాశాల భవనంలో భూత్పూర్ మున్సిపాలిటీ ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. కౌంటింగ్ కేంద్రంలలో కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సాధారణ పరిశీలకులు సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మున్సిపల్ కార్పోరేషన్ ఈఈ మురళి మోహన్ రెడ్డి, అర్బన్ తాహసిల్దార్ ఘన్సీరాం ఇతర జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.



## కాంగ్రెస్‌పార్టీకి ఓటేయ్యండి... కల్వకుర్తి అభివృద్ధికి సహకరించండి

### ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల్లోభాగంగా శుక్రవారం 9వవార్డు చిత్తారిఎల్లమ్మ , 20వవార్డు చిమ్ముల లలితను అధికమెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి బలరాం నగర్‌కాలనీ , ఇంద్రానగర్‌కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వార్డుల ఓటర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలన్ని అమలుపరుస్తుందని చెప్పారు. అనంతరం ఇంద్రానగర్ కాలనీలో కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల ఇంచార్జీ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి కార్నర్‌మీటింగ్ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లతో పాటు రేషన్‌కార్డులు అందజేసిందని తెలిపారు. టిఆర్ఎస్‌పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లలో ఏనాడు పేదప్రజల సంక్షేమం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం బడుగుబలహీనవర్గాల సంక్షేమంకోసం పాటుపడుతుందన్నారు. కల్వకుర్తి అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కల్వకుర్తిలో నెలకొన్న సమస్యలని నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు చిమ్ములశ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్‌చైర్మన్ మనీలసంజీవ్‌కుమార్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిర్మాణాలు కెసిఆర్‌వి.. విధ్వంసాలు రేవంత్‌రెడ్డివి

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** రాష్ట్రంలో బిఆర్ఎస్ హయాంలో కెసిఆర్ అభివృద్ధిని నిర్మిస్తే నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాటిని విధ్వంసం చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వనపర్తిలోని 1,2,13,14 వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల తరపున ఆయన ముమ్మర ప్రచారం నిర్వహించారు. కమాన్ చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ప్రజలను వంచించిందని విమర్శించారు. 16 ఏళ్ల కిందట జిల్లాను ఏర్పాటు చేసి, పరిపాలన సౌలభ్యం కోసం 55 రకాల కార్యాలయాలను నిర్మిస్తే, వాటిని రద్దు చేస్తానంటున్న రేవంత్‌రెడ్డికి ఓటు వేయాలా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందని, మహిళలకు రూ.2500, కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం , రూ.4000 ఆసరా పెన్షన్లు, రైతు భరోసా, స్కూటీల వంటి హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల వేతనాలు 42 శాతం పెంచి గౌరవించిందని, 1.63 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, బి.లక్ష్మయ్య, రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, వేణుగోపాల్, గులాం ఖాదర్ ఖాన్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం బస్తాల్లో బరువులోటు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్)లో భాగంగా స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా అవుతున్న బియ్యం బస్తాల్లో నిర్దేశిత బరువు కన్నా తక్కువగా బియ్యం ఉండటం వల్ల మండలంలోని రేషన్ డీలర్లు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో బస్తాలో తప్పనిసరిగా 50 కిలోల బియ్యం ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం అందుతున్న బస్తాల్లో ఒక కిలో నుంచి ఒక కిలో 320 గ్రాముల వరకు బియ్యం తక్కువగా వస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. పానుగల్ మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ నుంచి వీపనగండ్ల మండలంలోని రేషన్ దుకాణాలకు సరఫరా అవుతున్న బియ్యం బస్తాల్లో ఈ బరువు లోటు సమస్య కొనసాగుతుండటంతో ఆ లోటును తామే భరించాల్సి వస్తోందని డీలర్లు వాపోతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ప్రతి లబ్ధిదారుడికి కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా వ్యక్తికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయాల్సి ఉండటంతో, బస్తాల్లో తక్కువగా వచ్చిన బియ్యాన్ని డీలర్లు తమ జేబు నుంచి భర్తీ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదని వారు తెలిపారు. ఒక్క బస్తాలోనే కిలోన్నరకు పైగా బియ్యం తక్కువగా వస్తే, నెలకు వందల సంఖ్యలో బస్తాలు తీసుకునే డీలర్లపై ఇది భారీ ఆర్థిక భారంగా మారుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే తక్కువ కమిషన్లు, హమాలి ఖర్చులు, రవాణా వ్యయాలు పెరగడం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న తమపై ఈ బియ్యం బరువు లోటు మరింత భారంగా మారిందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈవ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి, స్టాక్ పాయింట్ నుంచి రేషన్ దుకాణాల వరకు బియ్యం తూకంలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని డీలర్లు డిమాండు చేశారు. తక్కువ బరువుతో వస్తున్న బస్తాల సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే, భవిష్యత్తులో ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

## అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 21 వార్డు నుండి పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.రామాంజనేయులు అంజిని గెలిపించాలని 21వ వార్డు అభ్యర్థి కోరారు. శుక్రవారం వార్డులోని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహాయ సహకారాలతో 21వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసినట్లు చెప్పారు. వార్డు అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యే మద్దతు దారుడైన నన్ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వార్డులో పలు సమస్యలు ఉన్నాయని. వాటిని ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరిస్తానని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఆ పార్టీ నుండి పోటీ చేస్తున్న నన్ను ఓటర్లు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలు ఒకసారి ఆలోచించి హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## మున్సిపల్ ఎన్నికల్లో పిఒ, ఎపిఒల పాత్ర కీలకం

### కలెక్టర్ సిక్తాపట్నాయక్

**ప్రజాపక్షం/మక్తల్ :** మున్సిపాలిటీ ఎన్నికలలో పివో ఏపివోల పాత్ర కీలకమని, ఈనెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కోసం మక్తల్ మున్సిపాలిటీకి కేటాయించబడిన పీవో, ఏపీవోలకు మక్తల్ పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణా శిభిరాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికలలో పనిచేసిన అనుభవంతో మున్సిపాలిటీ ఎన్నికలను కూడా సజావుగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ ప్రక్రియను జరిపించాలని, పీవోలు హ్యాండ్ బుక్ ను పూర్తిగా చదివి అందులోని నియమ నిబంధనల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయితీ ఎన్నికల పోలింగ్ మధ్యాహ్నం వరకే ముగిసిందని, వెంటనే ఓట్ల లెక్కింపు ఉండేదని, కానీ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని ఓట్ల లెక్కింపునకు మధ్యలో ఒకరోజు గ్యాప్ ఉంటుందని ఆమె తెలిపారు. మక్తల్ మున్సిపాలిటీకి సంబంధించి మొత్తం 16 వార్డులకు గాను 38 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ రాజేందర్ గౌడ్, తాహసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు, ఇంజనీర్, మేనేజర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## బాల్య వివాహాలు అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత

### జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**ప్రజాపక్షం/వనపర్తి :** భారతదేశంలో బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అన్నారు. శుక్రవారం ఐడిఓసి ప్రాంగణంలో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆర్‌డిఎస్ గ్రామీణ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిర్మూలన ప్రచార వివాహనికి జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డితో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రచార వాహనం ద్వారా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారు వనపర్తి, మహబూబ్‌నగర్ , గద్వాల జిల్లాలలో ఒక్కో జిల్లాలో 10 రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాలు, చట్ట ప్రకారం పడే శిక్షలపై విస్తృత ప్రచారం చేయనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు, జరిగే ప్రమాదాలు ఉంటాయన్నారు. పుట్టబోయే పిల్లలు శారీరక ఎదుగుదల లేకపోవడం, తల్లి బిడ్డలు అనేక రోగాల బారిన పడి జీవితాలు నాశనం అయిపోతాయని తెలిపారు. బాల్య వివాహాలు చేసే వారిపై ఎలాంటి జాలి లేకుండా చట్ట ప్రకారం కఠిన శిక్షలు వేయడం జరుగుతుందని ఈ విషయాలను గ్రామస్థాయిలో ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098 లేదా 100/112 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాలు అరికట్టేందుకు రూపొందించిన ప్రతిజ్ఞ చేశారు. సంతకాల సేకరణలో భాగంగా ఫ్లెక్సీ పై సంతకాలు చేశారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్యానాయక్, ఆర్డీఎస్ కోఆర్డినేటర్ చిన్నమ్మ థామస్, ప్రోగ్రాం ఆఫీసర్ చూచేత, సహాయ ప్రోగ్రాం ఆఫీసర్ జూవెద్ ఖురేషి, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, పిడి. డిఆర్‌డిఓ ఉమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.సాయినాథ్ రెడ్డి , డిసిపిఓ రాంబాబు, కలెక్టరేట్ సిబ్బంది ఉన్నారు.




## క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లు

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా, న్యాయబద్ధంగా ఎటువంటి నియమ నిబంధనలను ఉల్లంఘించకుండా జరుగుతున్నాయా మైక్రో అబ్జర్వర్‌లు నిశితంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎస్.వి.ఎస్ కళాశాల ఆడిటోరియం లో శుక్రవారం జరిగిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్, భూత్పూర్ దేవరకద్ర మున్సిపాలిటీలకు ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు నిర్వహించబడుతున్నందున, ఎన్నికల ప్రక్రియను నిశితంగా గమనించేందుకు గుర్తించబడ్డ క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లను నియమిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయితీ ఎన్నికల ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయని అదే విధంగా రాబోయే మున్సిపల్ ఎన్నికలు కూడా సజావుగా, పారదర్శకంగా,స్వేఛ్ఛాయుతంగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు, పంచాయితీ ఎన్నికలతో పోల్చుకుంటే భిన్నంగా ఉంటాయని, ఇవి రాజకీయ పార్టీల అధారంగా జరిగే ఎన్నికలు కావడంతో, పోటీ తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా గమనిస్తూ, ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలకు విరుద్ధంగా జరిగే ఏ చిన్న ఘటన జరిగినా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నవీన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ చంద్రశేఖర్, ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు పూర్తి

### జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కోసం మొదటి ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందిని కేటాయింపును పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ తెలిపారు. శుక్రవారం ఐడిఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గద్వాల్, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీలలో మొత్తం 76 కౌంటింగ్ టేంటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కౌంటింగ్ కేంద్రాలలో విధులు నిర్వర్తించేందుకు 76 మంది సూపర్వైజర్లు,152 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు కలిపి మొత్తం 228 మంది సిబ్బందిని మొదటి ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ విధుల కోసం అవసరమైన సిబ్బందిని కేటాయించడంతో పాటు అధనంగా 20 శాతం సిబ్బందిని రిజర్వ్‌గా ఉంచినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ అధికారుల కేటాయింపులో పూర్తి పారదర్శకతను పాటిస్తూ, ఎన్ఐసీ సాఫ్ట్ వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పాదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, ఎన్నికల సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## టెండర్ ఓట్లకు తావివ్వొద్దు

### జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం/పెబ్బేరు :** మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి టెండర్ ఓట్లు పడకుండా జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని జడ్పిహెచ్ఎస్‌లో ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి టెండర్ ఓట్లు పడకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఓటు వేయడానికి వచ్చే వారి గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఏవైనా అనుమానాలు ఉంటే మరో గుర్తింపు కార్డును అడిగి ధృవీకరించుకోవాలన్నారు. ఎన్నికల వ్యయం పరిశీలకులు శ్రీనివాస్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ ఆరిపుద్దీన్, తాహసిల్దార్, శ్రీమంతుల మురళిగౌడ్, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

‘100 మిలియన్ ప్లస్ వ్యూస్‌తో సరికొత్త కంటెంట్‌తో ఆడియెన్స్‌ను థ్రిల్ చేస్తున్న ఆహా ఓటిటి అందించిన మరో ఎగ్జైటింగ్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ ‘ధూల్ పేట్ పోలీస్ స్టేషన్’. 50 ఎపిసోడ్స్ ఉన్న ఈ సిరీస్ సూపర్బ్ రెస్పాన్స్ దక్కించుకుంటోంది. తెలుగుతో, తమిళంలలో సిరీస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.’

రీల్

## టెలివిజన్ రికార్డులను బద్దలు కొట్టిన మిరాయ్

సూపర్ హీరో తేజసజ్జా 'మిరాయ్' జైత్రయాత్ర కొనసాగిస్తోంది. థియేటర్‌లలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం, ఓటిటి, ఇప్పుడు టెలివిజన్‌లోనూ సంచలన రికార్డులు సృష్టిస్తూ అరుదైన ఘనతను సాధించింది.కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో బ్యానర్ టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన మిరాయ్ ఫాంటసీ, ఎమోషన్, యాక్షన్‌తో థియేటర్‌లలో బ్లాక్‌బాస్టర్‌గా నిలిచింది. అనంతరం హాట్ స్టార్ ఓటిటి ప్లాట్‌ఫామ్‌లనూ యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల నుంచి భారీ వ్యూయర్‌షిప్‌ను దక్కించుకుంది. 2026లో ఇప్పటివరకు ఏ సినిమాకు లభించని అత్యధిక టీఆర్‌పిగా ఇది రికార్డ్ అయింది. ఓటిటి రిలీజ్‌ల కారణంగా టీవీ వ్యూయర్‌షిప్ తగ్గుతున్న ఈ రోజుల్లో మిరాయ్ అద్భుతం చేసింది. మిరాయ్ హిందీ వెర్షన్ కూడా 2025లో ప్రసారమైన టాప్ రేటెడ్ చిత్రంగా నిలిచింది. దేశవ్యాప్తంగా సినిమాకు వచ్చిన ఈ స్పందన, సిక్వెల్ పై ఆసక్తి, డిమాండ్‌ను మరింత పెంచింది.థియేటర్‌లో ఓటిటి, శాటిలైట్.. మూడు మాధ్యమాల్లోనూ ఘన విజయాలు సాధించిన మిరాయ్, తేజ సజ్జాను భారతీయ సినిమా పరిశ్రమలో మోస్ట్ ప్రామెసింగ్ యంగ్ స్టార్ గా నిలబెట్టింది.





## ‘వెంకట్రామయ్య గారి తాలూకా ’ఫస్ట్ లుక్ లాంచ్

**– ఆవిష్కరించిన నిర్మాత దగ్గుబాటి సురేష్**

సీనియర్ నటుడు మురళీధర్ గౌడ్, సీనియర్ నటి సుధ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘వెంకట్రామయ్య గారి తాలూకా’. ‘జయమ్మ పంచాయతీ’ మూవీ ఫేమ్ దినేష్ కుమా ర్ హీరోగా, ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గ నటించారు. తండ్రి, పిల్లల మధ్య భావోద్వేగాల నేపథ్యంలో వారి వారి బాధ్యతలను తెలియజేసేలా రూపొందిన ఈ సినిమాను డైరెక్టర్ సతీష్ ఆవాల తెరకెక్కిస్తున్నారు. కోమలి క్రియేషన్స్ బ్యానర్ కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం పల్లెటూరి నేపథ్యంలో సాగే క్యూట్ లవ్‌స్టోరీతో పాటు ఫాదర్ సెంటిమెంట్ ప్రధానంగా ఉండనుంది. ఈ చిత్రంలో సీనియర్ దర్శకుడు, రచయిత, నటుడు యనమదల కాశీవిశ్వనాథ్, మిర్చిమాధవి, జబర్దస్త్ ఫేం సత్యశ్రీ, మొగలిరేకులు సీరియల్ ఫేం ఇ క్బాల్, జీవ నప్రియ, గౌరీనాయుడు, హరీష్ టెక్కలి, హాసిని యామిని కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీ టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ పోస్టర్ను తాజాగా తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీనియర్ నటుడు మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ..‘‘ఈ చి త్రంలో వెంకట్రామయ్య గారు పాత్రను నేను పోషించా. నేను మనసు పెట్టి ఆత్మతో చేసిన సినిమా ఇది. తల్లిదండ్రుల ఆవేదన, పిల్లల బాధ్యతను చెప్పే సినిమా ఇది. గొప్ప కుటుంబ కథా చిత్రంగా ఉ ంటుంది.’’ అని చెప్పారు. నిర్మాత కోమలి మాట్లాడుతూ..‘‘సింగర్ అ యిన నేను ఈ సినిమాతో నిర్మాతగా మారాను. ఈ సినిమాలో నటించిన అందరూ నాకు బాగా సపోర్ట్ చేశారు. వీని ఉగాది సందర్భంగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సతీష్, నటి మిర్చి మాధవి, నటి సత్యశ్రీ,క్రియేషన్స్ నిర్మాతలు: కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ పాల్గొన్నారు.

## ‘ఆల్–టైమ్’ రీజినల్ ఇండస్ట్రీ హిట్



సంక్రాంతి పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన మెగాస్టార్ చిరంజీవి 'మన శంకర వర ప్రసాద్ గారు' బాక్సాఫీస్ సంచలనంగా మారింది. ఈ చిత్రం థియేటర్‌లలో విజయవంతంగా 25 రోజులు పూర్తి చేసుకుని, అన్ని ప్రాంతాలలోనూ అద్భుతంగా కొనసాగుతోంది. ఈ చిత్రం ఇప్పటికే ఎన్నో రికార్డులను బద్దలు కొట్టింది.ప్రపంచవ్యాప్తంగా 375 కోట్ల మార్కును దాటిన ఈ చిత్రం ఇప్పుడు ఆల్‌టైమ్ రీజినల్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచి, అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూనే ఉంది. ఇది చిరంజీవి, అనిల్ రావిపూడి ఇద్దరికీ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ముఖ్యంగా, ఇది బుక్మైషోలో అత్యధిక టిక్కెట్ల అమ్మకాలతో కొత్త రీజినల్ రికార్డును కూడా నెలకొల్పింది. విదేశాలలో 3.5 మిలియన్ డాలర్ల మైలురాయికి చేరువలో ఉంది.విక్టరీ వెంకటేష్ కీలక పా త్రలో నటించినీ చిత్రం మరో మైలురాయిని చే రుకోవడానికి సిద్ధమౌతోంది. 400 కోట్ల మార్కును చేరుకునే దిశగా దూసుకుపోతోందని నిర్మాతలు సుస్మిత కొణిదెల, సాహు గారపాటి తెలిపారు.

## ‘టాక్సిక్’ హక్కుల ఖరీదు రూ.120 కోట్లు

రాకింగ్ స్టార్ యశ్ ప్రెస్టీజియస్ పాన్ ఇండిమా మూవీ ‘టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్ అప్స్’. మార్చి 19న ఈ మూవీ వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ కానుంది. రిలీజ్‌కు ముందే ఈ సినిమా సరికొత్త రికార్డ్‌ను క్రియేట్ చేస్తోంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఈ సినిమా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన హక్కులను రూ.120 కోట్ల (అడ్వాన్స్ ఆన్ కమీషన్ బేసిస్)కు సొంతం చేసుకోవటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నాన్ తెలుగు సినిమాకు జరిగిన ఆల్టైమ్ బిగ్గెస్ట్ బిజినెస్ డీల్‌గా మారింది. ఈ ఏడాది విడుదల కానున్న మోస్ట్ అవెయిటెడ్ మూవీగా టాక్సిక్ కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో టాక్సిక్ నిర్మాతల(కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టార్ మైండ్ క్రియేషన్స్)కు శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్కు మధ్య ఈ హిస్టారికల్ డీల్‌తో సినిమాపై బజ్ మరింతగా పెరిగింది. సినిమా రూపొందుతోన్న స్కేల్, సినిమాపై ఉన్న క్యూరియాసిటీ, బాక్సాఫీస్ రేంజ్ ట్రే ఉన్న గట్టి నమ్మకాన్ని ఇది మరింత స్పష్టంగా తెలియజేస్తోంది. ఎపి, తెలంగాణ హక్కుల కోసం మూడు అగ్ర సంస్థలు పోటీ పడగా చివరకు దిల్ రాజు నేతృత్వంలోని శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్‌కు ఈ డీల్ దక్కింది. దీంతో ఇటీవల ఇండియన్ సినీ హిస్టరీలో అత్యంత కీలకమైన డిస్ట్రిబ్యూషన్ డీల్స్‌లో ఒకటిగా నిలిచింది. రాకింగ్ స్టార్ యశ్ టాక్సిక్ సినిమాకు ఎపి, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వస్తోన్న భారీ స్పందన ఇవన్నీ చూస్తుంటే సినిమా ప్రారంభమైనప్పటి నుంచే దీనికి ఊహించని స్థాయిలో భారీ బజ్ క్రియేట్ అయ్యిందనే దానికి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ప్రాంతాలకు అతీతంగా యశ్కు వస్తోన్న ఆదరణ చూస్తుంటే ఓ స్టార్ హీరో కోసం దేశం యావత్తు ఏకమవుతోందనే అరుదైన ఫీలింగ్ కలుగుతోంది. కెజియఫ్ 2 తర్వాత యశ్ నెకట్స్ మూవీ కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారనేవిషయం ఇప్పటికే నెంబ ర్స్ రూపంలో, ప్రీ రిలీజ్ హైప్ రూపంలో స్పష్టంగా తెలుస్తోంది. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ దిల్ రాజు మాట్లాడుతూ ‘‘ఇండియన్ సినీ ఇండస్ట్రీలోని పెద్ద స్టార్స్‌లో యశ్ ఒక రు. కెజియఫ్ 2 తర్వాత ఆయన మార్కెట్ మరింతగా పెరిగింది. ఆయన నెకట్స్ సినిమా టాక్సిక్ కోసం ఆడియెన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత వస్తోన్న ఈ సినిమాపై ఉన్న అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి ప్రెస్టీజియస్ మూవీని మా ఎస్వీసీ బ్యానర్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు రానుండటం చాలా ఆనందంగా ఉంది. యశ్తో ఇలాగే మరిన్ని సినిమాలు చేయాలని ఆశిస్తున్నాం’’ అన్నారు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ భాగస్వామ్యం కావటం వల్ల టాక్సిక్ సినిమాపై నమ్మకం మరింతగా పెరిగింది. అందుకు కారణం దిల్ రాజు నేతృత్వంలోని ఎస్వీసీ బ్యానర్‌రు ఎన్నో భారీ చిత్రాలు, కంటెంట్ బేస్డ్ సినిమాలను రూపొందించి ఘన విజయాలను సాధించింది. నేషనల్ అవార్డ్స్ సాధించిన సినిమాలు, బ్లాక్ బస్టర్స్ సాధించిన సినిమాలను రూపొందించిన ఈ సంస్థపై ట్రేడ్ వర్గాలలో మంచి నమ్మకం ఉంది. టాక్సిక్ సినిమాతో ఎస్వీసీ బ్యానర్ జత కట్టటం అనేది కథ, స్కేల్, భారీగా థియేటర్స్‌లో సినిమా రన్ కావటం అనే అంశాలపై ఉన్న నమ్మకాన్ని మరింత స్పష్టం చేసింది. సినీ ఇండస్ట్రీకి ఎపి, తెలంగాణ ప్రాంతాలు ఎంతో కీలకమైనవి. కారణం, ఇక్కడ సినిమాను ప్రేక్షకులు ఎంతగానో ఆదరిస్తారు, గుండెలలో పెట్టుకుంటారు. కాబట్టి ఈ భాగస్వామ్యం టాక్సిక్ సినిమా ప్లస్ అయ్యిం ది. ప్రేక్షకులకు భారీ రిలీజ్, స్ట్రాంగ్ ప్రమోషన్లు, థియేటర్‌లలో ఫుల్ మాస్ ఫీలింగ్ గ్యారంటీ అనే ఫీలింగ్ వచ్చింది. యశ్, గీ తూ మోహన్దాస్ కలిసి కథను రాసి.. గీతూ మోహన్దాస్ దర్శకత్వం వహిస్తున్న ‘టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్’ సినిమాను ఇంగ్లిష్, కన్నడ భాషల్లో ఒకేసారి చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాను హిందీ, తెలుగు, తమిళం, మలయాళం సహా మరికొ న్ని భాషల్లో డబ్బింగ్ చేసి విడుదల చేస్తున్నారు. దీంతో ఈ చిత్రంపై అంతర్జాతీయ స్థాయిలో భారీ అంచనాలున్నాయి. ‘టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్’ సినిమాను కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్స్పై వెంకట్ కె.నారాయణ, యష్ నిర్మిస్తున్నారు. సినిమా 2026 మార్చి 19న ఈద్, ఉగాది, గుడి పడ్వా పండుగలు కలిసి వచ్చే లాంగ్ వీకెండ్ సమయంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్కు సిద్ధమవుతోంది.



## ‘మావందే’ తొలి షెడ్యూల్ పూర్తి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్ను ‘మా వందే‘ టైటిల్ తో సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు ప్రొడ్యూసర్ వీర్ రెడ్డి.ఎం. ఈ చిత్రంలో నరేంద్ర మోదీ పాత్రలో మలయాళ స్టార్ హీరో ఉన్ని ముకుందన్ నటిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ ప్రధాని మోదీ జీవితాన్ని యదార్ధ ఘటనల ఆధారంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు క్రాంతికుమార్.సీహెచ్. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యున్నత సాంకేతిక విలువలు, వీఎఫ్ఎక్స్ తో రూపొందుతోంది. ‘మా వందే‘ చిత్రాన్ని పాన్ ఇండియా భాషలతో పాటు ఇంగ్లీష్ లోనూ రిలీజ్ చేయనున్నారు. తాజాగా ఈ సినిమా హైదరాబాద్ లో ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. ఈ మొదటి షెడ్యూల్ షూటింగ్ లో సినిమాలోని పలు కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ‘మా వందే‘ టీమ్ మెంబర్స్ నెకట్స్ షెడ్యూల్ కోసం కాశ్మీర్ వెళ్తున్నారు. మ400 కోట్ల రూపాయలకు పైగా హ్యూజ్ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఈ స్టోరీ డ్రివెన్ మూవీని ప్రపంచంలో తొలిసారిగా తొలిసారి ఆరి అలెక్సా 265 జెంట్రీ, కుకీ లెన్స్ కెమెరాతో తెరకెక్కిస్తుండటం విశేషం. హాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ ఆక్వామ్యాన్ లో హీరోగా నటించిన జేసన్ మమొవాను ‘మా వందే‘ చిత్రంలో ఓ కీలక పాత్రకు సంప్రదిస్తున్నారు. రవీనా టాండన్, జగపతి బాబు, శరత్ కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. స్టంట్ కొరియోగ్రాఫర్ కింగ్ సోలామన్ , ప్రొడక్షన్ డిజెనర్ సాబు సిరిల్, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్, డీవోపీ కె.కె. సెంథిల్ కుమార్, మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ ఈ సినిమాకు పని చేస్తున్నారు.యాక్షన్ కింగ్ సోలొమన్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్, ఎడిటింగ్ శ్రీకర్ ప్రసాద్, డీవోపీ కె.కె. సెంథిల్ కుమార్, మ్యూజిక్ రవి బస్రూర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ గంధాధర్ ఎన్ ఎస్, వాణిశ్రీ .బి.లైన్ ప్రొడ్యూసర్ టీవీఎన్ రాజేశ్.

## ఉగాదికి గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్

### ఇండస్ట్రీ ప్రభుత్వాన్ని సొంతం చేసుకోవాలి
### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి





**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేస్తున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల వేడుకను ఈసారి ఉగాది పర్వదినాన ప్రదానం చేస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రసాద్ ల్యాబ్ లో గద్దర్ ఫిలిం అవారడ్స్ 2025 బ్రోకర్ ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత సామాజిక మార్పు కోసం కళల ద్వారా కృషి చేసిన వ్యక్తి గద్దర్ అని చెప్పారు. ఆయన పేరు మీద అవార్డులు ఇవ్వాలని సీఎం రేవంత్ ఆలోచన అని తెలిపారు. గతేడాది కూడా ఉగాదికే అవార్డులు ఇవ్వాలనుకున్నాం కానీ అప్పుడు సమయం చాలక కుదరలేదన్నారు.ఈ ఏడాది మాత్రం ఉగాది పర్వదినానే అవార్డులు ఇస్తున్నాం అని స్పష్టం చేశారు. సినిమా ఇండస్ట్రీ పెద్ద ఎత్తున హైదరాబాద్‌లో వ్యవస్థీకృతం కావాలన్నారు. హైదరాబాద్ నగరం బేస్‌గా సినిమా హబ్ ఏర్పాటు చేయాలనే ప్రగాఢమైన సంకల్పం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని చెప్పారు. సినిమాకి అనుకూలమైన వాతావరణం, పరిస్థితులు హైదరాబాద్‌లోనే ఎక్కువ, ఈ అనుకూలమైన పరిస్థితులను పెద్ద ఎత్తున పాజిటివ్‌గా మలచుకోవాలి, దీని ద్వారానే హైదరాబాద్‌ని ఫిల్మ్ ఇండస్ట్రీ హబ్‌గా మార్చాలని అన్నారు. సామాజిక పరమైన సందేశాలివ్వవచ్చు, రాష్ట్ర ఆదాయ వనరులు సమకూర్చుకోవచ్చు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు సినిమాల ద్వారా కల్పించవచ్చు అని తెలిపారు. తెలుగు సినిమా ఇండస్ట్రీ ప్రపంచస్థాయికి ఎదగడం, అవార్డులు పొందడం ఆనందదాయకం, ముందు చూపుతో తెలంగాణ ప్రభుత్వం బ్లూ ప్రింట్‌తో ముందుకు సాగుతుందని అన్నారు. ఫిల్మ్ ఇండస్ట్రీకి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ వెన్నంటి ఉంటుంది, సహాయ సహకారాలు అందిస్తుంది, ఆర్థికపరమైన, సామాజిక పరమైన, లా అండ్ ఆర్డర్‌కి సంబంధించిన, ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ పరమైన అవసరాలను తీర్చడానికి మేం రెడీగా ఉన్నాం, అర్ధరాత్రి తలుపు తట్టిగా సహకరిస్తాం అని స్పష్టం చేశారు. ఏ అవసరాలు వచ్చినా సినిమాటోగ్రఫీ మినిస్ట్రీ ముం దుంటుంది, సినిమా ఇండస్ట్రీ ప్రభుత్వాన్ని సొంతం చేసుకోవాలని కోరారు. మేం కూడా సినిమా ఇండస్ట్రీని సొంతం చేసుకుంటున్నాం అని భట్టి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు, 2025 జ్యూరి కమిటి చైర్మన్, సంగీత దర్శకుడు మణిశర్మ, ఎఫ్ డి సి అధికారి కిషోర్ బాబు పాల్గొన్నారు.



## ఈ–ఆఫీస్ విధానం ద్వారా ఫైళ్లు సత్వర పరిష్కారం

### సివి ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈఆఫీస్ విధానం ద్వారా ఫైళ్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని, పరిపాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సివి ఆనంద్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభాగాధిపతుల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి. ఆనంద్ శుక్రవారం లక్డీకాపుల్ లోని ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డైరెక్టరేట్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన ‘ఈఆఫీస్’ అప్లికేషన్‌ను ప్రారంభించారు. సివి ఆనంద్ మాట్లాడుతూ.. ‘తెలంగాణ రైజింగ్ 2047’ విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా రాష్ట్రంలో కాగిత రహిత (పేపర్‌లెస్) పాలనను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రాసిక్యూషన్ విభాగంలో ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేసిన డైరెక్టర్‌ను, సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం, ప్రాసిక్యూషన్ విభాగం కోసం రూపొందించిన ‘ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నిర్వహణ వ్యవస్థ’ను ఆయన ప్రారంభించారు. ఈ డిజిటల్ విధానం వల్ల సిబ్బంది హాజరులో క్రమశిక్షణ, పారదర్శకత పెరుగుతుందని ఆయన తెలిపారు. కొత్త చట్టాల సమర్థవంతమైన అమలుకు తీసుకోవాల్సిన మరిన్ని చర్యలపై దిశానిర్దేశం చేశారు.

## చెన్నైలో నిలువెత్తు కార్ల్ మార్క్స్ విగ్రహం

**ఆవిష్కరించిన సిఎం ఎం.కె.స్టాలిన్**

**హాజరైన సిపిఐ, సిపిఎం, ఎండిఎంకె నాయకులు**





**చెన్నై :** చెన్నైలో ఏర్పాటు చేసిన జర్మన్ తత్వవేత్త, మార్క్సిజం, శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతకర్త కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ శుక్రవారం ఆవిష్కరించారు. గత ఏడాది ఏప్రిల్‌లో తమిళనాడు అసెంబ్లీలో ఆయన ప్రసంగిస్తూ ప్రపంచ విప్లవాత్మక నాయకుడిగా అభివర్ణించిన కార్ల్ మార్క్స్‌ను గౌరవించాలని, స్మరించుకోవాలని ద్రవిడ నమూనా ప్రభుత్వం సంకల్పించిందని ప్రకటించారు. ఆ మేరకు ఎగ్మోర్ మ్యూజియం కాంప్లెక్స్‌లో గ్రంథాలయం ఎదుట రూ.85.80 లక్షలతో మార్క్స్ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనిని మంత్రివర్గ సహచరులతో కలిసి ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వీరపాండియన్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం, విసికె అధ్యక్షులు తోల్ తిరుమావళవన్, ఎండిఎంకె అధినేత వైకో, తమిళనాడు పిసిసి అధ్యక్షుడు కె.సెల్వపెరుంతగైతో సహా వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరితో కలిసి మార్క్స్‌కు వీరవణక్కం (వీర వందనం) అంటూ స్టాలిన్ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొన్నెమారా పబ్లిక్ లైబ్రరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్ల్ మార్క్స్ ఫోటో ఎగ్జిబిషన్‌ను స్టాలిన్ తిలకించారు. మార్క్స్ జీవితంపై ఎఐతో రూపొందించిన ప్రత్యేక వీడియోను ఆయన వీక్షించారు. ‘మార్క్స్ విగ్రహ స్థాపన ప్రగతిశీల ఆదర్శాల పట్ల రాష్ట్ర నిబద్ధతకు ప్రతీక’ అని తన సోషల్ మీడియా పోస్ట్‌లో స్టాలిన్ పేర్కొన్నారు. ‘మార్క్స్‌ను ప్రతిష్ఠిస్తున్నాం. అసమానతను తొలగిస్తున్నాం. చెన్నై మరోసారి ఎరుపు రంగును పునరుద్ఘాటిస్తోంది. కార్ల్ మార్క్స్ గంభీరమైన విగ్రహం ఇప్పుడు చెన్నైలోని కొన్నెమారా పబ్లిక్ లైబ్రరీలో కొలువై ఉంది’ అని ఆయన అన్నారు. ‘ప్రగతిశీల ఆలోచనలు ఎక్కడి నుంచి వచ్చినా, వాటి నుండి మేము శక్తిని పొందుతాము. ఆధిపత్య శక్తులు ప్రబలడానికి ప్రయత్నించినప్పుడు, మేము వాటిని ప్రతిఘటిస్తాము. ఇదే మా ద్రవిడ నమూనా యొక్క సారాంశం.’ అని సిఎం స్టాలిన్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో స్పష్టం చేశారు.

## ఒమాన్ మధ్యవర్తిత్వం

**(మొదటి పేజీ తరువాయి)**

అలాగే అమెరికా మధ్యప్రాచ్య ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లతో సమావేశమయ్యారని తెలిపింది. ఈ సంప్రదింపులు దౌత్య, సాంకేతిక చర్చలను తిరిగి ప్రారంభించేందుకు అనుకూల పరిస్థితులను సృష్టించడంపై, దీర్ఘకాలిక భద్రత, స్థిరత్వం సాధించడంపై కేంద్రీకృతమయ్యాయని ఒమాన్ వ్యాఖ్యానించింది. ఈ చర్చలు ముగిసాయా? లేదా? అన్నది స్పష్టంగా తెలియకపోయినా, అమెరికా ప్రతినిధులు వెళ్లిన వెంటనే ఒమాన్ అధికారులు కూడా రాజప్రాసాదాన్ని విడిచిపెట్టారు. కాగా, ఇదే భవనాన్ని 2025లో జరిగిన ఇరాన్–అమెరికా చర్చల కోసం కూడా ఒమాన్ ఉపయోగించింది. ఈసారి, ముందుగా టర్కీలో ప్రాంతీయ దేశాల భాగస్వామ్యంతో చర్చలు జరపాలన్న యోచనలు గందరగోళంగా మారాయి. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకారం, 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్ పాలక వ్యవస్థ ప్రస్తుతం అత్యంత బలహీన స్థితిలో ఉందని అభిప్రాయం. గత నెల జరిగిన దేశవ్యాప్త నిరసనలు సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ పాలనకు అతిపెద్ద సవాలుగా మారాయి. వాటిని అణచివేయడానికి జరిగిన కఠిన చర్యల్లో వేల మంది మరణించగా, పదివేల మంది అరెస్టయ్యారని నివేదికలు చెబుతున్నాయి. దీనితో ట్రంప్ మరోసారి ఇరాన్‌పై సైనిక దాడుల హెచ్చరికలు జారీ చేశారు. అయితే, ప్రస్తుత చర్చల్లో ఇరాన్ అణు కార్యక్రమమే ప్రధాన అంశమని తేహరాన్ స్పష్టం చేసింది. కానీ, మూడు సంవత్సరాలు యురేనియం శుద్ధిని నిలిపివేయడం, అధికంగా శుద్ధి చేసిన యురేనియాన్ని దేశం వెలుపలికి పంపడం వంటి ప్రతిపాదనలు ఉన్నట్లు సమాచారం. ఇరాన్ కీలక సలహాదారు అలీ షమ్ఖానీ మాత్రం అలాంటి ప్రతిపాదనలను అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. అమెరికా మాత్రం అణు కార్యక్రమంతో పాటు బాలిస్టిక్ క్షిపణులు, ప్రాంతీయ మిలీషియాలకు మద్దతు, మానవ హక్కుల అంశాలన్నీ చర్చల్లో ఉండాలని కోరుతోంది.

ఈ నేపథ్యంలో మస్కట్ చర్చలు భవిష్యత్తులో అణు ఒప్పందం పునరుద్ధరణకు దారితీస్తాయా అన్నది కీలకంగా మారింది.

## యథాతథం

**(మొదటి పేజీ తరువాయి)**

తెలిపారు. 2025లో ఆర్‌బిఐ వడ్డీరేట్లలో గణనీయమైన మార్పులు చేసింది. ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో ఒక్కోసారి 25బేసిస్ పాయింట్లు తగ్గించింది. అనంతరం జూన్‌లో 50బేసిస్ పాయింట్ల భారీ కోత విధించింది. డిసెంబరులో మరో 25 శాతం తగ్గించడంతో మొత్తం ఏడాదిలో రెపో రేటు 1.25 శాతం వరకు తగ్గింది. ఈ తగ్గింపులతో రుణాలు చౌకగా మారి వినియోగం, పెట్టుబడులు పెరిగేలా చర్యలు తీసుకుంది. ఇప్పుడు ఆ ప్రభావాన్ని అంచనా వేసే దశలో ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**వృద్ధి అంచనాలు ఆశాజనకం**

దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని ఆర్‌బిఐ గవర్నర్ పేర్కొన్నారు. కార్పొరేట్ రంగంలో లాభాలు మెరుగుపడటం, అసంఘటిత రంగంలో స్థిరత్వం పెరగడం, తయారీ రంగానికి ఊతమివ్వనున్నాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధిరేటు 7.4 శాతం నమోదవుతుందని అంచనా వేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27)లో కూడా వృద్ధి కొనసాగుతుందని భావిస్తున్నారు. తొలి త్రైమాసికంలో 6.9 శాతం, రెండో త్రైమాసికంలో 7 శాతం వృద్ధి నమోదవ్వొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ, దేశీయ డిమాండ్ బలంగా ఉండటం ప్రధాన బలం అని తెలిపారు. ద్రవ్యోల్బణం కూడా నియంత్రణలోనే ఉందని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సగటు ద్రవ్యోల్బణం 2.1 శాతం ఉండొచ్చని అంచనా. అయితే వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం వరకు పెరగవచ్చని భావిస్తున్నారు. అయినప్పటికీ ఇది ఆర్‌బిఐ లక్ష్య పరిధిలోనే ఉందని గవర్నర్ తెలిపారు.

**వాణిజ్య ఒప్పందాల ప్రభావం**

భారత్– ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, త్వరలో కుదిరే భారత్– అమెరికా ట్రేడ్ డీల్ దేశ ఆర్థిక వృద్ధికి మరింత బలం చేకూరుస్తాయని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. ఎగుమతులు పెరగడంతో పాటు విదేశీ పెట్టుబడులు పెరిగే అవకాశముందని తెలిపింది. అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ పాత్ర మరింత విస్తరించనుందని గవర్నర్ వ్యాఖ్యానించారు.

## ఆత్మాహుతి దాడి

**(మొదటి పేజీ తరువాయి)**

పరిసర ప్రాంతమంతా కంపించింది. సంఘటన స్థలానికి వెంటనే పోలీసులు, సహాయతా బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. రాజధానిలోని ఆసుపత్రులన్నింటిలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్న కారణంగా, మృతుల సంఖ్య పెరికే అవకాశం ఉంది. ప్రారంభ నివేదికల ప్రకారం, దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ఏ ఉగ్రవాద సంస్థ వెంటనే ప్రకటించలేదు. అయితే పోలీసు వర్గాల సమాచారం మేరకు దాడి చేసిన వ్యక్తి విదేశీయుడిగా గుర్తించబడినట్టు, అతడికి ఫిత్నా అల్ ఖ్వారిజీగా పిలిచే తెహ్రీక్–ఎ–తాలిబాన్ పాకిస్తాన్ (టిటిపి)తో సంబంధాలు ఉండవచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. కాగా, పేలుడు స్వభావాన్ని ఇంకా లోతుగా దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ ఘటన జరిగిన ప్రాంతాన్ని ఆర్మీ, రేంజర్స్ పూర్తిగా ముట్టడి చేసి భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. పేలుడు జరిగిన ప్రదేశం చుట్టుపక్కల గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇది మూడు నెలల క్రితం ఇస్లామాబాద్‌లోని జిల్లా, సెషన్స్ కోర్టు భవనం సమీపంలో జరిగిన ఆత్మాహుతి దాడి తర్వాత మరో తీవ్రమైన ఘటన. ఇదే సమయంలో ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ పాకిస్తాన్ పర్యటనలో ఉండటం గమనార్హం. ఈ దాడి దేశ భద్రతపై, అంతర్జాతీయ స్థాయిలో పాకిస్తాన్ ప్రతిష్ఠపై ప్రశ్నలు లేవనెత్తింది. ఈ దాడిని అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్, సెనేట్ ప్రతిపక్ష నేత అల్లామా రాజా నాసిర్ అబ్బాస్ తీవ్రంగా ఖండించారు. నిరపరాధ పౌరులను లక్ష్యంగా చేసుకోవడం మానవత్వానికి వ్యతిరేకమని జర్దారి అన్నారు. ప్రార్థనా స్థలాలపై దాడులు మతం, సామాజిక విలువలపై ప్రత్యక్ష దాడులని అబ్బాస్ వ్యాఖ్యానించారు. కాగా, ఖైబర్ పఖ్తూన్ఖ్వా ప్రావిన్స్‌లో పాకిస్తాన్ భద్రతా దళాలు రెండు వేర్వేరు ఆపరేషన్లలో 24 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు సైన్యానికి చెందిన మీడియా విభాగం ఐఎస్‌పిఆర్ తెలిపింది. ఫిబ్రవరి 4–5 తేదీల్లో ఒరక్‌జై, ఖైబర్ జిల్లాల్లో ఈ ఆపరేషన్లు నిర్వహించారు. ఒరక్‌జై జిల్లాలో జరిగిన దాడిలో 14 మంది, ఖైబర్ జిల్లాలో మరో ఆపరేషన్‌లో 10 మంది ఉగ్రవాదులు మరణించారు. వీరంతా నిషేధిత టిటిపికి చెందినవారిగా, ప్రభుత్వ వర్గాలు వీరిని ఫిత్నా అల్ ఖ్వారిజీగా పేర్కొన్నాయి. ఎదురుకాల్పుల అనంతరం మిగిలిన ఉగ్రవాదుల్ని ఏరిపారేసేందుకు ముమ్మర సోదాలు జరుపుతున్నారు. ‘అజ్మ్–ఎ–ఇస్తెహ్కామ్’ వ్యూహం కింద ఉగ్రవాద ఏరివేత చర్యలు కొనసాగుతాయని సైన్యం స్పష్టం చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com